ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు

30-3-5



అందాలు చిందేటి అలివేణి
క్రొందవిమ్మ పాదాల పారాణి!

—చిత్రకారుడు: గోలి శేషయ్య, తెనాలి.


సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

సంపుటము 48
సంచిక 80
30.3-55

సచిత్రవారపత్రిక

Founder · K. NAGESWARA RAO

మన్మథ చైత్ర శుద్ధ సప్తమి బుధవారం



"సంధ్యా సమస్యలు

ఫోటో: పి. రామారావు—రాజమండ్రి.

దేశంతోపాటు అభ్యున్నతి నొందండి

మీరు భద్రపరిచిన సొమ్మును వీటిపై పెట్టుబడి పెట్టండి

భారత ప్రభుత్వం వారి

స్వల్ప ఆదాయాల పొదుపు విధానం

ఇలాగు చేస్తే భారతదేశపు ఈ ప్రణాళికల నిర్వహణకు తోడ్పడగలరు

- ★ సామాజికాభివృద్ధి కార్యక్రమం
- ★ గొప్ప నదీలోయ ప్రాజెక్టులు
- ★ సంఘ సంక్షేమ కార్యకలాపాలు
- ★ రైలు, రోడ్ల అభివృద్ధి

హామీగల ఆకర్షణీయమైన క్రింది సెక్యూరిటీలలో దేనికైనా మీ సొమ్మును వినియోగించండి.

12 సంవత్సరాల నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్లు	ఫలించినపుడు సాలుకు 4·16 పర్సెంటు చొప్పున వడ్డీ లభిస్తుంది. రు. 5/- నుండి రు. 5,000/- వరకు విలువలలో లభిస్తాయి. ప్రతి వ్యక్తి రు. 25,000/- వరకు పెట్టుబడి పెట్టవచ్చును.
10 సంవత్సరాల ట్రెజరీ సేవింగ్స్ డిపాజిట్ సర్టిఫికేట్లు	సాలీనా 3½ పర్సెంటు వడ్డీ చెల్లింపు; రు. 100/- కు ఎన్ని రెట్లలోనైనా రు. 25,000/- విలువ వరకు లభిస్తాయి. ప్రతి వ్యక్తి రు. 25,000/- వరకు పెట్టుబడి పెట్టవచ్చును.
10 సంవత్సరాల నేషనల్ ప్లాన్ సర్టిఫికేట్లు	ఫలించినపుడు సాలీనా 4½ పర్సెంటు వడ్డీ లభిస్తుంది. రు. 25/-, రు. 50/-, రు. 100/-, రు. 500/- విలువలలో లభిస్తాయి. ప్రతి వ్యక్తి రు. 1,000/- వరకు పెట్టుబడి పెట్టవచ్చును.
పోస్టు ఆఫీసు సేవింగ్స్ బ్యాంక్ అక్కౌంట్లు	రు. 10,000/- వరకు డిపాజిట్లపై 2% చొప్పున, మిగతా సొమ్ముపై రు. 15,000/- వరకు 1½% చొప్పున వడ్డీ చేర్చబడుతుంది.

15-సంవత్సరాల అన్యూయిటీ సర్టిఫికేట్లు

జారీచేయు ధరలు: రు. 3,500/-, రు. 7,000/- రు. 14,000/- రు. 28,000/- ప్రతి వ్యక్తి రు. 28,000/- వరకు పెట్టుబడి పెట్టవచ్చును.

15 సంవత్సరాల కాలంపాటుగా నెలసరి చెల్లింపుల రూపంగా పెట్టుబడి సొమ్ము సాలీనా 3½% చక్ర వడ్డీతో సహా వాపసు చేయబడుతుంది.

ఆదాయపు పన్ను లేనట్టి ఆకర్షణీయమైన ప్రతి ఫలం

మీకు హామీగా లభిస్తుంది

ఇతర వివరములకు మరియు/లేక ఈ పెట్టుబడులను గురించిన వివరములకై నేషనల్ సేవింగ్స్ కమిషనర్, సిమ్లా కు గాని, మీ రాష్ట్రములోని రీజనల్ నేషనల్ సేవింగ్స్ ఆఫీసరుకు గాని వ్రాయండి.

ఇండియా భవిష్యత్తు నిమిత్తం పెట్టుబడి పెట్టండి.

AC 630 TG

బారిష్టరు గారి బాత్రాఖానీ

మొక్కపాటి నరసింహశాస్త్రి

నేను ఉదయాన్నే లేచి, మా ఆవిడ చేసి ఇచ్చిన అమృతోపమానమైన కాఫీ త్వరగా అయిపోతుందేమోననే భయంతో, గుక్కెడు గుక్కెడు చొప్పున పీలుస్తున్నాను. స్నానం చెయ్యలేదు సరికదా అవసిష్టాలేనా అన్నీ తీర్చుకోలేదు. ఈ అమృత పానానంద పారవశ్యంలో ఉండగా, హాయిగా ముత్యంలా తలంటుకుని, క్రాపింగు సవరించి, లలాటాన కస్తూరి తిలకానికి ప్రత్యామ్నాయంగా ఎర్రనితిలకం దిద్ది, నూతన వస్త్రధారణచేసి, 'నమస్కారము మేష్టారూ! మీరు ఆశీర్వదించాలి' అంటూ ముకుళిత హస్తాలతో, మందస్మిత వదనంతో, మా టప్పయ్య ప్రత్యక్షమయ్యాడు. 'దిగి రాను, దిగి రాను, దివి నుండి భువికి' అనుకుంటున్న వాడిని తపీమని నేలమీద పడ్డాను.

'ఏమిటి విశేషం టప్పయ్యా! 'తలకడు గంగమర్దనము, ధౌత పటావరణంబు'... అన్నట్టు, అంత ముస్తాబై ఇలా తయారయ్యావేమిటి! ఎక్కడికేనా పెళ్లి కెడుతున్నావా - ఇంకా ఊరు నాలుగుమూలలా తెల్లవారలేదుకదా! అన్నాను.

బారిష్టర్లకేమో చెప్పలేము కాని, మా బోటి సామాన్య మానవులందరికీ తెల్లవారి జాము సేపయింది. ఈ నూతన వత్సరంబు, మీకు సర్వశుభముల నిచ్చుగాత' అంటూ శాస్త్రి తయారయ్యాడు.

Happy new year గురూజీ అంటూ శర్మ దిగాడు. నమస్తే గురుదేవ్! నమస్కారం గురువుగారూ! మనకు కొత్త సంవత్సరం ఎలా ఉంటుందో చూడాలి మీరు అంటూ ఏకగ్రీవంగా పలుకుతూ భద్రం, రామం కవల పిల్లలులా తయారయ్యారు.

మీ కెలా ఉంటుందో నేనింకా చెప్పలేను కాని నాకు మట్టుకు వ్యయంతో ప్రారంభిస్తోంది. పండగపూటేనా పెందరాడే లేచి చెంబుడు నీళ్లు పోసుకోకూడదుటండీ అని మా ఆవిడ అంటూనేఉంది. ఏమిటో వరాకుగా ఇది ఉగాది అన్న ధోరణే లేకపోయింది. ఇంత వరాకుతో ప్రారంభించిన ఉగాది, ఎంత చిరాకు కలిగిస్తుందో అంతమయేసరికి... పోనీలెండి. దాని దుంపతెగిరి. అయినెవరో చెప్పినట్లు కానున్నది కాకమానదు - పోనున్నది పోకమానదు. వచ్చునున్నది వచ్చుక మానదు - అందుకనే ఆ సుప్రసిద్ధ ఆంగ్లకవి ఎవడో ఉపనిషద్వాక్యంలా చెప్పాడు: ***Eat, drink and be merry*** అని. అదే అత్యంతం అనుసరణీయంలా కనుపిస్తోంది. అందుకని ఓ ఇల్లాలా, ఓ ధర్మపత్నీ, ఓ గృహలక్ష్మీ, ఈ మన మిత్రమండలకు - కాదు కాదు - మండలికి, ఈ స్వయం విష్ణువులకు, అర్ఘ్యపాద్యాదులున్నూ, ఉగాది పచ్చడియున్నూ, ఇడ్లీ, ఆవకాయ, కాఫ్యాది, జీవనావసరములను వెంటనే సరఫరా చేయించి మమ్ముల నానందింపచేయుము అని పురమాయించేసరికి చేటలంత లేసి ముఖాలు చేసుకుని తలో కుర్చీలోనూ చతికిలపడుతూ 'పోనిద్దురూ; ఇప్పుడెందుకు వారి క్లేశమంతాను. పండగపూటా, పర కడుపున పచ్చి అబద్ధమెందుకు. ఏదో యథాశక్తి కానిచ్చే బయలుదేరాము. లేకపోతే ఇక్కడిదాకా ఎలా రాకలిగాం అంటారు అన్నాడు శర్మ. పోనిద్దురూ మునిగిపోయిందేముంది. ఇంకో మోతాదు పట్టించలేనంత అసమర్థులు కారనుకుంటాను. మన ఆంధ్రజాతికి అపఖ్యాతి తీసుకురాకండి. వెనక ఇంగ్లండులో మద్యనిషేధం పెడదామంటే ఆనాటి ప్రధానమంత్రి ***Another little drink won't do us any harm*** అన్నాడట. అలాగే మరో మోతాదు మన్నేం చేస్తుంది. అందుచేతను పాదప్రక్షాళన కానివ్వండి అన్నాను. మా ఆవిడ క్షణంలో పచ్చడి మొదలు పానీయంవరకూ అన్నీ అమర్చింది ఎంతో సంతోషంతో. పండగపూటా పదిమందికి పిండప్రదానం చెయ్యడమందు కుతూహలం మెండు-ఆవిడకు. వాళ్లు అంతకంటే ఉత్సాహంతో సేవించడ మారంభించారు.

ఈసారి ఉగాది చాలా బాగా ప్రారంభమయింది మేష్టారూ! మీరీ సంవత్సరానికి ప్రారంభోత్సవం చెయ్యడం బలేబాగుందండీ అన్నాడు టప్పయ్య. చాలా

విషయానుక్రమణిక

ముఖచిత్రం : నటి సూర్యకాంతం.

★ బారిష్టరుగారి బాతాఖానీ ★

సంతోషం, నాయనా, నీమాట ఎలాఉన్నా నాకుమట్టుకు వ్యయంతో ప్రారంభమయింది కదా. ఎటొచ్చీ ఇది శుభవ్యయం కిందకట్టి సంతోషిస్తుంది మా ఆవిడ అన్నాను. 'అయితే గురుదేవ్! సంవత్సరాదినాడు ఎలా జరిగిందో సంవత్సరాంతంవరకూ అలాగే జరుగుతుందంటారేమిటండీ' అన్నాడు భద్రం. 'మనవాడు ఏమో అను

కున్నాం. చాలా దూరదృష్టి కలవాడండీ బారిష్టరుగారూ! ఏకవర్ష ప్రణాళిక ఇట్టే తయారుచేశాడు చూడారా. రోజూ ఒక సంవత్సరంపాటు ఇక్కడ ఉల్ఫాగా టిఫిను వాయిద్దామని *Plan* వేస్తున్నాడు' అన్నాడు శాస్త్రి. 'పోనీ లేవోయి. నీ సొమ్మేంపోయింది. మా గురువుగారి కిదో లెక్కా పత్రమా' అన్నాడు రామం. 'నువ్వూ అదే సంకల్పంలో ఉన్నావా ఏమిటి' అన్నాడు శర్మ. 'పోనిద్దురూ పాపం సాద. కాని మేష్టారూ, నాకు ఎందుచేతనో సంవత్సరాది అంటే మహా చెడ్డ సరదా' అన్నాడు టప్పయ్య. 'నువ్వు పట్టి కుర్రకుంకవు కనుక' అన్నాడు తపీను శాస్త్రి.

కొంతవరకూ నువ్వు అన్నదానిలో సత్యం లేకపోలేదు. ఒక వయస్సు వచ్చేవరకూ, కుర్రకారుకి అమితానందదాయకములైనవి, ప్రతి ఏడూ, జన్మదినమూ, తరువాత ఉగాది. ఈ రెండూ ప్రతివాళ్లకూ చాలా ప్రధానంగా కనుపిస్తాయి. తతిమ్మా పండగలన్నీ వీటి తరువాతనే. పుట్టిన రోజు వచ్చినదంటే ఎందుకో కారణం లేని సంతోషం. మరీ చిన్నప్పుడయితే, కొత్త బట్టలు కొని ఇస్తారనీ, ఏవేనా పిండివంటలు చేసి పెడతారనే సంతోషం. తరువాత, తరువాత, మనం జన్మించడమే మహా ఘనకార్యమనీ, మన్ని చూచి, మనవాళ్లు మురిసిపోతుంటే, వాళ్ళను తరింపచేయడానికి అవతారమెత్తాము కాబోలుననే అనుమానంతో కూడిన అజ్ఞాతమైన అహంకారం. ఆతరువాత మన తెలివితేటల్లోనూ, మన ప్రయోజకత్వంలోనూ నమ్మకం ఎక్కువై, ప్రపంచాన్నంతా మనమే నడుపుతామనో, లేకపోతే అధమం మనం లేకపోతే, ప్రపంచానికి చాలా లోటనో అనుకుని ఆనందించడం. తరువాత క్రమేణా సంసారంలో పడి, జీవితంలో ఉండే కష్టములు వంట పట్టేసరికి, జన్మదినము ఆనందహేతువు కాక విచారకారణమవుతుంది. కాని సంవత్సరాది పండగ అలాటిది కాదు. ఇతర దేశాలవలె కాక మన ఉగాది వసంత ఋతువులో ప్రారంభమవుతుంది. వసంతం సృష్టికంతకూ ఆనందదాయకం. మానవజాతికంతా ఆశాజ్యోతి. మోడువారిన తరులతా గుల్మాదులు చిగిర్చి, పునరుజ్జీవనమయినట్లే, మనకు కూడా ఈ వసంతాగమంలో, ఏదో వింత ఆనందం, ఆశా కలుగుతుంది. నిరుత్సాహం పోయి, ఉత్సాహం బయలుదేరుతుంది.

అలాగే ఉగాది కూడా మన కెంతో ఉత్సాహజనకంగా ఉంటుంది. గత సంవత్సరాంతానికి మన ఉత్సాహాలూ ఆశలూ ఎంత అడుక్కి పోయినా సంవత్సరాది రావడంతోనే మన మనోరథాలన్నీ భగ్నమయ్యాయన్న విషయమే మరచిపోతాం. కొత్త సంవత్సరం వచ్చిందికదా, ఈ నూత్న వత్సరం మనకు శుభదాయకంగా ఉండకపోతుందా అనిపిస్తుంది. కొత్త పంచాంగం తిరగవేస్తే, ఏదో మనకు చాలా లాభించేటట్టే కనిపిస్తుంది. ఆదాయం పన్నెండు, వ్యయం పది రాశాడు బాగుందని సంతోషిస్తాం. మరో పంచాంగంలో ఆదాయం ఆరు, వ్యయం ఎనిమిదీ రాసినా పోనీ ఎదో కొంత వస్తుందికదా, మిగతా నష్టానికి అప్పు దొరక్కపోతుందా అనిపిస్తుంది. రాజపూజ్య అవమానాలు చూచినా మనకు రాజపూజ్యతే ఎక్కువగా కనిపిస్తుంది. అది వ్యతిరేకంగా కనుపిస్తే, రాజాలేని రోజుల్లో రాజపూజ్యత ఎలా ఉంటుందని సమాధానం చెప్పుకుంటాం.

వర్షం కురుస్తోంది. ఒక పెద్దమనిషి గొడుగువేసుకొని తలకాయవంచుకుని గబగబ వెళ్లుతున్నాడు. ప్రక్కనకొట్టులో నించి ఒకాయన కాస్తదూరం గొడుగులోపోవచ్చు గదా అని గబగబావచ్చి, గొడుగులో దూరి, గొడుగుకమ్మీ పట్టుకున్నాడు. మొదటి పెద్దమనిషి గొడుగువదిలిపెట్టి "ఇదిమీదైతే మీరేతీసుకోండి. నాకఖ్ఖర్లేదు." అంటూ గాభరాగా పరిగెత్తాడు.

గోపాలక్రిష్ణమూర్తి, శక్కర్‌నగర్.


* * *

ఒకానొక ప్రేక్షకుని ప్రశ్నకు సినిమానటిజవాబు.

ప్రే: ఏమండీ? మీకు యింతనటన ఏలా అలవడిందండీ?

సి. న: నన్ను చిన్నప్పటి నించి పెంచిన తల్లిదండ్రులకు బ్రహ్మచెవుడు.

పి. భాస్కర్రావు, పర్లాకిమిడి.



మనకు ఎన్ని కష్టాలు, ఎన్ని నష్టాలు ఎదుట కనపడ్డా వాటిని చూచి కుంగిపోవడానికీ, చెదిరిపోవడానికీ ప్రాణం ఒప్పదు. సంవత్సరాది ప్రభాతమది మన కేటేటా కనుపించే ఆశాజ్యోతి. నిత్య యౌవనాన్ని ప్రసాదించే రసాయనం. గతాన్ని మరపించే మత్తుమందు. వాడెరుగని ఆశాలత. 'యదహ్నాత్కురుతే పాపం తదహ్నాత్ప్రతిముచ్యతే। యద్రాత్రియాత్కురుతే పాపం తద్రాత్ర్యాత్ప్రతి ముచ్యతే' అని సంధ్యావందనంలో చెప్పారు. ఏ రాత్రి చేసిన పాపం ఆరాత్రే, ఏ పగలు చేసిన పాపం ఆరోజే నాశనముగాక అన్నట్టు, గత సంవత్సరం చేసిన పాపం గతించిపోయింది, పోతోంది. దానికోసం విచారమెందుకు — ఈ సంవత్సరం అన్నీ జాగ్రత్తగా ఆలోచించి, లెక్క చూచుకుని, లాభనష్టాలు బేరీజు వేసుకుని, సాధ్యాసాధ్యాలు బాగా తర్జనభర్జన చేసుకుని, ఫలానా కార్యకలాపం, ఈ సంవత్సరం, ఈ రీతిగా జరపాలని సంకల్పించుకుంటాం.

'సంకల్పించవన్నీ, సరిగా జరిగివస్తాయా గురుజీ' అన్నాడు శర్మ.

ఏమీ ఎందుకు జరగవు. జరక్కపోతే మన లోటన్నమాట — మన సంకల్ప బలం తక్కువన్నమాట — కార్యదీక్ష లేకపోయిందన్నమాట — బ్రిటన్ దేశంలో ఒక ప్రొఫెసరుగారు విద్యార్థులకు ఈ సంకల్ప బలాన్ని గురించి ఉపన్యాసమిచ్చి, మీరందరూ తగినంత దృఢంగా, ఏదేనా సంకల్పిస్తే అది జరిగి తీరుతుందని చెప్పాడట. ఆయనమీద విద్యార్థులందరకూ గౌరవం లేకపోవడం సరికదా, విపరీతమైన కోపమట. అందుకని ఈ ఉపన్యాసంయొక్క సత్యం తేల్చుకుందామని, ఒకచోట చేరి, అందరూ కూడా 'రేపు ఉదయం, మా గురువుగారు గడ్డం చేసుకునేటప్పుడు, కత్తితో గొంతుకోసుకుని ఆత్మహత్య చేసుకోవాలి' అని అందరూ వారి శక్తికొద్దీ మనస్సంకల్పం చేశారట — మరునాడు ఉదయం తొమ్మిది గంటలకు *University* కి వెళ్ళేసరికి ఫలానా ప్రొఫెసరుగారు, ఏ కారణం చేతనో కత్తితో గొంతుకోసుకుని ప్రాణత్యాగం చేశారు గనుక ఈరోజు శెలవు అనే నోటీసు చూచి కుర్రవాళ్లు హడలి పారిపోయారట.

ఆంగ్లేయులు, జర్మనీని ఓడించాలని సంకల్పించి విజయం సంపాదించుకోలేదు. గాంధిగారు స్వరాజ్యం సంపాదించలేదు. ఎటొచ్చీ, వాడు ఒక కార్యాన్ని సాధించాడు కదా నేనెందుకు సాధించలేనని మరొకడు తలపెడితే వాడి సంకల్పలోపానో, శక్తి చాలకనో చేయలేకపోవచ్చు.

ఒక యోగాభ్యాసం చేసిన ఆసామీ ఇంగ్లండులో ఉపన్యాసాలిచ్చాడట యోగాన్ని గురించి — అప్పుడు కొన్ని చిత్రాలు చేసి చూపించాడట. పద్మాసనంలో కూర్చుని వాయువుని పూరించి గాలిలో తేలడం ఒకటి చూపించాడట. సభలో ఉన్న ఒక ఫాదిరీ, సభ కాగానే ఈయన్ను సమీపించి అది ఎలాగని అడిగాడట. ఇత నేదో చెప్పాడు. అతనో పది రోజులు సాధనచేసి ఒకనాడు చర్చిలో ప్రార్థనాదులు అయినతరువాత, 'మీకో తమాషా చూపిస్తాను. మీరు శ్రద్ధాభక్తులతో చూడండి. నిరంతర దేవతారాధనవల్ల ఇది సాధ్యమవుతుంది. నేను ఈ వేదికమీదనుంచి గాలిలో ఎగిరి మీ దగ్గరకు వస్తాను. మీరు భయపడకండి' అని చెప్పి అమాంతం పైకి ఎగిరి రప్పీమని కిందపడి కాలు విరగ్గొట్టుకున్నాడట.

తన సంకల్ప బలంచేతనూ, పతివ్రతా మహిమచేతను, సావిత్రి చనిపోయిన భర్తను బ్రతికించుకుంది. ఆ కథ చదివిన ఒక ఇల్లాలు, తన భర్తపోతే, మృతకళేబరాన్ని తీసుకుపోబోతుంటే, 'మీరు తీసుకువెళ్ళకండి.' నేనే పతివ్రతనైతే నా భర్త మళ్ళీ ఇప్పుడే లేస్తాడు' అన్నదట. ఆవిడ పాతివ్రత్యం సంగతి ఆ వీధిలో అందరకూ తెలుసు. తెలియనివాళ్లకు కూడా ఇప్పుడు ఋజువుచేసుకుంది. ఇంతకూ చెప్పవచ్చిన దేమిటంటే, సంవత్సరాదినాడు, చిత్తశుద్ధితో ఏదేనా సంకల్పించుకుని కార్యాచరణకు దిగితే, తప్పక కార్యము సిద్ధిస్తుంది. ఏటేటా నూత్న కార్యాచరణకు ఉద్యుక్తులనుగా చెయ్యడానికే మన ఉగాది పండగ ఏర్పడ్డదనుకుంటాను. అందుచేత ఈ సంవత్సరం మీ కందరకూ శుభప్రదంగా ఉంటుందోయి.

★

కాంబోడియా కబుర్లు: 7

రాచసేద్యం

ఇదో పండుగ, కాంబోడియాలో. ఇది వైశాఖ బహుళ చవితినాడు జరుగుతుంది. పూర్వకాలంలో యీ పండుగ అయింతరవాత కాని యెవ్వరూ పొలం దున్నేవారు కారు. కాని యీ పండుగ బహుళపక్షంలో ఎందుకు చేస్తారో మాత్రం దురూహ్యం. నిజంగా చూస్తే కర్షకులంతా శుక్లపక్షంలో మొట్టమొదటి ఆదివారంనాడు మంచిముహూర్తం పెట్టుకుని, ఆనాటినుంచీ తమపొలం పనులు ఆరంభిస్తారు. ప్రభువులు స్వయంగా నాగలి చేపట్టే యీపండుగరోజుకూడా, జ్యోతిష్కులు లెక్కలు కట్టి, ముహూర్తనిర్ణయం చేస్తారు. అంతేకాకుండా, కర్షకులంతా శుక్లపక్షపురోజుల్లోనే మంచిముహూర్తం పెట్టించుకొంటారు: శుక్లపక్షపు చంద్రుడిలాగే వారికృషి ఫలితంకూడా దిన దినాభివృద్ధి చెందుతుందని ఓనమ్మకం. మరియిన్నీ యిలాగ ఉంటూంటే, "రాచసేద్య"పు పండుగమాత్రం బహుళపక్షంలో ఎందుకు జరిపిస్తారో తెలియదు!

పూర్వకాలంలో ప్రభువు స్వయంగా నాగలి చేత పట్టుకుని, శుభ్రపదం (ఫలప్రదం) అయిన క్షేత్రంలో లోతుగాచాళ్లు నాటేలాగ దున్నడం ఆచారం వుండేది. దీని పుట్టు పూర్వోత్తరాలు ఏంవిటి అని, విమర్శనగా చూస్తే, జనకమహారాజుదాకా వెళిపోతుంది. జనకుడు పొలందున్నుతూ ఉండగా నాగేటిచాల్లో ఓపిల్ల దొరకడం చాల్లో దొరికిందిగనక ఆమెకి "సీత" అని పేరు పెట్టడం, ఆతరవాత సీతారాముల కల్యాణం — యీ కథంతా చెబుతారు. హీనయాన బౌద్ధమతగ్రంథాలయితే యింకో చిత్రంఅయిన గాథ చెబుతాయి. సిద్ధార్థుడి చిన్నతనం. అతనితండ్రి యీపండుగనాడు నాగలిపట్టే సమయంలో, కొడుకుని సేవకులకి అప్పగించి, పొలంమీదికి వెళ్లేరు. వేడుక చూడ్డానికి వొచ్చిన వాళ్ళకి లాగే యీభృత్యులక్కీ రాచదంపతులు సేద్యకర్మ జరిపిస్తూ ఉంటే చూడాలన్న ఉత్సాహం ఇనుమడించింది. ఆపాళంగాయీపసిపాపని ఓరావిచెట్టుకింద పడమటగానీడలో పడుకోబెట్టి, వీళ్లు గుంపులో దూరిపోయేరు, కాస్సేపట్లో వొచ్చేద్దాంఅనీ. ఆఒక్కక్షణం అలా పెరిగిపోయింది. బ్రహ్మాండం అయిన పండుగా, వేడుకాను! వీళ్లు కాస్తా 'యీపిల్లాడిమాట మరిచిపోయేరు, ఉత్సవం చూడడంలో. సూర్యుడు తూర్పునఉన్నవాడల్లా పడమటని కొనవొచ్చేడు. రోజు తిరిగిపోతోంది. ఆభృత్యులకి అప్పటికి వొంటిమీద తెలివొచ్చింది. "అయ్యయ్యో! పడమటగా నీడని పండుకోబెట్టవొచ్చేం. ఈపడమటి సూర్యుడి ఎండలో పాపం, రాచబిడ్డ యెంత కందిపోయినాడో" అనుకొంటూ — సిగ్గుతో చితికిపోయి—పరిగెత్తుకుంటూ వొచ్చేరు. కాని ఆశ్చర్యం! సూర్యుడు పడమటిని ఉన్న చెట్టునీడ మాత్రం సూర్యుడితో ప్రమేయంలేకుండా అలా ఆరాచబిడ్డని రక్షిస్తూ నేఉంది. ఎండ దెబ్బ తగలకుండా!

అంగ్ - జుఅంగ్ ప్రభువు తరవాత వాళ్లు స్వయంగా నాగలిపట్టిదున్నే ఆచారం తప్పించేసేరు. వ్యవసాయం చూసే మంత్రిఅనుజ్ఞ పుచ్చుకుని అతనిక్రిందఉన్న ఉన్నతోద్యోగి సభార్యకంగా యీసేద్యకర్మ జరిగిస్తాడు. (పూర్వకాలంలో నిజంగా ఓపొలం, ప్రాయువోంగ్ పెగోడాకి దక్షిణంగా ప్రత్యేకించేవారు, యీపండుగనాడు దున్నడానికి; కాని సిసొవాత్ రాజుకాలంనుంచీ ఆజాగా మారిపోయి, ప్రస్తుతం యీపండుగనాడుదున్నే పొలం నిర్ణీతం అయింది.)

ఈ పర్వదినంనాడు, రాచసేద్యానికి నిర్ణీతంఅయిన పొలంచుట్టూ అయిదుడేరాలు వేసి, ఒక్కొక్కదాంట్లోనూ ఒక్కొక్క దేవుణ్ణి పెడతారు తరవాత, బహుళపాడ్యమీనాడు, గోధూళి సమయంలో, భూదేవతకి "బకు"లు పూజచేస్తారు.—యీమంత్రాల తాత్పర్యం భూమి దున్నుకోడానికి దేవతఅనుజ్ఞ. ఆపైన హోమవిధి అగ్నిసంస్కారంతో, జరుగుతుంది. ఇటీవల రోజుల్లో ఉన్న దేవ పంచకొన్నిస్తుతిస్తూ "బకూ"లు మంత్రాలు చదివినా, హోమకర్మ అదీ మట్టుకు లేకపోలేదు.

అయిదు డేరాలువేసి ఒక్కొక్కదాంట్లోనూ ఒక్కొక్క దేవుడి విగ్రహం ఉంచుతారు అని పైన రాసేను. ఈడేరాల ముందు చిన్న చిన్న యిసక కొండలు మూడు కడతారు. వీటికీ శిఖరంనుంచి అడుక్కి ఓజానెడు వెడల్పు జానెడు లోతూ కన్నాలుచేసి, వాటిమీద అడుపేడ మెత్తుతారు: దానిమీద ముగ్గులు పెట్టి, యెత్తుగా గొడుగులు కప్పుతారు. తరవాత మంత్రోచ్చారణచేస్తూ బ్రాహ్మలు ఈరంధ్రాల్లో అగ్నిహోత్రం ఉంచుతారు. ఈ కర్మకాండంతా మంత్రాల్లో చెప్పిన ప్రకారం తు-చ తప్పకుండా చెయ్యాలి. సూచనకి అగ్నిహోత్రానికి ఉపయోగించే సమిధలు తొమ్మిదివేళ్లపొడుగూ, రెండువేళ్ళ కైవారంవూఉండాలి. ఎక్కువతక్కువలు పనికిరావు తొమ్మిదేసి సమిధలు ఒక్కొక్క కట్ట చొప్పున కట్టాలు

వార్ధక్యపు శిల

-ఫొటో: పి. రామారావు, రాజమండ్రి.



కటారి. మనం మామిడాకులు వాడినట్టు, కొన్ని మంగళ కరమయిన చెట్ల ఆకులు కూడా చేతిలోనో, తేనెలోనో ముంచి వాడతారు హోమానికి; హోమంలో నెయ్యి వెయ్యడానికన్నీ. హోమం మీద శంఖ తీర్థం ప్రోక్షిస్తారు. ఈ పవిత్రకర్మ జరుగుతూ వున్నంత సేపూ, నాగలికి యెడ్లు పూన్చి పొలం మీద నిలబెడతారు. ముఖ్యంగా ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటీ అంటే, ఈ పర్వదినాన్న రాజుగారు ఉపయోగించే నాగలికి రెండెడ్లు ఉంటాయి. మామూలుగా రైతులు దున్నే నాగళ్ళకి ఒంటెద్దే!

తరవాత వైశాఖ బహుళ చవితి నాడు "రాచపొలం" దున్న వలసిన దంపతులు తిన్నగా వచ్చి వాయువ్యంగా ఉన్న కేరాలో ప్రతిష్ఠించిన శివుడికి పూజ చేస్తారు. ఆ పైన తొమ్మిది శంఖాలు పూరిస్తూ ఉంటే రాచ సేద్యం ప్రారంభం అవుతుంది' అన వాయిదుపో తుండగా, ప్రదక్షిణం చేసినట్టు ముమ్మారు చాళ్లు గీసి విరమిస్తారు, యీ దంపతులు. ఇహ నా తరవాత వెళ్లి సపరివారంగా తూర్పున ఉన్న కేరాలో ఉన్న విష్ణ్వాలయం దగ్గర ఆగుతారు. అక్కడ నాగలికి పూన్చిన యెడ్లని విప్పేస్తారు. బ్రాహ్మలు మళ్లా మంత్రాలు చదువుతారు; ప్రభు కార్యానికి ఉపయోగించిన నాగలి మీదా, ఎడ్ల మీదా పవిత్రోదకాలు (శంఖతీర్థం) జల్లి, ఎత్తుగా (గేలరీలా అమర్చి ఉన్న) స్థలం వేపు మళ్లిస్తారు ఆ యెడ్లని. అక్కడ ధాన్యం, బొబ్బర్లూ, మొక్కజొన్న కండులూ, పచ్చిగడ్డీ, మంచినీళ్లూ, సారా అమర్చి ఉంటాయి (అన్న ప్రాసనలో పిల్లడికోసం అమర్చిన వస్తువుల్లాగ). ఆ పశువులు వీటిలో దేన్ని ముడితే దానికి ఒక్కొక్క ఫలం చెబుతారు. ధాన్యం గానీ తిన్నాయంటే వరిపంట బాగుంటుంది; పచ్చగడ్డి తింటే పశువులకి తెగులు; మంచి నీళ్ళు తాగితే నాలుగు కుంచాల వర్షం, దేశంలో శాంతిన్నీ; సారాయిగాని తాగితే దేశ ద్రోహులూ, దొంగలూ, దుర్మార్గుల వల్ల రాజ్యానికి అరిష్టం!

వైశాఖ పూర్ణిమ

ఈ రోజున కోటలో రెండు పండుగలు ఒకే రోజున జరుపుతారు: ఒకటి శలకఫో (*Salakaphot*); రెండోది "విస్సాఖ్ బోసా". విస్సాఖ్ బోసా అన్నది బౌద్ధుల పర్వదినం. బుద్ధభగవానుడి జననం, జ్ఞానోదయం, నిర్యాణం పూకూడా యీ వైశాఖ పూర్ణిమనాడే జరగడం నుంచి, దీనికి ఎంతో ప్రాముఖ్యం. * ఇహ శలకఫో అన్నది ఏమిటి అంటే — ఆరోజున వంట కాలూ, పళ్లూ వగైరా బుద్ధభిక్షువులకి దానం చేస్తారు. ఆహ్వానించిన బుద్ధభిక్షువుల పేర్లన్నీ చిన్న చిన్న చీటీల మీద రాసి, ఓ చిన్న భరిణలో పెట్టి గిలకరించి, తలా ఒక్కొక్క చీటీ తీసుకొమ్మంటారు. ఎవరి చీటీ మీద ఏ బుద్ధభిక్షువు పేరు వారా బుద్ధ భిక్షువుకి వారి వంట కాలూ, పళ్లూ వగైరా దానం చెయ్యాలి. ఈ తంతు కోటలో వైశాఖ పున్నం నాడు ఉదయాన్నే జరుగుతుంది. చీటీల లాటరీ రాజు గారికీ రాచకుటుంబానికీ మాత్రం వర్తించదు. ప్రధానభిక్షువు పేరు ఓ చీటీ మీద రాసి బంగారు భరిణలో ఉంచి తీసుకెళ్లి రాజు గారికి యిస్తారు.

* ఈ వైశాఖ పున్నం నాడు కోటలో ఉన్న సిల్వరు పెగోడాలోనూ, యింకా ఉన్న యితర పెగోడాల్లోనూ కూడా దీపాల తోరణాలు పెట్టి అలంకరించి బౌద్ధ గాథలూ, ప్రవచనాలూ చెబుతూ రాత్రంతా కాలక్షేపం చేస్తారు.

ఈ శలకఫో పండుగకి ఆధారంగా ఓ విచిత్రగాథ చెబుతారు. పూర్వం ఒకానొకప్పుడు "కాళ" భూతం †, కోర్థిడా దేవి పిల్లలందర్నీ భక్షిం చేస్తూ ఉండేదిట, ఒకరి తరవాత ఒకర్ని. చివరిసారి పురుడు పోసుకున్న తరవాత, భూతం శిశువుకోసం వెంటతరుముకు వొస్తూ ఉంటే, కోర్థిడా దేవి, బుద్ధభగవానుడి శరణు జొచ్చింది. శిశుభిక్ష పెట్టమని. బుద్ధుడామెకి అభయం యిచ్చి, యీ భూతానికి జ్ఞానోదయం చేసి, దాని క్రూరస్వభావం పూర్తిగా మార్చేసి, దాన్ని ఆమె దగ్గిరే ఉంచుకోవలసిందిగా కోర్థిడా దేవిని ఆదేశించేడు. జ్ఞానోదయం అయిన యీ భూతానికి అపూర్వశక్తులు లభించేయి దాంతో వరుణుడు ఎప్పుడు ప్రసన్నంగా ఉంటాడో తెలుసుకుని, కోర్థిడా దేవికి ఎప్పుడు వానలు పడతాయో, సేద్యం ఎప్పుడు ఎలా చెయ్యాలో అదీ యిదీ మంచిచెడ్డా సలహాలు యిస్తూ ఉండేది ఆ ప్రకారం వ్యవసాయం సాగించడంతో కోర్థిడా దేవి మూడు పువ్వులూ ఆరు కాయలుగా వర్ధిల్లుతూ ఉండేది. అదిమాసి అక్కణ్ణుంచీ యిరుగు పొరుగు వాళ్లంతా కూడా, యీ భూతానికి కానుకలూ నైవేద్యాలూ అవీ పెట్టి మంచీ చెడ్డా తెలుసుకునేందుకు వొచ్చేవారు. ఆ భూతం యీ కానుకలూ కట్నాలూ అవీ గంపలతో పుచ్చుకొని తనకి సరిపోగా మిగిలినవి బుద్ధభిక్షువులకి— లాటరీ వేసి-పంచి పెట్టేదిట! అప్పట్నుంచీ యిది ఆచారంలోకి వొచ్చిందంటారు.

ఇది మరేమీ లేదు, వ్యవసాయానికి సంబంధించిన పండుగ అంటారు తెలిసిన వాళ్లు.

† *L'ogresse Kàlà*

(ఇంకా వుంది)

"మన దేశంలో ఆడపిల్లలు ఎక్కువ మంది ఉన్నారా? విచారించకండి. నేను నిన్న చెప్పిన యోజనలు అమలు పరిచేరంటే మగ వాళ్లకంటె ఆడవాళ్లకే ఎక్కువ పెళ్లిళ్లు జౌతాయి." అని మంత్రి గారి లెక్చర్.

కె. రామమోహనరావు, కాకినాడ

చీకటి తెరలు

ప్రసాదరావు మస్తిష్కం ఆలోచనలతో నిండి, ఆ వేదన అధికమవటంతో పని చేయటం లేదు. రెండుచేతులతో తలపట్టుకుని ఆలోచనా ముద్రలో వుండిపోయాడు. తన జీవితమంతా విస్సారంగా వుండటానికి తనేం తప్పుచేశాడని? ఆలోచిస్తున్నకొద్దీ మనసు మరింత వికలమైపోతోంది ...కాని ఆలోచించక తప్పదు.

తనకి జ్ఞానమొచ్చిందగ్గర్నుండి కష్టాలే యెదుర్కుంటున్నాడు...ఎందుకు? పద్దెనిమిదేళ్లు రావటంతోనే తండ్రి మరణించాడు. చదువుకి స్వస్తిచెప్పక తప్పిందికాదు ...వుద్యోగాన్వేషణ ఓ సమస్య అయింది ....కాళ్లరిగిపోయేలా తిరిగితే యేదో గుమాస్తావుద్యోగం దొరికింది. తనూ ఓ వుద్యోగస్తుడయినందుకు అమ్మ యెంతగానో ఆనందించింది...తనని ఓ యింటివాణ్ణి చెయ్యాలని, కోడలు యింట్లో మసలుతూంటే చూచి ఆనందించాలని తల్లి అభిప్రాయం. ఒత్తిడిచేసింది. రాగల కష్టాల్ని అర్థంచేసుకున్నా, తల్లికోరిక తీర్చటం, ఆమెని సంతోష పర్చటం తనవిధి అన్పించింది...సరేనన్నాడు. తల్లి యేరి, కోరి తెచ్చిన సుశీలనే వివాహం చేసుకున్నాడు. కాని—

ఏ సంకల్పంతో యే ఆశతో తల్లి తనకి పెళ్లిచేసిందో, ఆ ఆశ నెరవేఅలేదు...పెళ్లయిన నాలుగు నెలలకే తల్లి పరమపదించింది .. తనప్పుడు చిన్నపిల్లాడిలా యేడ్చాడు... ఎంతయేడ్చి యేంలాభం అని మనసు దిటవు చేసుకున్నాడు. సుశీల కాపరానికొచ్చింది గాని, ఎప్పుడూ అస్వస్థతగానే వుంటుంది.. అసలు తనకెందుకు వివాహం చేసిందమ్మ? వివాహం చేయకపోతే అమ్మ బ్రతికి వుండేదేమో! పిచ్చిగాని విధినెవరు తప్పించగలరు?.. మళ్లీ సమాధానపడ్డాడు ప్రసాదరావు. యీ ఆలోచనల్లో పడి కాలగమనంకూడా తెలీకుండా వుందతనికి. గోడగడియారం అయిదుగంటలు కొట్టడంతో ఆశ్చర్యంగా గడియారం వేపు చూశాడు. అప్పుడే అయిదు గంటలయిపోయింది అనుకుని బరువుగా లేచి నిల్చున్నాడు.

మెల్లగా, అతిమెల్లగా, రోడ్డుప్రక్కని నడుస్తూ పోతున్నాడు ప్రసాదరావు. అతని ప్రక్కనుండి యెన్నో కార్లు, సైకిళ్లు, యెంతోమంది వ్యక్తులు పోతున్నారు. కాని అవన్నీ అతని దృష్టిపథంలో పడలేదు. ఇల్లుచేరుకునే సరికి సుశీల వంటగదిలో వుంది. ఆమెని చూడ్డంతో అతనిలో జాలి పెల్లుబికింది. విచారం పొర్లుకొస్తోంది. సుశీలని చూస్తుంటే అస్థిపంజరం చూసినట్టే వుంటుంది. ఎంతో కష్టంగా ఓర్లేక వండుతున్నదేమో...అనుకున్నాడు ప్రసాదరావు. అందుకే రెండుమూడుసార్లు ఆమెతో అన్నాడు, హోటలునుండి భోజనం తెచ్చుకుందామని...కాని సుశీల ఒప్పుకోలేదు. ఇద్దరికోసం వండటం యేమంతకష్టం...? అనేది చిన్నగా నవ్వుతూ...ఆమెకు ఆసక్తి వుండేగాని శక్తిలేదు...తనతల్లి బ్రతివుంటే సుశీలకి యింతకష్టం వుండకపోవును కదా...అనుకునేవాడు ప్రసాదరావు.

ఈవేళకూడా మళ్ళీ అలాగే అనుకొన్నాడు. మెల్లగా వంటగది గుమ్మందగ్గరికి పోయాడు.

ముద్దంశెట్టి హనుమంతరావు

"వంటయిపోయిందా సుశీలా?" అన్నాడు,

"సరి...అయిపోయినట్టేనండీ" నవ్వుతూ అంది సుశీల. ఆ నవ్వులో పుష్టి కన్పించలేదు.

"ఎన్నిసార్లుచెప్పినా, నువ్వు విన్పించుకోవు సుశీ! హోటలునుండి కేరియర్ తెచ్చుకుంటే యీ బాధే వుండేదికాదు...నీకు నీరసంగా వున్నప్పుడు గంటలతరబడి పొయ్యిదగ్గర కూచోవటం యేం బావుంది?"

సుశీల ఓసారి ముఖం చెంగుతో ఒత్తుకుని భర్తకి దగ్గరగా వస్తూ "హోటలు భోజనం తింటే రుచులు తెలుసుకునే జ్ఞానంకూడా పోతుందంటారండీ మా నాన్న...అయినా యిదీ ఒక కష్టమేనా లెద్దురూ...!" అంటూంటే ఆమెకి చిన్న దగ్గుతెరవచ్చింది.

"జలుబుచేసినట్టుందిసుశీలా! దానికితోడు దగ్గు ఒకటీ...డాక్టర్ని తీసుకొచ్చి చూపించాలి..."

సుశీల భర్త మొహంలోకి అదోలా చూసింది.

"యీ పాటిదానికి డాక్టరెందుకండీ! అదే తగ్గిపోతుంది" అంది మెల్లగా.

ఎలాగన్నా డాక్టరుకి చూపించాలి సుశీ! నీ వంట్లో యేమీ బలంలేకట్టుంది. మంచి మందులన్నా, టానిక్‌లన్నా యిప్పించాలనుకుంటున్నాను..." అంటూంటే ప్రసాదరావు కళ్లు చెమ్మగిల్లినయ్. సుశీల యేదో చెప్పాలనుకుంది గాని ఆ చెప్పవల్సిందేదో పెదాలు దాటిరాలేదు.

"కాఫీ పెట్టమంటారా? మీ రెప్పుడొస్తారో తెలీక ముందు పెట్టివుంచలేదు"

నిజమే, తను రోజూ యింతకంటె ఆలస్యంగా వస్తుండేవాడు..."వద్దులే సుశీలా! నేను కాఫీత్రాగే వస్తున్నా." అన్నాడు. సుశీల అమాయకంగా నిజమేననుకుని మళ్ళీ పొయ్యిదగ్గరికి వెళ్లిపోయింది.

ప్రసాదరావు అక్కడే నిల్చుని యేదో ఆలోచిస్తుంటే చప్పున డాక్టరు బాలకృష్ణ జ్ఞాపకమొచ్చాడు. బాలకృష్ణ ప్రసాదరావు బాల్యస్నేహితుడు . .ఇద్దరూ యిప్పటికీ అరమరలేకుండా తిరుగుతారు. వారి మధ్య రహస్యాలంటూ యేమీదాగవు. వాడిదగ్గరికెళితే మంచి మందులిస్తాడనుకున్నాడు ప్రసాదరావు. ఆలోచన తట్టడమూ, యింక ఆలస్యమూనా?

"సుశీలా?" లాలనగా పిల్చాడు.

"ఏమండీ?"అనుకుంటూవచ్చింది సుశీల.

"వంట వేగిరం పూర్తిచెయ్యి. అలా వెళ్దాం...!!

"ఎక్కడికి?"

"నా స్నేహితుడొకడు కొత్తగా డాక్టరు ప్రాక్టీసు పెట్టుకున్నాడులే...నీ ఆరోగ్యంగురించి వాడికిచెప్తాను"అన్నాడు ప్రసాదరావు. సుశీల బెదరిన లేడిపిల్లలా చూసింది. కాని ప్రసాదరావు ఆమెచూపు గుర్తించలేదు.

"ఇప్పుడవ్వదులెండి—కావాలంటే రేపువెళ్దాం"అంది సుశీల...ఆమెకి వ్యతిరేకంగా ప్రవర్తించటం ప్రసాదరావుకి అలవాటులేదు.

2

సుశీలని బాలకృష్ణదగ్గరికి తీసికెళ్ళాడు. సుశీలకి వెళ్ళటం యిష్టంలేకపోయినా తప్పిందికాదు. రానంటే ఆయనేమనుకుంటాడోనని భయం. ఇప్పుడామెలో ఓ విధమైన అధైర్యం పేరుకుంది...తన ఆరోగ్యం విషయంలో డాక్టరు యేం చెప్తాడో?... ఆమెగుండెలు పీచుపీచుమంటున్నయ్.

బాలకృష్ణ యింట్లోనే వున్నాడు... ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు.

చీకటి తెరలు

కొద్దిసేపు అదీ, యిదీ, మాట్లాడుకున్నాక డాక్టరు సుశీలని పరీక్షచేశాడు. ఆశ్చర్య పోయాడు.

స్నేహితుణ్ణి కొంత చాటుగా తీసుక పోయి,

"నీపెళ్ళయి సంవత్సరందగ్గర కావస్తోంది కదూ?" అన్నాడు.

"ఔ(నా! యేం?" ఆత్రుతగా అడిగాడు ప్రసాదరావు.

"మరేంలేదులే...అధైర్య పడకు... స్నేహితుడవుకాబట్టి వున్నది వున్నట్టు చెప్పాల్సివచ్చింది. మీ ఆవిడకి క్షయ ప్రారంభదశలోవుందిరా" చెప్పలేక, విధిలేక చెప్పాడు బాలకృష్ణ.

ప్రసాదరావు నిల్చున్న పాటున నీరైపోయాడు. అతనికి లోకమంతా కారు చీకటిగా కన్పించింది. అప్పట్లో యెవరిమీదా కోపం ముంచుకురాలేదు—దురదృష్టంపై తప్ప. కొన్నిక్షణాలవరకూ యేం మాట్లాడాలో తెలీలేదతనికి. స్నేహితుని విన్న వదనంచూసి బాలకృష్ణ చిన్నగా నవ్వుతూ "మరేం భయంలేదు లేరా...త్వరలో మేలుకున్నావ్...మంచి మందులిస్తే మచ్చుకన్నా కన్పించకండా హరించిపోతుంది" ధైర్యంచెప్పాడు. కాని ప్రసాదరావుకి నమ్మకం రాలేదు.

"బాగవుతుందంటావురా?" అధైర్య పడుతూ అడిగాడు.

బాలకృష్ణ నవ్వాడు "ఇంత నమ్మకం లేకపోతే యెలారా? ప్రథమదశలో వుంది గాబట్టి తప్పక బాగవుతుంది...యీ పట్నంలో వుంచేకంటె గాలి మార్పుకోసం పల్లెకిపంపితే బావుంటుంది. మీ అత్తారిది యేదో పల్లెటూరన్నావు కదూ/ యిక్కడికి దగ్గరేనా?"

"ఆ! దగ్గరే...అయిదుమైళ్ళుంటుందిరా"

"మరింకేం...? అక్కడికి పంపేయ్... మనం వెళ్ళడానిక్కూడా వీలుంటుంది. మరోసారి హెచ్చరిస్తున్నాను... మరేం బెంగపెట్టుకోకు.. ఆ బాధతంతా నేను తీసుకుంటున్నాను" అన్నాడు బాలకృష్ణ ...యిద్దరూ సుశీలదగ్గరివచ్చారు.

ఇంతవరకూ సుశీల గుండెలు కొట్టుకుంటూనే వున్నయ్. డాక్టరు భర్తని చాటుగా పిల్చి రహస్యంగా చెపుతున్న విషయమేవిటో ఆమెకి అర్థంకాలేదు...ఏదో తనకి తెలిసినవిషయంగురించి ఆమె లోలోన కుమిలిపోతూ బాధపడుతోంది. వాళ్ళు, తిరిగి వచ్చాక సుశీల భర్త మొహంలోకి చూసింది. అతని మొహం వెలవెల బోతూవుంది...యింతవరకూ ప్రశాంతంగా, ప్రకాశవంతంగా వుండేభర్త మొహం ఇప్పుడు వివర్ణమవడంతో ఆమెకి మరింత బెంగపట్టుకుంది. కాని యేమీ మాట్లాడలేదు. కొద్దిసేపు పోయాక ప్రసాదరావు భార్యని తీసుకుని వెళ్ళిపోయాడు. త్రోవలో డాక్టరు యేంచెప్పాడని సుశీల రెండుమూడుసార్లు అడిగింది...కాని ప్రసాదరావు నిజం చెప్పడానికెందుకో జంకిపోయాడు. ఏవీలేదని ముభావంగా జవాబుచెప్తూ గడిపాడు.

*   *   *

ఇంటికిపోయేసరికి కారుచీకటి తారులా పరిసరాల్ని ఆక్రమించుకుంది. ప్రసాదరావు తాళంతీసి యింట్లోకిపోయి దీపం ముట్టించాడు. సుశీల బట్టలుమార్చుకుని వంటగదిలోకిపోతూ,

"అన్నంపెట్టేస్తానండీ" అంది.

"ఇప్పుడేవద్దు సుశీ" అన్నాడు ప్రసాదరావు ముక్తసరిగా...ఆ జవాబులో యేదో అవ్యక్తమయిన బాధ నిబిడీకృతమైనట్టు వూహించుకొంది సుశీల. ఇంతవరకూ యిల్లాంటి జవాబు భర్తనోట వినలేదు. భారంగా అడుగులువేసుకుంటూ భర్తదగ్గర కొచ్చింది.

"అలావున్నారేవండీ?" అందిమెల్లగా.. అన్నదేగాని ఆమెగుండెలు జోరుగా కొట్టుకొంటున్నయ్...కాళ్ళు అప్రయత్నంగా వణుకుతున్నయ్.... ప్రసాదరావు మెదడులో సుళ్లు తిరుగుతున్నయ్ ఇంటికప్పువేపున్న దృష్టిని భార్యవేపు కేంద్రీకరించాడు...ఆమె వేపు పిచ్చిగా కాస్సేపు చూశాడు...ఆమెతో నిజం చెప్పాలా, వద్దా? అన్న సందిగ్ధంలో పడిపోయాడు. చెప్పేయాలి...లేకపోతే ఆమెకూడా నిజం తెలుసుకోలేక బాధపడుతుంది—తనకీ మనోవ్యధ తప్పదు.. చెప్పేస్తే కొంత వుపశమనం కలుగుతుందేమో ననుకున్నాడు.

"సుశీలా..." అతని గొంతు బొంగురు పోయింది.

"ఏవండీ...యేవిటో చెప్పండి"అంటూ అతనిముందు కూలబడింది. ఆమెకి భయం మరింత హెచ్చయింది. ఆయనయేంచెప్తారో ఆమె వూహించుకో గలిగింది.

"నీకు క్షయ వుందని డాక్టరు చెప్పాడు సుశీ" బాధపడుతూ అన్నాడు ప్రసాదరావు. సుశీల తలపై పిడుగుపడ్డట్టయింది...యింటిగోడలు కూలి మాదపడ్డట్టయ్యాయ్...నాన్న ఈయన్ని మోసం చేశారు...మొదట్నించీ తనకున్న జబ్బు విషయం యెందుకు చెప్పేయలేదు? ఆమె మెదడులో రైళ్ళు పరిగెడుతున్నయ్... ఢీకొంటున్నయ్...ఏంచెప్పాలో యేవిటో తెలీక మధనపడుతోంది. ఆమె మొహమంతా స్వేదబిందువులతో నిండి మసక దీపపుకాంతిలో మెరుస్తున్నయ్. ఆమె పెదాలు వణుకుతున్నయ్. కన్నీళ్ళు అప్రయత్నంగా చెమటబిందువులతో కలిసి చెక్కిళ్ళపై జారాడ్డం ప్రసాదరావు స్పష్టంగాచూశాడు.

"క్షమించండీ! మిమ్మల్ని మా నాన్న మోసంచేశాడు. నిజాన్ని కప్పిపుచ్చి నాటకమాడాడు.. యిందులో నాతప్పేంలేదండీ" అంటూ వలవల యేడ్చిందిసుశీల. భార్య పరిస్థితి, ఆవేదనచూసి ప్రసాదరావుకి జాలిపుట్టుకొచ్చింది. తనని మోసగించినందుకు కోపం యెందుకురాలేదో అతనికి తెలీలేదు . .అసలు కోపం యెందుకురావాలి? ఎవరిమీ దని? యిందులో భార్యతప్పేముంది...? మళ్ళీ సమాధాన వేడ్డాడు.

"అవుతే మీకు ఇంటికి యీ విషయం మొదటే తెలుసుననమాట" అన్నాడు ప్రసాదరావు మొహం పక్కకి తిప్పుకుని.

"తెలుసునండీ: మా నాన్న యెన్నో మందులిప్పించారు.. కొంత నయమయిందని కూడా అన్నారు.. తన బాధ్యత తీర్చుకుందుకు పెళ్ళిచేసేశారు.. యిందులో నా తప్పేముందో ఆలోచించండి"అంది సుశీల కన్నీరు చీర చెరగుతో తుడుచుకుంటూ.

అనుకోకండా ప్రసాదరావుకి గతం జ్ఞాపకమొచ్చింది. తను పెళ్ళిచూపులకి వెళ్ళినప్పుడు సుశీలని చూశాడు. కాని ఆమెలో అంతర్గతంగా యేంజబ్బుందో తెలుసుకోలేక పోయాడు. ఆ ఛాయలే అతనికి కన్పించలేదు. అదంతా అతనికో కలలా కన్పిస్తున్నదిప్పుడు...వాస్తవ లోకంలో పడ్డాడు. యెదురుగా భార్యవున్నా ఆమెపై కోపంగాని, ఆవేశంగాని, కలగలేదు.

చెప్పుకోవాలంటే ప్రసాదరావు శాంతస్వరూపుడు. దూరం ఆలోచించే వ్యక్తి... యీ విషయంలో తప్పు నిర్ణయించాలంటే సుశీలతండ్రే బాధ్యుడిలా అగుపించాడతనికి ...మళ్ళీ అతనిలో పరివర్తన...యిదంతా భగవన్నిర్ణయంఅనుకుని వేదాంతంలోకి దిగిపోయాడు. దాంతో మరింత శాంతం, సహనం, అతనిలో స్థిరపడ్డాయి. "ఇందులో తప్పెవరిదీలేదు సుశీలా! యిదంతా నా దురదృష్ట...నీతో హాయిగా జీవననౌకను నడుపుదా మనుకున్నాను. కాని యేదో చీకటితెర అకస్మాత్తుగా అడ్డుపడింది. అదేవిటో నా జీవితంలో అడుగడునా అపశృతులే!" ఆవేదనతో కృంగిపోయాడు భర్త ఆవేదన చూసి మరింత చలించిపోయింది సుశీల. భర్త తనను విడిచి పెడతాడన్న భయంగానీ, విచారంగానీ, ఆమెకులేదు...తన విషయంలో బాధపడి కృంగిపోతాడేమోనని బెంగపట్టుకుంది.

"డాక్టరేమన్నాడండీ ?" మొహందించుకొని మెల్లగా అంది...ఆమె కళ్ళనుండి రెండు బిందువులు ప్రసాదరావు పాదాల్ని అభిషేకంచేశాయి.

అది 'వర్టికల్ చావా?' లే 'హారిజాంటల్ చావా?'

నాకు ఉదయం ఆరు ఆరున్నర కాకుండా కాఫీ త్రాగడంఅలవాటు. ఈ అలవాటు ఒక ముప్పైయేళ్లనుంచి పరిపాటిగా వున్న కారణంచేత, ఎక్కడికి వెళ్లినా, ముందు ఆ ప్రయత్నంమీదనే ఇంట్లోవాళ్లంతా నా విషయమై ఉండేటట్లు చూస్తాను. అంచేతను ఆ ఉదయంకూడా, నేను వెళ్లింది పొరుగూరు అయినా, బస చేసింది కావలసినవాళ్ల యిల్లు కవడం చేత, ఏ లోపం లేకుండా, నాకు రాకుండా, నా బంధువర్గం ప్రవర్తించారు.

వారి చావడిలో ఒక టేబిల్ వుంది. ఉదయం 6కల్లా టేబిల్ మీద కాఫీ పెట్టారు. టేబిల్ ముందు ఒక కుర్చీ వేశారు. కుర్చీ మీద నేను కూర్చున్నాను. "నేనొక్కణ్ణేనా? ఇక్కడ కూర్చునేది? ఇది పుచ్చుకునేది?" అని అంటే "నీ వొక్కడవే! మేమంతా కొందరం పుచ్చుకోనే పుచ్చుకోం, కొందరం బాగా ఎండెక్కి స్నానం చేశాకో జపం చేశాకో తీసుకుంటాం" అని వారంతా అన్నారు. ఇంటి యజమాని ఆరోగ్యంకోసం త్రాగుతున్నాను అని ఆలా ఎత్తి ఇంచుకంత కాఫీ చవి చూచాను.

చవిచూచానో లేదో, చటక్కున వీధి తలుపు తోసిన చప్పుడైంది. తెరువబడింది. వీధి అంతా వెల్లడిఅయింది. అంతగా మార్గం మీదనుంది నే బసచేసిన ఆ యిల్లు.

ఆ యింటికి ఎదరతట్టు మరి ఇళ్లు లేవు. అదంతా పెద్ద పొడుగుపాటి గట్టు. గట్టావల పోటుపాటు కలిగివున్న పెద్ద మురుగు కాలువ. కాలువమీదను ఒక వంతెన సన్నపాటిది, ఒకటి రెండేండ్లయి నిర్మింపబడ్డాది, ఇంకా కాతందనం పోనిది ఒకటి కానవస్తూ వున్నది వుంది.

ఆ వంతెనను అంతక్రితం సాయంత్రమే షికారుగా వెళ్లిచూచాను. చాలా రమ్యమైన దృశ్యాన్ని ప్రదర్శించింది. ప్రశాంతమైన గాలిని వీచింది. అనుకోకుండానే ఒకడలా నడుస్తూవస్తే, ఒకడిలా నడుస్తూవెళ్తే వాడు ఆ వంతెన మార్గంగా అవిరళంగా! కాని ఎన్నిసార్లు దాని వెడల్పు నిడివి ఎత్తు కనిపెట్టి చూచినా జీవించివున్న మనిషి నడవడాని కనువైన వంతెనగానే తట్టింది కాని అది అంతకుమించి వేరేవిధిగా తట్టలేదు. దానిపేరే ఇంగ్లీషులో "ఫుట్ బ్రిడ్జి" అంటారు లాగుంది.

వీధితలుపు తోసి నతను మూరుకోక తిరుగ దాన్ని మూయబోయాడు. "మూయకు ఉదయభానుని కాంతిలో కాఫీ ద్విగుణీకృతంగా నా కుత్సాహమిస్తూ వున్నది." అన్నాను. అంటే ఆవలి వ్యక్తి "ఏమి చూస్తావులే!" అన్నాడు. అంటూ మరింత దగ్గరగా వేశాడు తలుపు. అతడి మాట నా కర్థంకాలేదు. అతణ్ణి లోపలకు వెళ్ళనిచ్చి, నేనే నా కాఫీ పాత్రను వెలితిచేసి, అట్టే వీధితలుపు తెరచి చూచాను. ఓం ప్రప్రథమంగా వంతెనకేసే చూచాను.

కవికొండల వెంకటరావు

అక్కడ చాలామంది జనంమూగి వున్నారు. తత్క్షణం లోపలకువెళ్ళి, ఇందాకటి వ్యక్తిని పునఃపిలిచి "ఏమిటి! అంత మందిజనం ఆలా మూగివున్నారు" అన్నాను. అంటే "తెలియదా నీకు? ఒకమనిషి హత్యగావింపబడ్డాడని కొందరు ఆత్మహత్య గావించుకొన్నాడని కొందరు ఇలా తర్కించుకుంటూ మూగేరు వారంతా!" అని అన్నాడు. నిన్న సాయంత్రం నిక్షేపంలాగు వుండే ఆ వంతెన ఆస్థలం అదంతా!" అని అన్నాను. "ఎంతసేపు కావాలి ఒకస్థలం యొక్క చరిత్ర మారడానికి" అని అంటూ ఆవ్యక్తి తిరుగ పరుగెత్తాడు ఆ మూగినజనం ఏమేమి చెప్పుకుంటున్నారో వినడానికి.

నేను వానిలా పరుగెత్తకుండా, గుమ్మంలోనే నిలబడి ఆ దృశ్యాన్ని చూస్తూ ఆలోచించాను.

దృశ్యం! బహూ కనికరం గొలిపే దృశ్యం! ఒక ఊరు పేరు లేని మానవుడు తన మెడకు ఒక త్రాడును తగిలించుకుని అలా శవమై వంతెనయొక్క పక్క గజాల నుండి వేలాడి కనిపించసాగాడు. అయితే ఆ త్రాడు వరాయివాళ్లు తగిలించగా అలా వ్రేలాడిపడిపోయిందా శవం? లేకపోతే ఆత్మహత్యగా పరిణమించినమీదట శవమై వ్రేలాడిపోతూందా? అన్నది నాడు నా చూపుకు అనలేదు. ఈ కథను చదివేవాళ్లకున్నూ అనవలసిన అవసరం లేదు.

మన మనస్సుల్ని వేధించవలసిందల్లా – అప్పుడు అతనిచావు "వర్టికల్ చావా? హారిజాంటల్ చావా?" అని.

"హారిజాన్టల్" చావు అని వ్రాశానా యీకథ చదివే అందరిపాదాలు కలిసి వాణ్ణి వంతెనమీద గత రాత్రి త్రొక్కి చంపివేశారనే వ్రాయాలి. వర్టికల్ చావుఅన్నానా ఆపాపం ఎవరినీ చుట్టుకోదు"

అయినప్పటికీ నా డెందంలో సముద్భవించిన ఆనాటిసందేహము ఇప్పటికీ తీరలేదు ఎప్పటికీ తీరదనే అని అనుకోవలసి వుంటుందేమో కూడాను. ప్రతీవానిచావు "హారిజాంటల్" అనే అనాలేమో!

అయితే అన్నిచోట్ల అంత సన్నపాటి వంతెనలు అటువంటి వింతప్రదర్శనములు వాటినుండి వ్రేలాడుతూవున్నవి వుండగలవా?

రాత్రి చీకటి. పగలు వెలుగు. చావు "హారిజాంటల్" అయితేం "వర్టికల్" అయితేం. తెలియవచ్చింది వెలుతురులో శవం! చీకటిలో ఆత్మ. ★

అతనికి నలుగుర్లో మంచి గౌరవం ప్రతిష్టా వున్నాయి అతనిమాటకు తిరుగులేదు. అందుకని అతని అంతరంగిక స్నేహితుడు అడిగాడు.

"ఏహోయ్—ఇవతల అందరికీ తలలోనాలికలా వుంటావు గదా-యింటి దగ్గిరకూడా..."

"ఆ! అంతే—" అన్నాడు అతనుధీమాగా. ఆశ్చర్యపోయి ఆ స్నేహితుడు అడిగాడు.

"అందుకునువ్వు వుపయోగించిన యుక్తిఏమన్నా—"

"లేకేమి— మాట్లాడేదంతా మాఆవిడకే వప్పగింప చేశాను."

జి. కేశవరావు.

ప్రసాదరావు కళ్ళు జలదరించింది. జరిగిందేదో జరిగిపోయింది. తను అనవసరంగా ఆమెకి బాధ కలిగిస్తున్నాను... అనుకొన్నాడు.

"ఫరవాలేదన్నాడులే సుశీ! యింకా ప్రారంభదశలో వుందట. తప్పక బాగయిపోతుందన్నాడు." తల నిమురుతూ బుజ్జగిస్తున్నట్టుగా అన్నాడు ప్రసాదరావు.

"పోనిండి.. నా కేలావున్నా నాకు విచారం లేదు... నేను చచ్చిపోయినా ఫరవాలేదు.. జరిగిందేదో జరిపోయింది. మీరు మాత్రం మనసులో బాధపడకండి..." అంది సుశీల రుద్ధకంఠంతో. భార్యమాటలు ప్రసాదరావుకి చైతన్యం కలిగించాయి.

"అదేమిటామాటలు సుశీలా? ఎందుకు చచ్చిపోతావ్..? డాక్టరు యేం భయం లేదని హామీయిస్తుంటే యింకేం? యిక్కడికంటె, పల్లెలో కొన్నాళ్లు గడిపితే మంచిదంటున్నాడు డాక్టరు.. రేపే మీ వూరు ప్రయాణం కడితే బావుంటుంది. ప్రతి ఆదివారం మేంయిద్దరం అక్కడికి వస్తుంటాం" అన్నాడు ప్రసాదరావు గుండె ధైర్యం తెచ్చుకుని.

సుశీల హృదయం యిప్పుడు కొంచెం తేలికపడింది. భర్త అంత విశాల హృదయంతో హామీయిస్తున్నప్పుడు తనెందుకు బాధపడాలి? తన భర్త లాంటి వ్యక్తులు లోకంలో యెంతమందివుంటారు? ...అనుకుంది. జవాబేం చెప్పకండా మౌనంగా మొహం దించుకుని కూర్చుంది. ఇంకేమేమో మాట్లాడి, భార్యని కలతపర్చటం మంచిది కాదనుకొన్నాడు ప్రసాదరావు.

"యీ విషయంలో అట్టే మధనపడకు సుశీలా! నీకేం భయంలేదు కొన్నాళ్ళకి మళ్ళీ పువ్వులా తయారవుతావులే...వెళ్ళి వడ్డించు . భోంచేద్దాం." అంటూ ఆదరంతో ఆమె భుజాలు పట్టుకుని లేవదీశాడు. సుశీల లోలోన నవ్వుకుంది మెల్లగా అడుగులు వేసుకుంటూ వంటగదివేపు వెళ్ళింది.

3

మరుచటిరోజే ప్రసాదరావు భార్యని తీసుకొని అత్తవారింటికి వెళ్ళాడు. వీళ్ళు అకస్మాత్తుగా రావటం వాళ్ళకి ఆశ్చర్యం కలిగించింది. ప్రసాదరావు విషయమంతా మామతో చెప్పాడేగాని, తనకి జరిగిన మోసానికి వుద్రేకపడి తిట్టలేదు. ప్రసాదరావు మామ వెంకటేశ్వర్లు తన తప్పిదాన్ని తెలుసుకుని, పశ్చాత్తాపపడి అల్లుడిని క్షమాపణ వేడుకొన్నాడు. అతని మనసుకి తెలుసు, ప్రసాదవు కాకండా మరోవాడైతే తన కూతురిగతి యేమవుతుందో! అల్లుడిపై పూజ్యభావం యేర్పడింది...అతనికే కాదు ....యింట్లో అందరికీ. ప్రతివారం డాక్టరు, తనూ, వస్తుంటామని చెప్పి రెండు దినాలుండి వెళ్ళిపోయాడు ప్రసాదరావు.

వెంకటేశ్వర్లు మొదట్నించీ జరిగిందంతా తెలుసుకుని తననితానే తిట్టుకున్నాడు. అంతమంచివాణ్ణి మోసంచేశానని అతని బాధ...నిజానికి తన అల్లుడు లక్ష వ్యక్తుల్లో ఒకడు—అంత విశాలహృదయం, సహనం, యెవరికుంటుంది? అనుకున్నాడు.

ప్రతి ఆదివారం ప్రసాదరావు డాక్టర్ని తీసుకుని వెళ్తుండేవాడు పల్లెకి. బాలకృష్ణ శక్తివంచనలేకండా మందులు, యింజక్షన్లు యిస్తున్నాడు.. రాను రాను సుశీల ఆరోగ్యం పుంజుకోవటం తన కష్టం ఫలిస్తుంది కదా అని సంతృప్తిపడ్డాడు బాలకృష్ణ. ప్రసాదరావు యెంత ఆనందిస్తున్నాడో అతనికే తెలియాలి.

అప్పుడప్పుడు మాత్రం ప్రసాదరావు అంతులేని ఆలోచనలో పడిపోతాడు...తన లాంటి వ్యక్తుల జీవితంలోనే భగవంతుడెందుకో ఒడిదుడుకులు, తుపానులు కల్పిస్తాడు తనేం తప్పుచేశాడని? అతిఘోరమైన తప్పులుచేసే వాళ్ళందరికీ జీవితం హాయిగా వెడుతుంది...తనేం తప్పులు చేయలేదనే గామోసు చీకటితెరలు నిర్మిస్తుంటాడు?.. అని; అయినా నిరాశమాత్రం అతని హృదిలో చొరనియకండా గుండె నిబ్బరంతో, ఆశతో ఆ చీకటి తెరలమధ్య జీవిస్తున్నాడు ప్రసాదరావు. ఎప్పుడో ఒకప్పుడు ఆ తెరలు విచ్ఛిన్నంకాక మానవని అతని మనోనిబ్బరం.. ★



"పలుకరాదటే చిలుకా!" చిత్రకారుడు : పి. గణపతిరావు—శ్రీకాకుళం.

పార్కు బెంచీ సాక్షి

నాకు స్వంతంగా ఎవ్వరితోనూ ఎటువంటి లావాదేవీలు లేకపోయినా నేను కోర్టుకి వెళ్లవలసి వచ్చింది. ఒకానొక క్రిమినల్ కేసులో సాక్ష్యం చెప్పక తప్పింది కాదు. ముద్దాయి మా మేనమామకి కొంచెం కావలసినవాడు, ఆయనవచ్చి "నరసింహం! నీకు కోర్టుకిరావడమంటే ఇష్టంలేదని తెలుసునుగాని, మరి తప్పదు, ఏం చెయ్యమన్నావు?" అన్నాడు. "సరే, కానీ" అన్నాను, నాకూ విజయనగరంలో కొంచెం బజారుపని ఉందికదా అని.

తీరావెళ్తే కేసు వాయిదాపడింది. మామయ్య జనతాలో అనకాపల్లి వెళ్లవలసుంది అని రైలుస్టేషనుకి బయలుదేరేడు. నేను బజారుకివెళ్ళి అక్కడనుండి బస్సులో వెళ్లిపోతానన్నాను.

బజారులో పెద్దపనేమీలేదు; పాత బంగారపువస్తువ ఒకటి మార్చేసి కొత్తఫాషను దొకటి కొనడం; అంటే అన్నివిధాలయిన నష్టమూ చేతకూలీ పెట్టుకోడమన్నమాట - ఏంచేస్తాం, [illegible] అందులో ఇది అమ్మాయికి సం[illegible] వ్యవహారము - ఫాషను గురించిగాని, [illegible]వసరం డబ్బు దండుగను గురించిగాని ఏమీ మాట్లాడ్డానికి వీల్లేదు. అక్కడ పని త్వరగానే అయిపోయింది.

ఇక వాచీ ఒకటి కొనవలసి ఉంది; ఇది పెళ్లిలోనే ఇచ్చిఉండవలసింది; కాని, అప్పుడు వాళ్లు సైకిలు కావాలన్నారు. ఇప్పుడు పండగకి తీసుకొని వచ్చేటప్పుడు ఉంగరం ఎంతఎత్తుది, ఎటువంటిది ఇవ్వాలని మాలో మేము తర్జనభర్జన పడుతూ ఉండగా అమ్మాయి అంది "ఉంగరం ఎందుకు, వాచీ అయితే బాగుంటుంది; అప్పుడు పెళ్ళిలో పెట్టుకొన్నది వాళ్ల స్నేహితుల దెవరిదోనట - నాతో రెండు మూడుమార్లన్నారు; వాచీ లేకపోవడం ఇబ్బందిగా ఉందని" వాచీ కొనడం విషయంలో ఏరకంది, ఏకంపెనీది కొనడమో నాకు సంపూర్ణంగా స్వాతంత్ర్యంఇస్తూ మా ఆవిడ 'నూరురూపాయిలకంటె ఎక్కువ మాత్రం పెట్టకండి' అని ఒక నిబంధన పెట్టింది. నేను సరేనన్నాను.

వాచీకొనడం నేననుకొన్నంతసులభంగా తెమలలేదు. గోల్డుగోల్డుది కొనడమా, స్టెయిన్‌లెస్ స్టీలుదికొనడమా, గుండ్రనిదా, దీర్ఘచతురస్రాకారపుదా? సాదా డయలా? రేడియమ్‌డయలా? ఈసందేహాలిలాఉండగా- కాస్త కంటికినచ్చినవాటి ఖరీదులు నూటనలభై యాభై అలా ఉంటున్నాయి. ఇంత చేసికొంటే అతగాడికి నచ్చుతుందో

పంతుల శ్రీరామశాస్త్రి

నచ్చదో? ఇంతకంటె పండక్కివచ్చినప్పుడు ఆ నూరురూపాయిలూ అతనిచేతికే ఇచ్చి, ఉదయం బస్సులోవచ్చి వాచీ కొనుక్కొని, సాయంత్రానికి వచ్చెయ్యమంటే నయమేమోననిపించింది. కాని, ఒక వాచీ కొనడానికికూడా మనకి ఇంతసందేహమయితే మరెందు కనిపించింది. అంతేకాదు, నాకు కూడా వాచీలేదు. చిన్నతనంలో వాచీ కావాలని చాలా సరదాగా ఉండేది. అది మరి తీరనేలేదు. అంటే కొనుక్కొందికి తగినశక్తివచ్చినతరవాత ఆదృష్టి కలగలేదు. ఇదీ బాగానే ఉంది. మనకి నచ్చింది కొని తీసుకొని వెళ్ళడం; తనకి ఇష్టపడితే అదే ఉంచుకోమనడం; లేదంటే మరొకటి కొనుక్కోమనడం. ఈ రకమయిన నిశ్చయానికి వచ్చినతరవాత ఎంపిక అట్టే కష్టంకాలేదు. గుండ్రనిది, మరీ చిన్నసైజు కానిది, నూటనలభై రూపాయిలకు తీసుకొన్నాను. ఇంకా బస్సుకి చాలా వేళుందికదా అని, కాఫీహోటలుకికూడా వెళ్ళి బస్సుస్టేండు చేరుకొన్నాను. అప్పటికింకా నాలుగున్నరే అయింది.

న్యాయంగా బస్సు ఉండవలసిందే. కాని ఆరోజున రెండవ బస్సు మరమ్మత్తులో ఉండడంవల్ల లేదట. మొదటి బస్సు అంతకు ఒక పదినిమిషాలకు ముందే వెళ్ళిపోయిందిట. కాఫీహోటలుకి వెళ్ళి ఉండకపోయినా అంది ఉండును అనుకొన్నాను. కాని ఏం లాభం; వెళ్ళక పోయి ఉండడమెలాగు?.. మరి బస్సు లేదు; రాత్రి ఒంటిగంటకిగాని రైలులేదు. అంతవరకు ఏం చెయ్యడం? నిర్మొగమాటంగా ఇళ్ళకు వెళ్ళవలసిన మిత్రులిద్దరూ వేరేఊళ్లకు వెళ్లిపోయేరు. బంధువుల ఇళ్లకి వెళ్తే పెళ్లిమాటలకి వచ్చేమనుకొంటారు. అంతకంటె రయిలు వేళదాకా, ఎలాగో కాలం గడపడం మేలు.

చాలారోజులయింది సినిమా చూడలేదు. అయితే సినిమా మొదటి ఆట అయినతరవాత భోంచెయ్యాలంటే హోటళ్లు మూసి ఉంటాయి. అంతకుముందు ఆరుగంటలలోగా భోంచెయ్యడం నా తత్వానికి పడదు. అంతకంటె ఇక్కడ పార్కులో బెంచీమీద కూర్చుని వచ్చిపోయే మనుష్యులని చూస్తూ, పబ్లికు రేడియో అందిచ్చే సమాచారాన్ని ఆకర్ణిస్తూ, సంగీతాన్ని ఆస్వాదిస్తూ, కాదు అనుభవిస్తూ; ఒకొక్కప్పుడు రేడియో సంగీతాన్ని కష్టపడి అనుభవించవలసిందే, కర్మానుభవంలాగ. ఇంట్లో రేడియో అయితే ఇష్టంలేకపోతే ఆపెయ్యవచ్చును, కాని పబ్లిక్ రేడియో గాన రసాన్ని ఆస్వాదించి తీరవలసిందే, ఆరుచి మన కెంతమాత్రం ఇష్టపడకపోయినాను.

కేవలం వచ్చేపోయే మనుష్యుల పరిశీలన మీదా, రేడియోమీదా ఆధారపడితే లాభంలేదని, గంట స్తంభందగ్గరకు వెళ్ళి నాలుగు కిళ్లీలు, ఒక సిగరెట్టు పెట్టె, మూడు పత్రికలు, వాటిలో ఒకటి కేవలం సినిమా విషయాలకి సంబంధించినదికూడా- కొనుక్కొనిపోయి కూర్చున్నాను, పార్కు బెంచీమీద——

కొన్న రెండు పత్రికలలోనూ ఒక దానిలో నరసింగరావుది, రెండవదానిలో సుబ్రహ్మణ్యంది కథలున్నాయి. రెండింటిలోనూ ఉండడం చాలా విశేషంగా అనిపించింది. అసలివాళ బస్సు తప్పిపోవడం కూడా ఇందు నిమిత్తమే అయిందా అన్నంతలా కూడా అనిపించకపోలేదు - ఏమంటే ఇంటిదగ్గర అయితే అంతగా చదవాలనిపించదు. పిల్లలెవళ్ళో చదివి ఇందులో నరసింగరావుగారి కథ ఉంది నాన్నా

అంటారు. వాళ్ళే తమలో తాము చర్చించుకుంటారు. వాళ్ళకీ మరి నాన్నగారు రాయలేదుగాని, రాసిఉంటే చాలా మంచి కథలు రాసిఉందురనే ఆశఉంది. నేను నా ఆఖరికథ రాసి పదేళ్ళకు పైగా అయింది. అతర్వాత కొన్నాళ్ళపాటు మిత్రులు తాము ఏమేమి రాసిందీ, ఎక్కడెక్కడ ప్రచురణ జరిగిందీ తెలియజేస్తూ ఉండేవారు; నా బద్ధకంమూలంగా మరి వారికీ ఆశ్రద్ధతగ్గిపోయింది. అవునుమరి, ఉత్సాహం అన్నది రెండుప్రక్కలాఉంటేనే నిలబడుతుంది. అయినా ఏదయినా పుస్తకం అచ్చువేయించినప్పుడుమాత్రం వెంటనే పంపిస్తున్నారు. నేను ఏ కొంత తృప్తికరంగా నా అభిప్రాయాన్ని రాసినా మిక్కిలి సంతోషిస్తున్నారు. ఇవాళ నిజంగా కథలు చదవడానికి చాలా అనువయినసమయం. అందులోనూ నరసింగరావు కథ 'సాక్షిలేని కేసు' - నేనూ ఈరో జిక్కడికి సాక్ష్యం చెప్పడానికేవచ్చేను. సాక్షులు - సాక్ష్యం.

ఉదయంనించీ పరధ్యానంగా ఉన్నప్పుడల్లా చిన్నప్పుడు గిరతంలో చదివినపద్యం, "ఇంజరంబొకసాక్షి ఏనాముదాసాక్షి పల్లెపాలేము దానెల్లసాక్షి" జ్ఞాపకం వస్తూనే ఉంది. ఇందాకొ బస్సు తప్పిపోయిందనగానే నా పరిస్థితికికూడా చాలా సాక్షులు గోచరించారు - బస్సు స్టేండొక సాక్షి, పార్కు బెంచీసాక్షి, పబ్లికురేడియో పాట సాక్షి, మలబారుకాఫీహొటలు ప్రొప్రయిటరొకసాక్షి, కిల్లీసాపు స్వామిసాక్షి, బంగారు వెండి వ్యాపారస్థుడొకసాక్షి, వాచినమ్మిన స్టోర్సువాడుసాక్షి. ఇలా పద్యం పెరిగిపోసాగింది. తీరా కథ చదవడం ప్రారంభం కానేలేదు. ఇది పద్ధతికాదని పత్రికమూసి, సిగరెట్టు పూర్తిచేసి, మరొకటి ముట్టించి, ఇంకొకకిల్లీ వేసుకొని, శ్రద్ధగా కథ చదవడం ప్రారంభించాను.

మొదలుపెట్టేవరకే మనప్రయత్నం. తరవాతకథ దానంతటదే లాగుకొని పోసాగింది. నరసింగరావు వెనుకటి కథలలాగ మనస్తత్వ విశదీకరణతో నిండి కాక, కథ చాలా చురుకుగా సంభాషణరూపంగా నడిచిపోసాగింది.

కథ చివరిభాగం చదువుతున్నాను. చాలా రసవంతంగా ఉంది. చేతిలో సిగరెట్టు పారేసి, ఆఖరికోలమ్ చదువుతూ ఉండగా అతి సమీపంలో "నమస్కారముండీ నరసింహంపంతులుగారు!" అన్న పలకరింపు వినవచ్చింది. అతను నా పక్కనే బెంచీమీద కూర్చొని ఉన్నాడు.

'కథ చదువుతూ ఉండగా ఎవరో వచ్చి బెంచీమీద అవతలి చివరకు కూర్చోడం తెలియకపోలేదుగాని, అంతకంటె దృష్టి పెట్టలేదు. కథలోని తన్మయత్వమేకాదు, కళ్ళజోడు పెట్టుకొని చదువుతున్నానేమో, మనిషిమీద దృష్టి సరిగా ఆనలేదు.

పలకరింపు విన్న తరువాత, అప్రయత్నంగా నమస్కారం అంటూ పత్రిక ముడిచి, కళ్ళజోడు తీసి, పరికించి చూసేను. కాని, ఎవరో ఏమిటో సరిగా గుర్తుకు రాలేదు. గొంతుమాత్రం బాగా పరిచయమయిన దానిలాగే ఉంది.

వెంటనే పోల్చలేకపోయాడని ఒప్పుకొందికి మనస్కరించలేదు. కాని ఏం చెయ్యడం? నేను వాచ్యంగా పోల్చలేక

★ పార్కు బెంచి సాక్షి ★

పోయానని చెప్పడానికి ముందే అతను, "పంతులుగారు నన్ను పోల్చినట్టు లేదు, నేను విశ్వనాథంగారి అబ్బాయిని, నా పేరు సుందరం!"—

నేను నా మతిమరుపుకి అతను నాకంటె బాగా చిన్నవాడయినా, చాలా వినయంగా క్షమాపణ చెప్పుకొన్నాను - అతన్ని నేను ఆఖరిమారు చూసి ఏడేళ్లు పైగా అయింది; కాక, నా దృష్టికూడా ఏమిటో ఇటీవల అట్టే బాగా లేదు.

అతను నేను పోల్చుకోలేకపోడానికి ఎక్కువ సావకాశం ఉందని అంగీకరిస్తూ, నాలో మాత్రం నాటికీ నేటికీ ఏమీ మార్పు వేషంలోగాని, ఆకారంలోగాని లేకపోవడంవల్లనే తాను అల్లంత దూరంనించి గుర్తుపట్టి వచ్చానన్నాడు. వచ్చి, ఇక అయిదు నిమిషాలపాటు నేను చదువుకొంటున్నాను కదా అని మాట్లాడకుండా కూర్చున్నాడుట.

అతన్ని నేను గుర్తుపట్టలేకపోయినందుకు నా అశక్తిని ఎంతగా కారణం అనుకున్నా, నిజానికి లోపం అతనిలోనే ఉంది ఎక్కువగా. పూర్వం సుందరావు అన్న పేరుకి తగినట్టుగా ఉండేవాడు. ఇప్పుడు పేరొక్కటే మిగిలినట్టుంది.

ముతక ఖద్దరుబట్టలు — కొద్దిగా మాసిన గడ్డం - ఈ రెంటినీ సర్దుకోవడం అట్టే కష్టం లేదు. కాని, జుట్టు అక్కడక్కడ తెల్లబడుతోంది. క్రాపింగు మొగానికి అమిరినట్టు లేదు. అసలు మొగంలో ఎక్కడా కళాకాంతులు లేవు; నీరసంగా, నిష్ప్రభంగా; నిరాశతో నిండిఉన్నట్లనిపించింది. మాటకూడా, ఏదో తప్పుచేసినవాడు సమాధానం చెప్పుకుంటున్నట్లుగా వినిపించింది.

అతనీ ఊళ్లో ఉన్నాడన్న విషయం నాకు తెలియకపోలేదు. కాని ఆ సంగతి ఇంతసేపూ స్ఫురించనేలేదు. వాళ్లి ఇంటికి తిన్నగా రాకపోయినందుకు అతనికి, సమాధానం చెప్పుకొనివచ్చేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. కోర్టుపనే కాదు, ఇంటి దగ్గర రాత్రి వెళ్ళితీరవలసిన అర్జంటుపని ఉండడం, అంతే కాదు, ఆ సమయంలో అక్కడ పార్కులో కొందరిని కలుసుకోవలసి ఉండడం మొదలయిన ఏవేవో కారణాలు చెప్పుకొన్నాను. నేను నమ్మించడానికి ప్రయత్నిస్తున్నకొద్దీ అతని అపనమ్మకం ఎక్కువవుతుంది.

చివరికి అతను అప్రయత్నంగా 'మీరు మా యింటికి ఎందుకు వస్తారులెండి' అ నేసి అన్నందుకు కొంచం నొచ్చుకొన్నట్టున్నాడు.

నిజానికి అతను స్కూలుమాష్టరుపని చేస్తున్నాడో, బేంకుగుమాస్తాపని చేస్తున్నాడో, ప్రెస్సాఫీసులో పనిచేస్తున్నాడో నాకు గుర్తు లేదు. అతను ఇన్ని మాటలు అంటున్నాడు గాని, ఆ వైనం ఏమీ తెలియ జెయ్యలేదు.

నాకు మరి ఈ ధోరణి అట్టే సేపు సాగడం ఇష్టంలేకపోయింది. సూటిగా ప్రశ్న వేసేను.

"ఏమోయి; సుందరం! నీ వయసింకా ముప్ఫై అయినా దాటలేదనుకొంటాను. ఏమలా నీరసంగా ఉన్నట్టున్నావు; ఒంట్లో గాని బాగా లేదా?"

అతను కోపం తెచ్చుకొంటాడేమో నని అనుమానపడుతూ— నేను వేసిన ప్రశ్న అతనికి చాలా తృప్తి కలిగించినట్టుంది ఇంతసేపటికి అడగవలసిన ప్రశ్న అడిగారన్న ధోరణిలో మొదలుపెట్టాడు. నరముల బలహీనత, తరుచు తలనొప్పి, అజీర్ణమూ, ఇంకా ఏమేమో చెప్పుకుపోసాగాడు; హాస్పిటలు, డాక్టర్లు, వాళ్లు పెద్దపెద్దజీతాలు పుచ్చుకొంటూకూడా సామాన్యరోగుల యెడలచూపే అనాదరమూ ఒక్క హాస్పిటల్లోనే కాదు, ప్రజాహితసంస్థలలో పనిచేసే వారికి సర్వసాధారణమయిన అశ్రద్ధ, దంభము, స్వలాభపరాయణత్వము, ధనికులంటే పక్షపాతమూ.. ఇక ఆ ధోరణికి అంతు లేదనిపించింది. సరిగా విశ్వనాథంధోరణే పట్టుబడింది. కాని, వాడికి ప్రతిసామాన్య విషయాన్ని వివాదవిషయంగా మార్చే పద్ధతి ఉండేది. ఎవరేదన్నా దానిని కాదని, అంతకంటె మరేదో చాలా ఘనమయినదని అంటూ, ఎదురుప్రశ్నలు వేసేవాడు. నలుగురు చేరినచోట, మరెవ్వరూ ఏదీ సరదాగా మాట్లాడుకొందికి వీల్లేకపోయేది విశ్వనాథం ఉంటే వాడిమీద వ్యక్తిగతంగా ఎంత అభిమానంఉన్న వాళ్లకయినా వాడి ఈ వివాదాలు పెంచే తీరు నచ్చేది కాదు. అయినా వాడిలో ఏదో స్నేహితులను ఆకర్షించే గుణం ఉండేది. ఇతనికి ఆశక్తికూడా ఉన్నట్టులేదు. అంచేతనే అన్నిమాటలూ తనలో తానను కోడమే అలవాటయినట్టుంది. కీయిచ్చినబొమ్మలు, కొంతసేపటివరకు ఎలా గంతులు వేస్తాయో అలాగ ఇతనిధోరణి సాగిపోయేట్టుంది

కొంతసేపు విన్నతరవాత నేను అతని మాటలను శ్రద్ధగా వినలేకపోయాను. అతను చెప్పే ఆ చెప్ప ఎప్పుడు ఆగిపోయాడో కూడా గురించలేదు - పెద్ద గోలచేస్తున్న ఫేన్ అకస్మాత్తుగా ఆగిపోయినట్టయింది. అయినా నేను అతను చిట్టచివర చెప్పిన మాటను వినలేదు, మరి ప్రసంగం తప్పిస్తేగాని లాభం లేదని, "అబ్బాయి, సుందరం! నీకేమయినా పిల్లలా?" అన్నాను.

పోయిన ఒక ఆడపిల్లకాక, ఇద్దరు కొడుకులూ ముగ్గురు ఆడపిల్లలూ, ఇక, వాళ్ళను గురించి తను పడిన యాతనలూ, వాళ్ళ బల్లజబ్బులూ, పాలడబ్బాల ఖర్చులూ, మందులఖర్చులూ, వాళ్లి అత్తవారుకూడా తక్కిన ఆడపిల్లలకు చేసినట్టి చెయ్యక పోవడమూ, తనకూ తండ్రికీ నాడు వచ్చిన తగాదా నేటివరకూ అల్లాగే ఉండడమూ, తాను ఎంతటి అవస్థపడుతూ అయినా సరే తండ్రి సహాయాన్ని అర్థించక పోడంలోని ధీరత్వమూ, తండ్రి ఎవరిద్వారానో కబురు కూడా చేసేడట; తను స్వయంగా వెళ్లి కావాలంటే సహాయం చేస్తానని; అతనికి సహాయం చెయ్యాలని ఉంది; ఇతనికి చేయించుకోవాలని ఉంది; కాని, ఇద్దరికీ వదలవలసిన అహంభావం; నేనెందుకు తన దగ్గరికి వెళ్తాను, తనకంత బాధగా ఉంటే రమ్మను - ఇదీ ఇద్దరి మొండి పట్టుదలాను.

అసలీ పట్టుదల లెందుకు వచ్చేయంటే, విశ్వనాథం మామూలుగా అందరిలాగే కొడుక్కి సంబంధం నిశ్చయపరచుకొని వచ్చాడు. పిల్ల చాలా అందంగా ఉంటుంది, చదువుకొంటూంది; బాగా పేరుప్రతిష్ఠలుగల కుటుంబం; వాళ్ళకి ఆఖరు పిల్ల కావడంవల్ల, అదివరకు అందరు పిల్లలకూ ఇచ్చినట్టే కట్నకానుకలిచ్చి పెళ్లి జరిపిస్తారు; ఇటువంటి సావకాశాలన్నీ ఉన్న సంబంధాన్ని విశ్వనాథం కుదుర్చుకొనివస్తే, సుందర్రావు తానెవరో ఒక స్నేహితుని చెల్లెలిని ప్రేమించాననీ ఆమెను తప్ప ఎవ్వరినీ చేసుకోననీ, తన ప్రేమ విఫలమయితే తనకు చావుతప్ప గత్యంతరం లేదనీ గొడవపెట్టేడు. విశ్వనాథం స్పష్టంగా చెప్పేసేడు. "నీ యిష్టంవచ్చినట్టు అఘోరించు; ప్రేమించినవాడివి పెళ్లి చేసుకోడం మాత్రం తెలీదా? నన్ను మరి సలహాలూ అడగవద్దు; నా సహాయం గురించీ ఆశించవద్దు" అన్నాడు - నాటినుండి నేటి వరకు ఆ పట్టుదలలు అలాగే ఉన్నాయన్నమాట...

కొంచెంసేపు ఏ మాటలూ లేకుండా గడిచిపోయింది. పాపం అతని విషయంలో నేను చూపవలసినంత సానుభూతి చూపలేకపోతున్నానేమో అనిపించింది. కాని, ఏమిటో ప్రపంచం అంతా తనను ఇబ్బందులు పెట్టడానికే చూస్తున్నదన్న ధోరణి నచ్చకుండా ఉంది

పోనీ, అతనికీ నాకూ సంబంధించని ఏదో భోగట్టా అడుగుతే ఎలాగుంటుందో, అతనికి కొంచెం తృప్తిగా ఉండొచ్చునని. "గాడు సంవరం అప్పుడు మాతోపాటు మా యింటికి వస్తుఉండేవాడు హయగ్రీవ రావుగారని, అతను ఈ ఊళ్లోనే ఉంటున్నాడని ఎవరో అనగా విన్నాను; ఎక్కడున్నాడో, (నిజంగా నా కతనితో ఏమీ పనిఉన్నట్టు!) నీకుగాని తెలుసునా?"

"బాగుంది, తెలియకపోవడం ఏమిటి? ఆయన మా పొరుగునేకదూ ఉండటం. పోనీ, ఆయన్ని చూడ్డంకోసమయినా మీరు మా యింటికి రావాలి"

"ఎందుకు రానోయి? ఇప్పుడేదో పని తొందరఉండిగాని, లేకపోతే నువ్విన్ని మార్లు చెప్పాలా? సరేగాని, హయగ్రీవ రావు మాకంటె ఒక దశ పెద్దవాడే; ఇప్పుడెలాగున్నాడు? ఏమిటి సంగతి?"

"ఆయన కేమిటండీ, మహారాజులాగున్నాడు."

"ఏమిటలా అన్నావు? ఇప్పుడు మహారాజుల పని ఏమీ బాగా ఉండడం లేదని అనుకొంటున్నారే అందరూ, నువ్వుగాని వ్యతిరేకార్థంగా అనలేదుకదా?"

"అలాంటి అభిప్రాయమేమీ లేదండీ, నిజంగా ఈ ప్రపంచంలో ఎవడయినా నిశ్చింతగా, హాయిగా జీవితం వెళ్ళబుచ్చుతున్నవాడున్నాడంటే అతనే నంటాను. ఇంట్లో ఏ బాదరబందీ, జంఝాటమూ లేదు. హోటలునుండి భోజనం వస్తుంది; ఉన్న రెండిళ్ళలో చిన్నదాంట్లో తనుంటున్నాడు; రెండవది ఒక కంపెనీకి అద్దెకిచ్చాడు. వాళ్లు ఒకటవ తేదీ సాయంకాలానికల్లా, పువ్వుల్లో పెట్టి అద్దె పంపిస్తారు; ఇంకా, ఈ ఇనాందారీ బిల్లు పాసవడక ముందే ఆ భూమికూడా మంచి క్రయానికే అమ్మేసి బేంకులో ఫిక్సడు డిపాజిట్ వేశాడు. దాని మీద బోలెడువడ్డీ వస్తుంది".

"అయితే బాగానేఉందన్నమాట వాడి పని. ఆమధ్యను ఆరేడేళ్ల క్రితం వాడిభార్య పోయింది. తరవాత తన సంరక్షణకి ఎవర్ని పెట్టుకోకుండా హోటలు మెతుకులు తింటున్నాడన్నమాట, పాపం."

"పాపం ఏమిటండీ, ఆయన తన జీవితంలో ఏనాడయినా నిజమయిన శాంతి సౌఖ్యమూ అనుభవిస్తున్నాడంటే, అది ఈ సమయంలోనే అతనికి తగినవాడే ఎవ్వరూనా అనేవారు లేనిలాఖరు ఒకడుదొరికేడు, రామస్వామి అని - పెద్దమీసాలు వాడున్నూ నిజంగా వాడుచేసినసేవ ఏభార్య చెయ్యగలదండి?"

"పోనీ అదయినా కొంత నయం. అప్పుడే వాడు పెద్ద దృఢమయినమనిషి కాడు; ఇప్పుడు ఆరోగ్యం బాగుందా?"

"బాగుందా అని అడుగుతారు ఉక్కు పిడుగులాగు మనిషంటే ...అసలు నేననేది కేవలం డబ్బుగురించికాదు, ఇప్పుడు మా నాన్న ఉన్నాడు, మరొకరున్నారు, మరొక

★ పార్కు బెంచీసాక్షి ★

చున్నారు - ఇతనికంటె బాగా ఎన్నో ఇంతలు డబ్బున్నవాళ్లు - కాని, వాళ్లంతా యీయన పొందగలిగినంతహాయిని పొందుతున్నారా అని - అంతహాయిగా, స్వేచ్ఛగా, ఎటువంటిగల్లంతూలేని గడియారంలా సాగిపోయే నిత్యకృత్యం ఎందరికి సాధ్యమవుతుంది? ఆయననుచూసి ఎవరయినా అసూయపడవచ్చును."

నాకు మళ్లీ ప్రసంగంమార్చాలనిపించింది. సినీమాలగురించి మొదలుపెట్టేటూ వాటిమీదకూడా ఏదో ఫిర్యాదు ఉన్నదన్నట్టు



గానే మాట్లాడసాగాడు సినీమాలు విజ్ఞానప్రదంగా లేకపోవడం, కేవలం డబ్బుచేసుకోడమే పరమార్థంగా తయారవడం, చవకబారు హాస్యము సెక్సు ఆకర్షణలూ కలిగి ఉండడమూ, మేకప్పులనేవి మేను కప్పకపోయేందుకే వినియోగించబడడమూ, .. ఇవన్నీ మామూలుగా అందరూ సినీమాల మీద చేసే ఆరోపణలే కాని, అతని ముఖతః వచ్చేసరికి మాత్రం ఏదో అతనికి అన్యాయం జరిగిపోయిందని ఫిర్యాదు చేస్తున్న ధోరణి కనిపించింది...

తరవాత నేను కావాలనే రాజకీయాల గురించి కూడా కదిపిచూసేను. వాటిల్లోనూ ఇంతే. అతనికి వేటిలోనూ సామాన్య మానవుడికి తెలియవలసినపాటి తెలియక కాదు, బాగానే తెలుసును, కాని మొత్తంమీద అతని స్థాయీభావము - కొన్ని చాలా దురన్యాయంగా ఉన్నాయి, మరికొన్ని చాలా అసూయ కలిగించేవిగా ఉన్నాయి, సరిఅయిన అవకాశాలే గాని ఉంటేనా? (ఆ ఉంటేనా అన్నది తనకూ తనవంటి మరికొందరికీ వర్తిస్తుందన్నమాట—)

అలా మాట్లాడుతూ మాట్లాడుతూ తక్కున ఏదో అంతసేపూ మరిచిపోయి జ్ఞాపకం వచ్చినవాడిలాగ "మరి నేను వెళ్లాలండీ, నమస్కారమూ సెలవు, ఈమారు మీరు వచ్చినప్పుడు తిన్నగా మాయింటికే వచ్చెయ్యాలి"అన్నాడు. నేనూతప్పకుండా అలాగే వస్తానన్నాను—గాని, అతని ఇల్లు ఎక్కడ ఏ వీధిలోనో అతను చెప్పలేదు; నేను అడగలేదు. నాకు నిజంగా అతని ఇంటికి వెళ్ళకపోవాలని ఏమీ లేదు, గాని, వెళ్ళవలసిన అవసరం కనబడలేదంతే - ఈమారుగాని రావడం తటస్థిస్తే, అతని ఇల్లు వెతుక్కుంటూ వెళ్లి, "నాసేవా అ వేళ అంతసేపు మాట్లాడికూడా ఇంటిని గురించి నేను అడగలేదు, నువ్వు చెప్పనూ లేదు" అందామనిపించింది. అంతే కాదు, అప్పుడే ఒక కథ చదవడంవల్లనూ, అలవాటయిన పరిసరాలను దాటి కొత్తచోట, ఎప్పుడో తెలిసిన మనిషిని అనుకోకుండా కలియడమూ నాలోని రచయితృలకు దాన్ని మేల్కొలిపి ఉంటుంది.. ఇతని ధోరణి ఎక్కడో కలిసిన నాతోనే ఇలాగుందికదా, ఇంట్లో ఎలాగుంటుందో, ఆ అమ్మాయి ఈతనితో ఎలా వేగుతూందో, అతనిమాటల ధోరణినిబట్టి చూస్తే ఇంటి వాతావరణంలో సంతోషంకంటె విసుగుదల, సౌఖ్యంకంటె బాధపడిపోతున్నాననే భావమూ ఎక్కువగా ఉన్నట్టుంది. ఉండవచ్చును, నిజమే తక్కువ రాబడి, అయిదుగురు పిల్లలు, అందులో వాళ్లు సహజంగా అనారోగ్యవంతులయితే మరి చేసేదేముంది. ఏమయినా అతని పరిస్థితిని కొంత తెలుసుకోవాలి. నిజంగా డబ్బు లేక ఇబ్బంది పడుతూంటే, వాళ్ల తండ్రికి కాస్త గట్టిగా రాసి చూడాలి. వాడూ తన కుందేలికి ఒక కాలు కోసేసి సిద్ధంగా ఉంటాడు......

పగటి వెలుగు బాగా తగ్గిపోయింది. పార్కులోని ఎలక్ట్రిక్ దీపాల వెలుగువల్ల ఉన్న కొంచము తెలియడంలేదు నేనున్న బెంచీకి సమీపంలో దీపం లేకపోవడంవల్ల మరి చదివే ప్రయత్నం లాభంలేదు. కాదంటే, అక్కడి కెక్కడికో పోయి, బెంచీలన్నీ నిండిపోయేయి, గడ్డిమీద కూర్చొని చదవాలి. అంటె ఈ బెంచీ విడిచిపెట్టాలి. ఎంతమాత్రం మనస్కరించలేదు - ఆ కొద్దిసేపటిలోనే దానిమీద ఏదో మమకారం పొడమింది కాళ్లు మరి కాస్త జాపుకొని చేరగిలబడి కూర్చొని, పెద్ద ధ్వనితో వస్తున్న వాద్య సంగీతాన్ని ఆస్వాదిద్దాము శ్రద్ధగా అనుకుంటూ ఉండగా, నా బెంచీలోని అర్ధసింహాసనాన్ని దురన్యాయంగా ఆక్రమించుకొందామన్న దురుద్దేశంతో తొందరగా నడుచుకొంటూ రాసాగాడు ఒక వెయిస్టుకోటు, చేతికర్ర, చెవులకి మఫ్లరు జెంటిల్మను.

నా సింహాసనంలోని సగభాగాన్ని అతనింకా కొంచెం దూరంలో ఉండగానే అతను అడక్కుండానే నిర్మోహంగా ధారాదత్తంచేసి, పక్కకి మొగం తిప్పుకొని కూర్చుంటూ, కుతూహలం ఉండబట్టక సమీపించే ఆకార విశేషాన్ని మరోకమారు పరిశీలనగా చూసేను - ఈమారు పోల్చుకోక పోలేదుగాని, చాలా కష్టమే అయింది, అయినా ఈ మారు తప్పుచేయనందుకు నన్ను నేను అభినందించుకోకపోలేదు - మరెవరూ కాడితను, ఇంతసేపూ మేము ఎవరిగురించి అయితే మాట్లాడేమో ఆ హయగ్రీవరావ్ ఇతను - వేషంలో వెనుకటి పద్ధతి ఏమీ లేదు. అంతేకాదు, సుందర్రావు చెప్పిన మాటలమూలంగా నాలో భావన వలన ఉద్భవించిన ఆకృతికీ దీనికీ ఏమీ పోలిక లేదు. చూడటానికి అంత బలహీనంగా ఉన్నట్టులేదు గాని, బలంగా మాత్రంలేదు; ఇతనిని సుందర్రావు ఉక్కు పిడుగులా గున్నాడన్నాడు; పాపం అతనికలా అనిపించి ఉంటుంది. ముప్ఫైఏళ్లకే ముసలివాడులాగా అయిపోయాడు మరి—

హయగ్రీవరావుగారు చిత్రమయిన మనిషి - అతన్ని ఏదైనా ప్రశ్న అడిగేమంటే వెంటనే సమాధానం చెప్పడు. అతని ధోరణిచూస్తే మన ప్రశ్న వినిపించిందా లేదా అని అనిపిస్తుంది. కాని, కొంచెం సేపు ఊరుకొని, "...కాదూ అడిగేరు?"

అంటూ తన సమాధానం మొదలుపెడతాడు, ఏమైనా ఎక్కువగా మాట్లాడే రకం కాదు-ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టే ఉంటాడు. లోగడ ఒకప్పుడు అనుమానం వచ్చి అడిగాను కూడా - ఆయన అన్నే, ఏమీ ఆలోచించడం లేదండి! అవతలివాళ్లు ఏదైనా మాట్లాడుతూ ఉంటే గొడవపెట్టకుండా శ్రద్ధగా వినడం నా మతం - ఆ శ్రద్ధగా వినడమన్నదానికి అర్థం బహుశః అవతలి వారిమాట అయిపోయిన రెండు నిమిషాల వరకు విన్నాడో లేదో తెలియబడకుండా కూర్చోవడం కాబోలు!

ఈ అవలక్షణానికితోడు ఇటీవల కొంచెం చెముడుకూడా వచ్చినట్టుంది - బిగ్గరగా మాట్లాడాలి, అదీ పబ్లికుపార్కులో కొంచెం మొగమాటంగా నేఉంటుంది, కాని తప్పదు-బిగ్గరగా మాట్లాడ్డమే సరికి అనుకోకుండానే చేతులుకూడా కదలడం మొదలుపెడతాయి.

"అయితే మీ ఆరోగ్యం బాగానే ఉంది కదూ" - అతను అలవాటుప్రకారం కొంచెం సేపు ఊరుకొని, "నా ఆరోగ్యంమాటకదూ అడిగేరు; అంతా పొట్లపండులాగుంది. ఏ క్షణానయినా పగిలిపోవచ్చు - అయితే నేనూ సిద్ధంగానేఉన్నానులెండి. అన్ని ఏర్పాట్లూ చేసేసిఉంచేను. అసలు నిజం చెప్పాలంటే ఆ గొల్లవాడెవడో అన్నాడు, ఆ ఊరేదో వేగంతీస్తే పోయి నామందని చూసుకోవాలని. అలాఉంది. ఎంతకాలమని ఈ ఎదురుచూడ్డం. ఇదేదో వేగం తెమిలిపోతే మంచిది."

నాకు చాలా కష్టమనిపించింది. "మీరు చాలా దృఢంగాఉన్నారని ఎవరో అన్నారండీ ఈమధ్యనే" - అతనిపొరుగునే ఉన్న యువకుడే ఆమాటన్నాడనడానికి మనస్కరించలేదు.

"నేను చాలాదృఢంగా ఉన్నానని అన్నారా? చూస్తున్నారు, మీకు కనబడలేదా? బైటికి ఒకమాదిరిగా బాగానే ఉన్నట్టుంటుంది. అదీ ఎంతటి ఆహారవిహార నియమాలఫలితంగా! అసలు రక్తపుపోటుంది. ఎంతో కాలంలేదని తెలుసును. కాని, అంతవరకుఈ నిరీక్షణమనేది చాలా చికాగ్గా ఉంది"

"మీరలా ఎందుకనుకోవాలి? ఇప్పుడు ఆర్థికమయిన ఇబ్బందులేవీ లేవు—ఏదో మంచాన పారవేసే దీర్ఘవ్యాధితో తీసుకోనేకంటె గుండెకి సంబంధించిన జబ్బు చాలా మంచిది; త్వరలో తీసుకొనిపోతుంది. మీ యీ జీవితాన్ని దేనికోసమో ఎదురుచూడడం అనేకంటె, ప్రశాంత గంభీరమయిన నదీగమనంలాగుందనుకోకూడదా?"

"మీకింకా చిన్నతనపు కవిత్వవాసన పోయినట్టు లేదు నా డబ్బు అందరికీ కావాలి గాని, నేనుమాత్రం ఎవ్వరికీ అక్కరలేదు; నా ప్రేమ కంటకప్రాయంగా ఉంటుంది."

"ఇదంతా మీ భ్రాంతిమాత్రమే నేమో?"

..."ఏమిటన్నారు, భ్రాంతా? కావచ్చును; పదిమార్లు ప్రయత్నించి చూసినా ఒకేరకపు ఫలితం వచ్చిందంటే, అది భ్రాంతి అయినా దానిని తొలగించుకొనే శక్తి మనకుండదు, అధమం నాకు లేదు—పోనీ, వర్తమానాన్ని విస్మరించి, గతకాలపు జ్ఞాపకాలతో సంతోషిద్దామన్నా అవి అన్నీ మోసం, క్రౌర్యం, కౌటిల్యంతో నిండినవే—అందికే నాదగ్గర చేరదలచిన బంధువులందరితోను స్పష్టంగా చెప్పివేశాను—"నేను బ్రతికి ఉండగా మీలో ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బందులలో ఉన్నా సరే, ఒక్క కాణీ అయినా ఇవ్వను—అందుచేత మీలో మీరు ఏమీ పోటీలు పడనక్కరలేదు - నా అనంతరం నాకున్న కొంచెం ఎవరెవరికి ఎంత చెందవలసిఉంటే అంత చెందుతుంది"

"మంచిపని చేసేరు - పీడ వదిలింది."

..."బాగానేఉంది, అంతమాత్రంలో వదిలిపోతుందా అందరూ అనుక్షణమూ నేను ఎంత వేగం చచ్చిపోతానా అని ఎదురుచూసేవాళ్ళే-వాళ్ళ ఖర్మం, వాళ్లలా ఏడిసినా బాధలేదు, గాని ఈలోగా నా యింటికయితే రావడానికి సాహసం లేదు గాని, ఏవేవో ఉత్తరాలు - మేమింతటి విపత్తులలో ఉన్నామంటే మేమంతటి కష్టాల ననుభవిస్తూ మహత్కార్యాలు సాధిస్తున్నామని. ఇదంతా నా దృష్టిని తమపట్ల సుముఖం చేసుకొనే ప్రయత్నమని - నిజానికి, నాకు వస్తున్న ఒక్కొక్క ఉత్తరంతో వాళ్ళకు ఉండే అవకాశం కొంత జారిపోతున్నట్లు గ్రహించుకోరు - కొసకి, నాకు అనిపిస్తున్నదేమిటంటే, నేనెలాగూ వీళ్లను తృప్తిపరచలేను, ఉన్నదయినా చాలా కొంచెము. వీళ్ళలో వీళ్లకు ద్వేషాలు పెంచేకంటే, అంతా మొత్తంగా ఏదో ఒక ధర్మకార్యానికి వినియోగించాలని కాని, వీళ్లకి అది ఎంతో ఆశాభంగంగా ఉంటుంది. అందులోను నేను మరీ ఎక్కువ కాలం బతుకుతున్నకొద్దీ వాళ్ల ఆశలు మరీ నిడుపు సాగుతాయి. ఇక చెల్లెలు తన కొడుకు కాలేజీ చదువువేళకయినా, నా మూలంగా వచ్చే డబ్బు రాదా అని చూస్తుంది, మరొకతె, కూతురు పెళ్లి కట్నానికి నామీద ఆశపెట్టుకొని కూర్చుంది. ఇంకా ఉన్నారు, చాలామంది ఇటువంటి ఆశలు పెట్టుకొని, ఎదురుచూస్తున్నవాళ్లు - వాళ్లందరనూ ఎక్కువకాలం బాధపెట్టడం ఎందుకని నేనూ చూస్తున్నాను."

నేను మాటవరసకి "నిజమే" అన్నా, నాకనిపించింది. ఇదంతా ఎందువల్ల? మామూలుగా అందరిలాగ ప్రపంచంతో కలిసి మెలిసి ఉండడకపోవడంవల్లనే కదా - ఎవరో ఒకరిని తన సంరక్షణకు తెచ్చుకొని ఉంటే...ఎవడో ఒక మేనల్లుడినో, మరదలు కొడుకునో తనవాడు అనిపించుకొంటే ...ఏం మునిగిపోయింది? మొదట్లో కొంచెం ఏడిచినా తక్కిన బంధువులు కాలక్రమాన వాళ్లే ఊరుకొంటారు. తన బ్రతుక్కి ఒక ఆదర్శం, తనవద్ద ఆధారపడినవాళ్ల బాగోగుల్లో కొంత జీవచైతన్యం ఉండిఉండును-కాని, ఈ మాటలు అతనితో చెప్పి, వాదించి ఫలితం ఉండదన్న సంగతి నాకు బాగా తెలుసును. కాక, మళ్ళీ, ఈతనిని ఎంత కాలానికి ఎక్కడ కలుసుకొంటానో, అసలు కలుసుకోడమే పడదేమో, అటువంటిది ఈ కొద్దిసేపటికి వాదన ఎందుకని ఊరుకొన్నాను. అతనూ ఊరుకొన్నాడు. ఏమీ ప్రసంగం లేకపోడం ఏదో వెలితిగా తోచింది. ఇంతకాలానికి వెనుకటి రోజుల మిత్రుడు కనిపిస్తే మాట్లాడుకొందికి విషయాలే లేకపోయినందుకు సిగ్గేసింది. కాని స్వంతవిషయాలు మాట్లాడుకోడం బాగున్నట్టులేదు. ఇందాకా చేసిన పనే ఇప్పుడూ చేసేను.

★ హాయ్- బెంపినాక్రై ★

"సరేగాని చూడండి, మనవాడు విశ్వనాథం మీకు జ్ఞాపకం ఉందికదూ, తరుచు మనం వాడింటి దగ్గర కలుస్తూఉండడం, వాళ్ల పెద్దబ్బాయి - మీకు తెలుసును కదూ, సుందర్రావనీ, తండ్రితో పోట్లాడి ప్రేమవివాహం చేసుకున్నాడు, అతను ఈ ఊళ్లోనే ఉంటున్నాడట ఎక్కడఉంటున్నాడో ఏమిటో మీకుగాని ఏమయినా తెలుసునా? పాపం, చాలా డబ్బుకి ఇబ్బంది పడుతున్నాడట అంతేకాదు..."

ఈమారుమాత్రం హయగ్రీవరావు గారు మాట కాస్త తొందరగా అందుకొన్నారు. బహుశః నేను మొట్టమొదట చెప్పినమాటలే ఆలోచనని కదిలించి ఉంటాయి.


"అతను ఈఊళ్లోనే ఉన్నాడు. నాకు తెలియకేం, మాపొరుగునే ఉంటున్నాడు. కాని, అతను ఇబ్బందుల్లోఉన్నాడని మీకు ఎవరుచెప్పారో? అతనికేం, హాయిగా మహారాజులా ఉన్నాడు -"

"అలాఅంటారా? ఏమోపాపం తండ్రితో పోట్లాడి వేరేపోయాడు. కాలేజీ చదువు పూర్తికాకుండా ఉద్యోగంలో కుదురుకున్నాడు. పైగా అయిదుగురుపిల్లలట."

"అయితే ఇవన్నీ మీకు పెద్దకష్టాలుగా కనిపిస్తున్నాయన్నమాట అతను కాస్త ఎప్పుడయినా విసుగుదలా కోపమూ ఉంటే ఉన్నాయిగాని, ఆ అమ్మాయి నిజంగా శాంత అన్న పేరుకి తగిఉంటుంది. అతనే నిజంగా సుఖపడకపోతే, మరెవ్వరు సుఖపడుతున్నారో నాకర్థం కాదు. ఏదో స్థిరమయిన ఉద్యోగం ఉంది; అనుకూల దాంపత్యం—పిల్లలు కూడా చాలా తెలివయినవాళ్లు; ఎంతో అందంగా ఉంటారు"

"ఎంత అందంగా ఉంటేనేం బలహీనంగా అనారోగ్యంగా ఉన్న తరువాత—పాపం, అసలే తక్కువ జీతం, అందులో మందుమాకుల ఖర్చు లొకటి వచ్చిపడ్డాయంటే మరింక చెప్పేదేముంది."

"ఏమిటో మీకంతా తెలిసినట్లు మాట్లాడుతున్నారే. అతను అతి జాగ్రత్తకొద్దీ కొంచెం జలుబు చేసేసరికల్లా గాభరా పడిపోతాడు గాని, పిల్లలకేమండీ, బంగారంలా ఉంటారు. నాకు తెలియకపోతే మరీ చెప్పండురు—అసలు ఇంతసేపూ మరిచేపోయాను మా యింటికి రమ్మనడం. మా యింట్లో ఎవ్వరూ లేరు గనక మీరు మరేం మొగమాట పడక్కరలేదు."



ఆంధ్రశిల్పము (సింహాచలం)

—ఫొటో: ఎస్. సి. జోగారావు, కాకినాడ.

[illegible]



ఆంధ్రశిల్పం—(సర్పవరం)

ఫోటో: ఎస్. కె. జోగారావు, కాకినాడ.

పార్కుబెంచీ సాక్షి

సహజీవనాన్ని చూడడానికయినా మీరు మా యింటికి రావాలి."


"మీ యింటికి నేను రావడానికి, మిమ్మల్ని చూడడమనే ఒక్క కారణం చాలదా? ఏమిటి అప్పుడే లేచిపోతున్నారు?"

"మరేం చెయ్యను? మీరంతా అప్పుడే వేసంకాలం వచ్చిందని పల్చటిచొక్కాలు తొడుక్కొని తిరుగుతున్నారా? నాకింకా ఈ వెయిస్టుకోటు, మఫ్లరు ఇవి ఉంటేనే గాని గడవదు. మంచు ఏమాత్రం పడదు. అలాగని సాయంకాలం నడక మానుకోడం ఇష్టపడను. రోజంతటికీ నేను కాస్త నడిచేది కూడా ఇంతే. రోజూ సామాన్యంగా ఇలా నడిచివచ్చి, నడిచిన అలసట తీరేవరకూ ఒక్క అయిదు నిమిషాలు మాత్రం ఈ బెంచీమీద కూర్చొని ఇంటికి వెళ్తాను. వెళ్ళినవెంటనే భోంచేస్తాను. పేపరు చదువుతూ పడుకొంటాను; తొమ్మిదిగంటలకి పడుకొని ఉదయం నాలుగుగంటలకల్లా లేస్తాను. నిద్రవేళగాని, భోజనంవేళ గాని ఒక్క పిసరూ అటూ ఇటూ అయిందా, మర్నాడల్లా బాధగానే ఉంటుంది—అతికష్టంమీద అణచి ఉంచిన అవలక్షణాలన్నీ బైటికి ఉబుకుతాయి—తరవాత మందులతోనూ డాక్టర్లతోనూ తంటాలుపడేకంటె ముందునుంచే జాగ్రత్తగా ఉండడం మంచిదని. మరి శెలవు వస్తాను. ఈమారెప్పుడు వచ్చినా తిన్నగా మా యింటికే వచ్చేస్తే మనకు కాస్త తీరికగా నాలుగు సంగతులూ మాట్లాడుకోందికి వీలుంటుంది."

తరవాత సుమారు ఒక గంటసేపు అలాగే కూర్చున్నాను. నాకు ఆ బెంచీలో ఏదో ప్రత్యేకత ఉందనిపించింది. నాతోపాటు తానుకూడా ఈ ఒక్క గంటలోనూ చిత్రమయిన కొన్ని అంశాలు వింది. ఒకమనిషి తననుగురించి తాననుకొనేదానికీ, ఇతరులనుకొనేదానికీ ఎంత భేదం ఉండడానికి వీలుందో అనుకొన్నాను. అంతే కాదు, ఒక స్థితినిగూర్చి, ఒక వ్యక్తినిగూర్చి, సుఖదుఃఖాలనుగూర్చి మనం చేసే నిర్ణయాలకు వెనుక మన మనస్థితి నడిపే భాగవతం చాలా ఉంటుంది. సుందర్రావు దృష్టిలో హయగ్రీవరావుకంటె సౌఖ్యవంతుడు లేడు; హయగ్రీవరావు దృష్టిలో సుందర్రావుకంటె సుఖపడే యోగ్యత గలవాడు లేడు - అంతే కాదు, సుందర్రావు అలా ఉండడమే అతని సుఖానికి కారణమని, నిజంగా మరి కాస్త డబ్బు నేదే ఉంటే, అతని ప్రస్తుతపు జీవితంలోని హాయి అంతరించి పోతుందేమో నన్నట్టు కూడా ధ్వనించింది హయగ్రీవరావు మాటల్లో.

ఆయీ సంగతులన్నీ నాతోపాటు పార్కు బెంచీ కూడా ఆకర్షించకపోలేదు - అయితే నాలో పూర్వాశ్రమానికి సంబంధించిన చాపల్యము అంతరించక ఇది ఇలా నడివీధిని పెడుతున్నాను. అయితే లోపల్లోపల ఉద్దేశము, ఈ కొద్దిసేపటిలో నేను వారిద్దరినీ కలుసుకొని, పరస్పర విరుద్ధములయిన మాటలను విన్నట్టుగానే, ఇది వారిద్దరూ చదవకూడదా అనే ఆశ మెదలకపోలేదు చదివి పరస్పరం సహకరించుకొని సుఖపడనీ మాననీ, అది నా పని కాదు, ఇద్దరూ అంతదగ్గరలో ఉండి కూడా పరస్పరం ఎంతటి విరుద్ధాభిప్రాయాలతో ఉన్నారో అన్నది ఎవ్వరికీ నొప్పి కలగకుండా తెలియజెయ్యడం అన్నది జరిగితే నా ఉద్దేశం చాలావరకు నెరవేరినట్లే.

★



అది మధ్యాంతరహితమై యలరుచుండు
కాల యవనిక భేదింపఁ గలడె మనుజు!

ఇటకు నెందుండి వచ్చి నిం కెటకుఁ బోవు
ప్రాణి యను ప్రశ్న కెవ్వఁడు బదులు సెప్పు!

ఫోటో :— కె. ఆర్. శాఠి. (పానశాల)



20

తుంపర రాలుతోంది. మబ్బుల చాటునించీ అతి మందంగా చంద్రుడు పశ్చిమాన కనిపిస్తున్నాడు. విజయవాడ స్టేషన్‌దగ్గిర కొంతవేపు గుంపులుగుంపులుగా తిరుగుతున్నారు జనం, చల్లగాలిలో ముసుగులు కప్పుకొని. నిజంగా ఆ రాత్రి కొంచెం భయం కొల్పేటట్లున్నది.

వరదరాజు, బ్రాకెట్ కంపెనీముందు బెంచీమీద తెలియకుండా జాగ్రత్తగా చూరుకింద ఒదిగి కూచుని ఆలోచిస్తూ అటు నించి పొయ్యే ప్రతి గుర్రబ్బండినీ, సైకిల్ రిక్షానీ పరీక్షగా చూస్తున్నాడు. ఆ శాస్త్రి ఇవ్వాళా వొస్తాడు. ఒకవేళ......వాళ్లను కున్నట్టు, ఇవ్వాళే రత్తమ్మకి...

వరదరాజు నవనాడుల్లోనూ ప్రవహిస్తున్న వేడి నెత్తురు మరింత వేగెక్కింది. అతని మనసులోని చీకటి కోణాలుగూడా, ఏదో జలసీలాంటి భావంతో వెలిగించినట్టయినాయి అతనుజేబులోనుంచి టోపీ తీసి బ్రాకెట్ అంకె కట్టి మెల్లిగా లేచి నిలబడ్డాడు. రుమాలు తీసి గలిపె తలమీద వేసుకుని పక్కనేవున్న టీస్టాల్‌కి వెళ్ళాడు. గాలి జోరుగా చల్లగా తుపరతో కలిసి వీస్తోంది. వేడి టీ వాసనలు సిగరెట్ పొగ ఘుమఘుమలు మగత కొల్పుతున్నాయి. వానకి జడిసిన జనం టీకొట్లో చేరి గోలగా మాట్లాడుకుంటున్నారు. వరదరాజు స్టాల్ మెట్లమీదే నుంచుని, టీ తెప్పించుకున్నాడు. అతనికి ఏ బండిమీద మృత్యుంజయశాస్త్రిగారు వెళ్తాడో అని ఆదుర్దాగా వుంది.

దారుణమైన నానాకాలపు మబ్బుల చీకట్లలో వీధి దీపాల ప్రకాశం కాని, కొట్లలో వెలుతురు కాని—బెజవాడని స్పష్టం చెయ్యలేకపోతున్నాయి. వీధుల్లో తిరిగేత్తే బండ్లూ నడిచే మనుషులూ నిశ్శబ్దంగా కదులుతున్నారు.

స్టేషన్‌లోకి మెయిల్ ప్రవేశించింది. పెద్దగా కూత వినిపించింది.

వరదరాజు వత్తిడిగా వస్తూన్న జనాన్ని పరీక్షగా చూస్తున్నాడు. ఎనిమిదిన్నర గంటలయింది. అయినా చీకట్లూ, చలీ, అతివేగంగా వీచె హోరుగాలీ—ఆ రాత్రి భయం గొల్పుతోంది. వరదరాజు వేడి వేడి టీ సాసరులో పోసుకుని చప్పరించి తాగుతూ స్టేషన్ వేపునించి వొచ్చే బండ్లవేపు చూస్తున్నాడు.

అతని నిశితమైన దృష్టిలో మొట్టమొదట ఏడుకొండలు కన్పించాడు. వరదరాజుకి ఆశ్చర్యం వేసింది. 'ఈవరప్పుడు .. ...వీడు రావటమేంటి' అనుకుంటూ తుపరలోనే గాలికి ఎదురునడుస్తూ, టీస్టాలుకి ఐదుగజాలలోనే ఏడుకొండల్ని కలుసుకున్నాడు.

ఏడుకొండలు, ఆదుర్దాగా కన్పిస్తున్నాడు; తడిసి ముద్దైవున్నాడు. మాటలు తడబడుతున్నాయి చలికో, ఆదుర్దావల్లనో తెలియదు.

"ఏందిరా! అట్టా వొణుకుతున్నావేంటి! చెప్పరా!. " అంటూ వరదరాజు, ఏడుకొండలు భుజంమీద చెయ్యేశాడు.

ఏడుకొండలు వరదరాజును బ్రాకెట్ కంపెనీ వనక కటిక చీకట్లో సన్నటి సిమెంట్ అరుగుదగ్గిరకి తీసుకెళ్ళాడు. అక్కడికి వెళ్ళాకగానీ అతనికి మాట సరిగ్గా రాలేదు. "వాళ్ళు వొచ్చారా! తయారు చేస్తారంట!" అన్నాడు గొంతు బాగా తగ్గించి

వరదరాజు, "ఎవరు?" అని అడిగాడు గబుక్కున గుర్తురాక.

"నిదంతా మాలోకం. కోటిగాడింటిదగ్గిర మొన్న మాట్లాడుకోలేదంట్రా!" అన్నాడు ఏడుకొండలు. వాన బ్రాకెట్ కంపెనీ రేకు కప్పుమీద పడుతున్న దడదడ మోత కర్ణకఠోరంగా వుంది

"ఓహో! అదా! సరే—సరే. ఇయ్యాల మంచిదేలే! రేత్రి పన్నెండింటికి వొస్తా అడికి. నువ్వుపోయి, ఆమాట సెప్పు!... నాకింకా కొంచెం పనివుందిలే" అన్నాడు వరదరాజు అర్థమైనట్టే.

ఏడుకొండలు, "తప్పకండా రావోయ్. మళ్ళీ సెయ్యిజారిపోద్ది!" అంటూ రోడ్డుమీదికి నడిచాడు. వరదరాజుగూడా నడిచాడు.

తొమ్మిది గంటలవుతోంది. చీకటి ఇంకా దట్టంగా అలుముకుంది. సందడి బాగా తగ్గింది. జనం చలికీ వానకీ భయపడి ఇళ్ళల్లోకి పెందరాళే చేరుకున్నారు. చీకట్లో స్టేషన్ పక్క కొంత మరింత చీకటిగా భావురుమంటూ కనిపిస్తోంది. రోడ్డుమీద అక్కడో రిక్షా ఇక్కడో రిక్షా దెయ్యాల్లా తిరుగుతున్నాయి

వరదరాజు బ్రాకెట్ కంపెనీ చూరుకింద నుల్చుని చార్మినార్ సిగరెట్టు వెలిగించి, స్టేషవైపు చూశాడు, మృత్యుంజయశాస్త్రిగారు మెట్లుదిగి, రిక్షా మాట్లాడుతూండడం అకస్మాత్తుగా వరదరాజు కంటబడింది అతను హుషారుగా నిలబడ్డాడు వొళ్ళు విరుచుకుంటూ ఇవ్వాళ శాస్త్రి రత్తమ్మ నేమైనా అంటే వుంది పూజ! అనుకుంటూ.

శాస్త్రిగారి కంటబడకండా ముందే తాను వసంతం ఇంటికెళ్ళి ఎక్కడైనా దాక్కోవాలనిపించిందతనికి రోడ్డుకవతలవేపు నిలబడివున్న సైకిల్‌రిక్షా వెంకణ్ణి ఈలవేసి పిల్చాడు వరదరాజు.

వెంకడు బండి తిప్పుకుని వరదరాజు దగ్గిరకివొచ్చాడు వరదరాజు బండిలో కూర్చుని, "పోనీ—మా యింటికి. చాలా అర్జంటు!"

అన్నాడు. బండి ఎదురుగాలిని కూడా లెక్క చెయ్యకండా రయ్యిమని పరిగెత్తసాగింది. వరదరాజు ముందున్న పరదాపట్టా కిందికి వల్లాడదిసి, వెనకనించి చూశాడు ఒకటి రెండు తడవలు. శాస్త్రిగారి రిక్షా బండీ వెనకాలే పదిగజాలలో వొస్తోంది.

వరదరాజు ఇంటికి ఫర్లాంగు దూరంలోనే దిగి, బండి పంపేసి, మెల్లిగా నడవసాగాడు. ఇంటికి ఎడం వేపున్న సందుగుండా చూరుకిందగా నడిచివెళ్ళి దొడ్లో కాకరపాదు అల్లుకున్న గజం ఎత్తు దడినీ జాగ్రత్తగా దాటి దొడ్లోకి దూకాడు. దొడ్డంతా చీకటిగా వాననీటికి బురదై అయోమయంగా వుంది. వరదరాజుకి పరిసరమంతా బాగా అలవాటై వుండడంవల్ల, కళ్లు పొడుచుకున్నా కనపడని ఆ చీకట్లో మెల్లిగా సూటిగా దొడ్డిగుమ్మంవేపుగా వెళ్లాడు.

ఒక్కసారిగా తళుక్కుమని తూర్పున మెరుపుతీగె మెరిసింది. దొడ్డంతా ఒక్క క్షణం కాంతితో నిండి కళ్లు జిగేలుమన్నయ్. నిరంతరాయంగా కురుస్తున్న వర్షపుధారల్లో వరదరాజు తడిసి ముద్దైపోయినాడు. జుట్టునుంచి నీళ్ళు మొహంమీదికి కారుతున్నాయి. అతను కట్టుకున్న పైజామా, లాల్చీ వొంటికి అతుక్కుపోయాయి.

వరదరాజు నిదానంగా దొడ్డివాకిలి పక్కగావున్న కిటికీగుండా లోపలికి చూశాడు. కిటికీ పైరెక్కలు మాత్రం ఓరగా తీసివున్నయ్. వసంతం రత్తమ్మని కూచోబెట్టి తల్లో పూలు పెట్టి అలంకరిస్తోంది. రత్తమ్మ అమాయకంగా నవ్వుతోంది.

వరదరాజు వర్షాన్ని, హోరుగాలినీ, ఎముకలు కొరుకుతున్న చలిని లెక్కచెయ్యటం లేదు. మృత్యుంజయశాస్త్రి ఇంట్లో ప్రవేశించే క్షణంకోసం ఎదురుచూస్తున్నాడు.

రత్తమ్మ, 'నేనీడనే పండుకుంటా' అంటోంది, అక్కతో.

“ఈడనే పండుకోవే తల్లీ! దొడ్డితలుపు జాగర్తగా గడియవేసి!” అంది వసంతం. లోపల వెలుగుతున్న బెడ్‌రూం లైటు పసుపుపచ్చని మగత వెలుగులో ఆమె మొహంమీద కనిపిస్తూన్న ఏదో అయిష్టభావం, ఆశాభావం వరదరాజుకి కనిపించాయి. వరదరాజు తల తడవకండా చూరుకింద నిలబడి చూస్తున్నాడు. గదిలో గోడమీద నీడలు భూతాల్లా కదుల్తున్నాయి. రత్తమ్మ దొడ్డితలుపు గడియవేస్తే తను లోపలికి పోవటం ఎల్లా? శాస్త్రి లోపలికి వొచ్చేస్తే ఇంకో గంటకిగాని శాస్త్రిని వసంతం ఈ గదిలోకి రానివ్వదు. తను ఎవరికీ తెలీకండా లోపలికి వెళ్లాలి.

వసంతం బైటికి వెళ్తూ, “దొడ్డితలుపు వెయ్యేవ్! జాగర్త. ఓరన్నా జొరబడతారు!” అంది. ఆమె బైటికి పోయినాక రత్తమ్మ కుక్కమంచంమీద దుప్పటి పరిచి, తలకింద దిండు అమర్చుకుని పడుకోబోతూ, దొడ్డితలుపు దగ్గరకి వొస్తోంది. వరదరాజు హుషార్‌గా నిల్చున్నాడు. రత్తమ్మ దొడ్డితలుపు తీసి, చూరుకిందగా దొడ్లోకి వెళ్లింది, ఏ అదృష్టంవల్లనో! వరదరాజు గబుక్కున వంటింట్లోకి జొరబడి, కుక్కమంచానికీ, గోడకీ మధ్యవున్న సందున పడుక్కున్నాడు చలనం లేకండా. దీపపు వెలుగు గదిలో వస్తువుల్ని స్పష్టంగా చూపించేటంతగా దీపించటం లేదు.

రత్తమ్మ పదు నిమిషాల్లో దొడ్లోనుంచి వొచ్చి మంచంమీద పడుకుంది గోడవేపు తిరిగి. వరదరాజు చాలా జాగ్రత్తగా మంచం కిందికి జరిగాడు. అతని కిది చాలా సరదాగా వుంది. ఏదో మరో కోర్కె ఒకటి అతని మనసులో పని చెయ్యకపోలేదు. వొంటికి అతుక్కున్న తడిబట్టలకి తగిలే వానగాలి, మంచంమీద పడుకుని చాలా శాంతంగా వూపిరి పీలుస్తూ వొదుల్తూన్న రత్తమ్మ శరీరపు స్పందనం, కన్యలదగ్గర మాత్రమే లభ్యమయ్యే—ఒక రకం కొత్తదనాన్ని సూచించే శరీరపు పరిమళం, వరదరాజుకి నెత్తురు ఉడుకెత్తిస్తున్నాయి. అయినా ఇంకోరకం అనుభూతి ఈ ప్రవృత్తిని అణిచేస్తోంది. తనూ శాస్త్రిలాగా ప్రవర్తించే కాడికి ఇంత ప్రయత్నం చెయ్యడమెందుకు?...

రత్తమ్మ మనస్సు ఇంకా నిర్మలంగా వుండటంవల్ల కాబోలు పదినిమిషాల్లోనే గాఢ సుషుప్తిలో పడిపోయింది. వరదరాజు కొంచెం సర్దుకుని పడుకున్నాడు. బయట వాన ఇంకా జోరయింది. మెరుపులు మెరుస్తూండడం, సగం తీసివున్న కిటికీగుండా కనిపిస్తోంది; లోపలగోడకి వున్న బెడ్‌రూం లైటు, కిటికీగుండా విసురుగా వీచేగాలి తాకిడికి అల్లల్లాడుతోంది. ఉరుములు దూరంగా ధ్వనిస్తున్నాయి.

వరదరాజుకి విసుగేస్తోంది ..

వంటఇంటికీ నడిమిఇంటికీ మధ్యనున్న తలుపు కిర్రుశబ్దంతో తెరుచుకుంది. వరదరాజు కాళ్ళు ముడుచుకుని జాగ్రత్తగా పడుకుని కుక్కమంచం నులక సందుల్లోంచి ఆ తలుపువేపు చూస్తున్నాడు.

వసంతం మృత్యుంజయ శాస్త్రీ—ఇద్దరూ చల్లగా ఆ తలుపు తెరిచి నిలబడ్డారు. శాస్త్రి మొహం పరిపూర్ణంగా ఆనందంతో వికసించివుంది. వసంతం ఆయన వెనకాలే నిలబడివుంది. ఏనాడూ లేని వొక భయోత్పాతం ఆమె మొహంలో కనపడుతోంది. శాస్త్రి పూర్తిగా కాకపోయినా కొంత స్మృతి—మగతల సరిహద్దు—ఆ స్థితివరకూ తాగివున్నాడు. ఆయన కనుకొలకులు ఎర్రబడివున్నాయి. మొహంలో అసహజమైన ఉద్రిక్తత, ఒక దృఢ నిశ్చయం తాండవిస్తున్నాయి. వసంతంకూడా తాగిందనిపిస్తోంది. ఎంతకీ ఒప్పుకోని అంతరాత్మని బ్రాందీ మైకంలో నోరుమూసి ఈపని కొడికట్టినట్టు కనిపిస్తోందామె. కొన్నిగంటల వ్యవధిలో కొన్నేళ్ళు వయస్సు పెరిగినట్టుంది ఆమె ముఖం.

చీకటీ వెలుగూ కాని, ఆ వంటింటి పొగచూరిన దారుణ వాతావరణాన్ని కిటికీ చువ్వలగుండా మధ్యమధ్య మెరుస్తూన్న విద్యుల్లతల వెలుగులు భయానకంగా మారుస్తున్నాయి.

వీటి నేమీ ఎరగని రత్తమ్మ అతి శాంతంగా గాఢంగా పసిపిల్లలా నిద్రపోతోంది.

వసంతం, మెల్లిగా, శాస్త్రి చెయ్యిపట్టుకుని ఏమిటో గొణిగింది. శాస్త్రి నిలబడ్డ పాళంగానే మెడ వెనక్కి వంచి, “నువ్వు వెళ్లు ఇక నేను చూసుకుంటాను” అన్నాడు చిరునవ్వు నవ్వుతూ. తవలపాకులతో గారపట్టిన పళ్లు నల్లగా అగుపిస్తున్నాయి.

వసంతం, “దాని చేతుల్లో ఓ కాయితం పెట్టండి...” అంది, ఆమెకి లోలోపల ఇంకా సంశయం వేధిస్తోంది, రత్తమ్మ వొప్పుకుంటుందో—లేదో అని.

“నువ్వేమీ చెప్పక్కర్లేదు, నా కీపాటి తెలియదూ? వెళ్ళు” అన్నాడు.

వసంతం వెళ్తూ తలుపు లోపల గొళ్లెం పెట్టుకుని వెళ్లింది.

శాస్త్రి ఒక అడుగు ముందుకు వేశాడు. వరదరాజు శిలాప్రతిమలా కదలిక లేకుండా ఉండిపోయి తనకి కనపడని దృశ్యాన్ని శబ్దంద్వారా ఊహిస్తున్నాడు.

శాస్త్రిగారు మెల్లిగా వొచ్చి మంచం కుక్కిమీద కూర్చున్నాడు. రత్తమ్మ యౌవ్వన శరీరం, అవయవాల నునుపూ, బ్రాందీ మగతలో మానవత్వం కోల్పోయిన శాస్త్రిగారిలో పైశాచిక ప్రవృత్తుల్ని విపరీతంగా రెచ్చగొడ్తున్నాయి. బైట వాతావరణపు చలీ, చీకటే, గదిలోని మసక వెలుగూ, సహజజ్ఞానాన్ని కప్పేస్తున్నాయి. శాస్త్రిగారు పక్కకు తిరిగి పడుకున్న రత్తమ్మ భుజాన్ని సున్నితంగా తాకాడు. రత్తమ్మకి స్పర్శ ఎంత గాఢంగా తగిలిందో ఏమో, లేక ఏ భయంకర స్వప్నం కనిపించిందో, ఒక్కసారి ఉలిక్కిపడి లేచికూచుంది కళ్ళు నులుముకుంటూ. శాస్త్రిగారు, “భయపడకు—నేనే” అంటున్నాడు.

వరదరాజు గభాల్న మంచం కిందనించి లేచివచ్చి ఎదురుగా నిలబడ్డాడు. అతని కుడిచేతిలో బాకు గుడ్డిదీపం వెలుగులో తళతళమంది. “అవును, నువ్వే!” అన్నాడతను గర్జిస్తున్నట్టు.

★ అపస్వరాలు ★

శాస్త్రిగారు కొయ్యబారిపొయ్యాడు. కాళ్లు వొణుకుతున్నాయి. రత్తమ్మకంతా అయోమయంగా వుంది.

వరదరాజు, "లే—లేవయ్యా పెద్దమనిషా! దిక్కులేని పిల్లదాన్ని వొంటరిపాట్న చూసి పక్కలోకి చేరినా?. తీ.. తీ. ఎంత తెచ్చినావు?" అన్నాడు ఆయనవేపు జరుగుతూ నాటకాల్లో దుర్యోధనుడి వేషంవేసి జనాన్ని హడలగొట్టిన శాస్త్రిగార్కి, ఈ ఆరడుగుల భారీవ్యక్తిని చూసేసరికి అంత చలిలోనూ చెమటపోస్తోంది. ఆయన చూపంతా వరదరాజు చేతిలో బాకుమీదే వుంది. నోటిమాట పెగలటంలేదు.

లోపల గందరగోళం వినిపించిగాబోలు వసంతం ఆదుర్దాగా వొచ్చి తలుపవతల నుంచుంది. తలుపుకున్న రంధ్రంనించి లోపలికి చూసింది. ఆమె నవనాడులూ కుంగిపొయ్యాయి వరదరాజు! వీడు ఎట్లా వొచ్చాడు లోపలికి?

వరదరాజు, "తీ—శాస్త్రీ! తియ్యి! ఎంత తెచ్చినావు కట్నం! అది తాచెడ్డది కాకుండా బంగారంలాంటి పిల్లదాన్ని పెళ్లిచేస్తానని తెచ్చి ఇదా చేసేపని!..." అంటూ గబుక్కున వొంగి శాస్త్రిగారి లాల్చీని రొమ్ముదగ్గర లంకించుకున్నాడు. రత్తమ్మ భయంతో గజగజలాడుతూ చుట్టూచూస్తోంది అయోమయంగా. శాస్త్రిగార్కి గుండె మెడ్రాస్ మెయిల్ వేగంలో స్పందిస్తోంది. లోలోపల తీవ్రంగా పనిచేస్తున్న వివేకం, 'జేబులో పైకం ఇచ్చేసి ప్రాణం దక్కించుకో' అంటోంది. ఆయన జేబులోంచి వందకాయితం తీసి, "ఇదిగో తీసుకో.. బుద్ధి గడ్డితినివచ్చాను" అన్నాడు. అవసరమైతే లెంపలేసుకునేవాడే.

వరదరాజు వందకాయితం అందుకుని "పద...వెనక్కి తిరిగి చూశావా? జాగ్రత్త!" అంటూ తలుపువేపు నెట్టాడు శాస్త్రిగార్ని.

ఈ సమయంలోనే వసంతం గొళ్లెంసితీ పారిపోయింది. ఈ సమయాన వరదరాజు కంటబడ్డం ప్రమాదం. ఏ గుణాన వున్నాడో శాస్త్రిని పొడవలేదు.. ...

శాస్త్రి గదిలోనుంచి బైటపడగానే వరదరాజు రత్తమ్మ చెయ్యి పుచ్చుకుని, "రా, పిల్లా రా. ఈడ ఇంకో నిమిషంగూడా వుండగూడదు నువ్వు అడొచ్చి పక్కన కూసున్నా గాని లేవనే లేవకపోతి వేం? అంత మొద్దునిద్దర పనికిరాదు" అంటూ లేవదీశాడు ఆమెని. యంత్రవతుగా లేచింది రత్తమ్మ.

రత్తమ్మ గుడ్లప్పచెప్పి నిలబడింది. ఆమె కింకా భయం వొదల్లేదు. వరదరాజూ శాస్త్రిగార్ల సంభాషణలవల్ల ఆమెకి జరుగుతున్న విషయమేమిటో కొంచెం బోధపడింది..."యాడకి బావా!" అందిమెల్లిగా. "యాడకో! బయటపోయినాక చెబుతాగా! ఈసైతాన్ కొంపలో ఇంక నువ్వుంటానికి యీల్లేదు పో!" అంటూ వరదరాజు రత్తమ్మ చెయ్యి పట్టుకుని లాక్కుపోతున్నాడు రోడ్డుమీదికి.

శాస్త్రిగారు కనపడ్డ సైకిల్ రిక్షా ఎక్కి వెళ్లిపోతూండడం కనిపించింది రోడ్డుమీద. వసంతం ఎక్కడ వుందో అంతులేదు వరదరాజు రోడ్డుమీదికి వచ్చి వానలో నిలబడి ఒకసారి మనస్ఫూర్తిగా నవ్వాడు. నవ్వాగాక, "రత్తీ! నిన్ను పెళ్లి చేసుకుంటానన్నదే ఎవడో! వాడిల్లెక్కడ తెల్సా?" అని ప్రశ్నించాడు.

"తెల్సు..." అని నసిగింది రత్తమ్మ ఆ చీకటిలో వరదరాజు భావమేమిటో గ్రహిద్దామని అతని మొహంకేసి చూస్తూ.

వరదరాజు, "పద—అక్కడికి," అంటూ నడవసాగాడు.

రత్తమ్మ కొత్త భీతితో వెనక్కి తిరిగి బార్లాతీసివున్న ఇంటి తలుపువేపు చూస్తూ, వరదరాజును అనుసరిస్తోంది. ఈదురుగాలి చల్లగా వీస్తోంది, చినుకులతో కలిసి. అప్పుడప్పుడు మెరుస్తోంది. రోడ్డు లైట్లకిందగా పది గజాలు నడిచారు ఇద్దరూ. వరదరాజు నిలబడి, "అతని ఇల్లెక్కడ?" అని అడిగాడు.

రత్తమ్మ టీషాపుకి పక్కన రెండో పూరింటిని చూపించింది.

రత్తమ్మను ముందు నడవమని వరదరాజు వెనకాలే వెళ్లాడు. ఆ యింటిముందున్న తడిక తలుపు నెట్టగానే వొచ్చింది. రత్తమ్మ సంశయిస్తున్నది వరదరాజు-"అతని పేరేమిటే పిల్లా?" అనిఅడిగాడు.

రత్తమ్మ రెండు నిమిషాలు సిగ్గుచేత గాబోలు వూరుకుంది

వరదరాజు, ఆమె వీపు చరిచి, "చెప్పవే! సిగ్గేంది! వాన చినుకులికి నా వొళ్ళు నూడు ఎట్టా ముద్దముద్దయిపోయిందో! నే యెల్లిపోవాల! చప్పున చెప్పు" అన్నాడు.

రత్తమ్మ "సత్యం!" అంది తలొంచుకుని.

వరదరాజు, "సత్తెంగారు!" అని కేకేశాడు రెండుమూడుసార్లు.

పొద్దుకూకులూ టైప్ కేసులదగ్గర నిలబడి అక్షరాలు కూర్చి కూర్చి వొళ్ళు విరగ్గొట్టుకున్న బడలికతో, వానకీ గాలికీ బాగా ముణగదీసుకుని పడుకున్న సత్యం మూడో కేకకి అదిరిపడి లేచి బైటికివచ్చాడు, కళ్లు నులుముకుంటూ వరదరాజునూ రత్తమ్మనూ చూసేసరికి ఆశ్చర్యపడి, "అరే! చినుకులో తడుస్తుండారే! లోపలికి రండి" అంటూ పూరింటి పంచలోకి తీసుకెళ్ళాడిద్దర్నీ.

పంచలో మట్టిగోడకివున్న బెడ్ రూం లైటు పెద్దదిచేశాడు. వరదరాజు ఇతన్ని చూడ్డం ఇదే తొలిసారి బాగా బలంగా లేకపోయినా సుమారుగావున్నాడు అందమైనవాడే . రత్తమ్మకి ఈడే ..

సత్యం —"కూచోండి" అంటూ, పంచలోవున్న మంచం చూపించాడు వరదరాజుకి. అతని కళ్లు రత్తమ్మవేపు చూసి "ఏమిటిది!" అని ప్రశ్నిస్తున్నాయి

వరదరాజు ఒకసారి తన మామూలునవ్వు నవ్వాడు "కూకుంటానికి టైంలేదులే తమ్ముడూ! ఓమాట నీతో చెప్పిపోదామని వొచ్చినాను, వింటావా?" అన్నాడు రత్తమ్మ బెదురుచూపులు చూస్తోంది."చెప్పుఅన్నా!"అన్నాడుసత్యం కొంచెంనమ్రతగానే. అతనికి వరదరాజునుగూర్చి కొంతవరకు వినికిడివల్ల తెలుసు

"ఏంలేదు. ఈ పిల్లని ఆ పాడుకొంపలో ఇంక ఉంచటం నా కిష్టంలేదు తమ్ముడు! నువ్వు దీన్ని పెళ్లిచేసుకుంటానన్నావంటగా! ఈడనే ఉంచుకో. మూర్తంనాడు గుళ్ళోకిపోయి ఆ కాస్త పనీ పూర్తిచెయ్యి సరిపోద్ది! ఏవంటావ్?...నే చెప్పేది తెల్సిందా! ఆ కొంప మంచోళ్ళకి అచ్చిరాదు తమ్ముడు! మిగతా కదంతా రత్తమ్మే చెప్పుద్దిలే "అని ఆగాడు వరదరాజు, ఎదటివ్యక్తి ఏమంటాడో అని చూస్తూ.

సత్యం—ఆలోచించలేదు గూడా! రొట్టెజారి నేతిలో పడితే సంతోషించని వాడుంటాడా! "అట్టనే అన్నా! ఈడనే ఉండిపొమ్మను. ఆ యమ్మాయి కిష్టమైతే నాదేంది!" అంటూ అతను రత్తమ్మకేసి చూశాడు కళ్లతో నవ్వుతూ

రత్తమ్మ మొహంలో ఎక్కడలేని వికాసమూ వొచ్చింది. మబ్బులు తొలగి చంద్రుడు తొంగిచూసినట్టయింది

వరదరాజు కాబోయే ఆ దంపతుల మొహాల్ని ఒక నిమిషం పరీక్షగా చూశాడు సంతోషంతో ఈలవేశాడతను రత్తమ్మ చెయ్యిలాగి, సత్తెం చేతిలో పెడుతూ, "జాగర్త పొద్దున్నే దీని అక్క ఈడకి వస్తదేమో! నా పేరు సెప్పండి నోరు మూసుకుని అవతలికి పోద్ది. ఇంకా ఏదన్నా వాగితే—నేను సాయంత్రానికి వస్తాలే నేను సూస్కుంటా రత్తీ! జాగర్త! నే యెల్తా" అంటూ బయిల్దేరాడతను. సత్యం అతన్ని రోడ్డుదాకా వొచ్చి వొదలిపెట్టి లోపలికి పోతూ, "ఉంటా నన్నా!" అన్నాడు.

"పిల్లదాన్ని జాగర్తగా సూస్కో, ఇంక నీదే భారమంతా!" అంటూ వరదరాజు ఊళ్లోకి సాగిపోయినాడు ఆ కటికి చీకట్లో, వానలోనే లోపలికి వెళ్ళిన సత్యం రత్తమ్ముని "నువ్వెళ్లి మా అమ్మకాడ పండుకో నేనిక్కడ పంచలో పండుకుంటా. పొద్దున్న సెబుదువులే ఏం జరిగిందో" అంటూ ఆమెని లోపలికి తీసుకెళ్ళాడు.

[ఇంకా వుంది]

గ్రంథాలయాలు : బాలసాహిత్యము

ర్ణయించారు; కొంతమంది పదిహేను సంవత్సరాల వరకే నన్నారు. మరికొందరు పన్నెండు సంవత్సరాలవరకు బాల్యావస్థ అన్నారు.

'పద్దెనిమిది సంవత్సరాలలోపు వయసు గలవారు న్యాయశాస్త్రరీత్యా మైనర్లు. ఈకాలములో పదిహేను సంవత్సరాల వయసుగల పిల్లలు ఉన్నత పాఠశాలవిద్యను ముగించి కళాశాలలో ప్రవేశిస్తున్నారు. ఆంగ్లభాషలో షేక్స్పియరు రచనలనూ, తెలుగులో కాళిదాసు రచనకు అనువాదాలనూ చదివేపిల్లలు బాలలే అవుతారా? ఈపిల్లలను చిన్నలలో పెద్దలని అనవలసి వస్తుందికదా!' అని సామాన్య దృష్టికి తోచటములో వింతలేదు.

పిల్లల మానసిక పరిస్థితి పద్దెనిమిది సంవత్సరాల వరకూ అనేక మార్పులు చెందుతుంది. ఆమార్పులను బట్టి తరగతులుగా శాస్త్రజ్ఞులు విభజించారు.

మూడు సంవత్సరాలవరకూ పసితనము క్రింద లెక్క పెట్టారు.

3 సంవత్సరాలనుండి 6 వరకు శైశవము. 6 నుండి 11 సంవత్సరాల వరకు బాల్యావస్థ 11 నుండి 16 వరకు కౌమారము 16 నుండి 18 సంవత్సరాలవరకు కౌమార దశకూ యౌవనావస్థకూ మధ్యదశ.

సాధారణముగా పిల్లల మనః ప్రవృత్తిలో ప్రత్యేకమైన మార్పులు కలిగే ఘట్టాలు ఆరు, పదకొండు సంవత్సరాలలో. కనుక బాల వాఙ్మయము ఈ మార్పుల ననుసరించి సృష్టింప బడినదే ననుకోవటములో పొరపాటు లేదు.

బాలసాహిత్య నిర్ణయములోకూడా అనేకాభిప్రాయాలువ్యక్తీకరింప బడుతున్నాయి. విషయ మెటువంటిదయినా సులభశైలిలో వ్రాసిన గ్రంథాలన్నీ బాల వాఙ్మయముక్రింద జమకట్టవచ్చునని కొందరంటున్నారు. బాలలప్రసక్తి ఉన్నదంతా బాల వాఙ్మయమేనని మరికొందరంటున్నారు. పిల్లలకు ఆనందమునిచ్చేవిషయాలు మాత్రమే సులభశైలిలో వ్రాయాలిగాని ప్రతి విషయమూ చెప్పి వాళ్ల మనసులను కలవర పరచకూడదని ఒక వాదముఉన్నది.

బాల సాహిత్యాన్ని గురించి ఆలోచించేటప్పుడు శైలి ప్రధానమా - భావము ప్రధానమా అన్న మీమాంస రాక తప్పదు. కేవలము శైలి ప్రధానమనుకొంటే కొన్ని చిక్కులు కలిగే అవకాశాలున్నాయి. తెలుగుభాషలో ఈ కాలములో ఉత్పత్తి అయిన గ్రంథాలు పిల్లల కర్థమయ్యేటట్టు గానే ఉంటున్నాయి ఇప్పటి కథా సాహిత్యమంతా వ్యావహారిక భాషలోనే ఉంటున్నది. శైలి సులభముగా ఉన్నదని, చదివిన పాఠకుడికి ఏ దృష్టితో వాటి నర్థము చేసుకొనవలెనో గ్రహించుకొనే వయసు ఉండదు. కొన్ని విషయాలలో పిల్లలకు జీవితానుభవాలు కలుగకముందే గ్రంథపఠనానుభవ మెక్కువయి ప్రమాదించవచ్చు; కనుక పిల్లలకు తెలుపవలసిన విషయాలు పరిమితిగా ఉన్నాయనుకోవటములో దోషములేదు. కాని శాస్త్రజ్ఞులు పిల్లలకు తెలుపకూడని విషయాలు ఉండకూడదని నిర్ధారణచేశారు ఈ విషయములో కొంత అభిప్రాయ భేదాలున్నప్పటికీ కనీసము చెప్పే విధానమయినా ప్రత్యేక పరిమితులలో ఉండటము సమంజసము

పిల్లలకు ప్రతిదీ తెలుసుకోవాలన్న కుతూహల మెక్కువగా ఉంటుంది. ఆతృప్తి తీరేటట్లుగా అద్భుతరసము, హాస్యరసము, చమత్కారము, వినోదముతో కూడిన గ్రంథాలు అవసరము దేశచరిత్ర, భూగోళము మొదలైనవి పిల్లల కాకర్షణీయముగా కథారూపములో ఉండటము ముఖ్యము. జీవితచరిత్రలు పిల్లలకు జీవితపు బాటలను నిర్మించేవి. ఆదర్శ ప్రభువుల చరిత్రలు, వీరుల గాథలు, యాత్రికుల సాహస కృత్యాలు, నీతిబోధకమైన కథలు బాల సాహిత్యములో చేర్చబడినవే పిల్లలవి లేతహృదయాలు. అతి విషాదశోకరసాలకు తాళలేవు. కనుక ఈ శోకరసాన్ని బాల సాహిత్యములో తక్కువమోతాదులో వాడటము మంచిది. పిల్లలకు నటనా కౌశలమును కలిగించటానికీ - భావోద్దీపనము కలిగించటానికీ నాటకాలు చాలా అవసరము పిల్లలకు పాటలు, జానపదగాథలు, పేదరాసి పెద్దమ్మకథలు పంచతంత్రకథలు బృహత్కథలు మొదలైనవి మనకు ఉన్నవాటినే ప్రత్యేక దృక్పథముతో సంస్కరించి బాల సాహిత్యములో చేర్చాలి

చిన్న బిడ్డలకు తెలుపదలచిన విషయాన్ని డొంక తిరుగుడుగా చెప్పకుండా సూటిగా మనసులో హత్తుకొనిపోయే శైలిలో వ్రాయటము మంచిది.


దేశ భాషలలోబాలసాహిత్యముగ్రంథాలయాలలో నిండిపోయేటంత ఉత్పత్తి కావటములేదు. దానికి కారణాలు అందరూ ఎరిగినవే రచయితలకు తగిన ప్రోత్సాహము లభించటములేదు ఇతరుల బాల సాహిత్యము విషయములో కేంద్రప్రభుత్వము రాష్ట్రప్రభుత్వాలు ప్రోద్బలించి పోటీలను నడుపుతున్నాయి ఈ పోటీల కొరకు ఉత్పత్తిఅయినవాటిలో ఒకటో రెండో బహుమతుల నందుకుంటాయి వాటినే ప్రభుత్వము కొన్ని వేలకాపీలను కొంటుంది అధిక ప్రయాసతో అచ్చువేయించుకొన్న గ్రంథాలను రచయిత చేతబట్టుకొనిఅమ్ముకోవలసి రావటమే రచయితలకు నిరుత్సాహకరమైన విషయము. ఇప్పటివరకూ మనకున్న సరసమైన బాలసాహిత్యానికి వార్తాపత్రికలు





కోటప్పకొండమీద కోటేశ్వరాలయం

ఫోటోలు : [illegible]—తెనాలి



శివరాత్రినాడు కోటప్పకొండ తిరణాలు

వనితాలోకం

గ్రంథాలయాలు : బాలసాహిత్యము

ఇటీవల బొంబాయిరాష్ట్ర మహిళా సంఘమువారు పిల్లలకొక గ్రంథాలయాన్ని స్థాపించాలని నిశ్చయించుకోగానే ఒక నగరవాసి లక్షరూపాయల విరాళము ఇచ్చాడట ఆదాత తనపేరు వెల్లడించటానికి అనుమతించలేదని ఆసంఘాధ్యక్షురాలు పత్రికా విలేఖరులతో చెప్పారు.

ఆసంఘము పక్షాన అదివరకే సెలవులలో పిలలు చదువుకోవటానికి తగిన ఏర్పాట్లను చేయగా అది సఫలమయినదనీ, పిల్లలకు సాధారణముగా రంగు రంగుల బొమ్మలతో వినోదకరముగా ఉండేపుస్తకాలు యిష్టము కనుక వాటితోపాటు పిల్లల శుచితమైన గ్రంథాలనుకూడా సేకరించగలమని ఆమె వెల్లడిచేశారు. గ్రంథాలయము 20,000 గ్రంథాలతో ప్రారంభించబోతున్నారనీ, అది పదిహేను సంవత్సరాల వయసులోపలి వారికేనని తాము నిర్ణయించుకొన్నట్టుగా తెలిపారు ఇదిగాక వాడవాడలకు తిరిగి ఇండ్లకు పుస్తకాలనందిచ్చే గ్రంథాలయాన్నికూడా స్థాపించబోతునామన్ని ఆమె వెల్లడి చేశారు

బొంబాయిరాష్ట్ర మహిళాసభ పిల్లల విద్యావిషయములో శ్రద్ధవహించి ఒక గ్రంథాలయాన్ని ప్రత్యేకముగా స్థాపించ పూనుకోవటము ముదావహము. సరస్వతిని ఆహ్వానించదలచగానే లక్ష్మీ తనంతటతానే నడచివచ్చింది ఆదాతదెంతదొడ్డ

ఇల్లిందల సరస్వతీదేవి

మనసో — తనపేరు వెల్లడించవద్దన్నాడట అమృత హృదయులైన పిల్లల కృతజ్ఞతకు ఆతౌతియ్య పాత్రుడు.


పిల్లల గ్రంథాలయానికి మంచిగ్రంథాలు, వాళ్ళనాకర్షించే బల్లలు కుర్చీలు, పిల్లల మనస్తత్వమెరిగిన ఒక గ్రంథపాలకుడు విసుగుపడని నౌకరులు అవసరము

పిల్లలకు పుస్తక పఠనమువల్ల తారతమ్య జ్ఞానము, మంచి పౌరులు కావటానికి తగిన పరిజ్ఞానము ఆనందము లభిస్తాయి 'జాన్ డ్యూయీ' చెప్పినట్లుగా విద్య మానవ జీవితానికి మెరుగులు దిద్దేదిగా ఉండాలి దానికి దోహదమివ్వగలిగినది గ్రంథపఠనము. పిల్లల గ్రంథాలయాలకు గ్రంథాలను సేకరించటానికి ఒక ప్రత్యేకమైన దృష్టి అవసరము. బాల వాఙ్మయాన్ని నిర్ణయించేటప్పుడు పిల్లల వయః పరిమాణాన్ని ముందుగా నిర్ణయించవలసి ఉంటుంది. ఈ విషయములో అనేకాభిప్రాయాలున్నాయి. కొందరు పద్దెనిమిది సంవత్సరాల వరకూ బాల్యదశ అని

కొత్త ఆంధ్ర శాసనసభకు ఎన్నుకోబడిన వనితలు



శ్రీమతి అమ్మన్న రాజా
(అత్తిలి నియోజకవర్గం)



శ్రీమతి కుసుం గజపతిరాజు
(గజపతినగరం నియోజకవర్గం)



శ్రీమతి రుక్మిణీదేవి
(హిందూపురం నియోజకవర్గం)

చాలా వరకూ బాధ్యత వహించాయి. బాల సాహిత్యములో ఉత్తమముగా ఉన్న వాటిని వ్రాసి ప్రచురించే ప్రభుత్వము, పబ్లిషింగ్ కంపెనీలుకొని అచ్చు వేయించే విధానాలు మనకు విరివిగా అభివృద్ధి కావాలి. సాహిత్యము చాలినంత లేకపోబట్టి గ్రంథాలయాల కొరకు ప్రత్యేకించిన ధనము నిలిచిపోతుందనే ఉద్దేశ్యముతో పాలకులు చెత్త పుస్తకాలుకొని నింపుకున్నారు. దీనిని అరికట్టటానికి ప్రభుత్వమూ ప్రజలూ కొంత కృషి చేయాలి.

చిన్న బిడ్డలకు బాహ్యేంద్రియ సహాయము లేకుండా ఆలోచించుకునే శక్తి తక్కువ కనుక వాళ్ళకు ఉపయోగకరమైన సంగీతము రికార్డుల ద్వారా వినిపించుతూ ఉండాలి. ముచ్చట గొలిపే రంగు రంగుల బొమ్మలు, చేతితో పట్టుకొని ఆటలాడటానికి వీలయిన రకాలు (*Models*) గ్రంథాలయములో ఉంచటము అవసరము. పిల్లల గ్రంథాలయము పాఠశాల కార్యక్రమానికి తోడ్పడేదిగాను, స్వతంత్రముగా విద్యాభివృద్ధిని కలిగించేదిగాను ఉండాలి.

గ్రంథాలయాలలో ఉత్తమచిత్రాలతో పాటు గ్రంథ పఠనాన్ని గురించిన చిత్రాలు —పుస్తకము ఏ చేతితో పట్టుకోవలెనో, కంటికెంత దూరములో పుస్తకము పెట్టుకోవలెనో, పుస్తకాలను జాగ్రత్తగా ఏవిధముగా వాడుకోవలెనో మొదలైన ముఖ్యసూత్రాలను తెలిపే వాటిని గోడలకు తగిలించాలి. అవిధముగా ఆచరించని పక్షములో రాగల నష్టాలను తెలిపే పటాలను కూడా గోడలకు తగిలించటము వల్ల పిల్లలకు చాలా ఉపయోగకరముగా ఉంటుంది.

గ్రంథపాలకుడు పుస్తకానికీ పాఠకునికీ సంబంధము కల్పించే మధ్యవర్తి. పాఠకునికొరకు గ్రంథాలను వెదకటము, గ్రంథాలు చదవటానికి పాఠకులను వెదకటమూ అతడి ముఖ్య కర్తవ్యము. రంగు రంగుల బొమ్మలతో ఉన్న పత్రికలను పుస్తకాలను బల్లమీద తెరచిపెట్టి పిల్లలను ఆకర్షించాలి. క్యాటలాగులో ఉన్న పుస్తకాలను గురించి పిల్లలకు చెప్పుతూ ఉండాలి. ఏ పుస్తకములో ఏమేమి వింతలూ విశేషాలూ ఉన్నాయో పిల్లలకు చక్కగా వర్ణించి చెప్పాలి. గ్రంథపాలకుడు బిడ్డల మనస్తత్వమును చక్కగా తెలిసినవాడై ఉండటము ముఖ్యము. బిడ్డలకు గ్రంథాలతో పాత్తు కుదిర్చటానికీ గ్రంథపఠనాశక్తిని బిడ్డలకు కలిగించటానికీ సామాన్యుల కంటె సుశిక్షితుడైన భాండాగారనిర్వాహకులు సక్రమంగా బాధ్యతలను నెరవేర్చగలరు. పది పదకొండు సంవత్సరాల పిల్లలకు కొంత గ్రంథపరిచయము ఉండేవుంటుంది కనుక కావలసిన పుస్తకము అడిగి తీసుకొనే శక్తి కలుగుతుంది. ఆలోపు వయసుగల పిల్లలకు పుస్తకాలలోని కొన్ని వాక్యాలు చదివి వినిపించి, బొమ్మలను చూపించితేగాని ఆకర్షణ కలగదు. పిల్లలకు ఇష్టములేని పుస్తకాన్ని క్రిందపడవేసి మరొక పుస్తకాన్ని చేతపట్టుకునే స్వాతంత్ర్యమూ చనవూ గ్రంథపాలకునివద్ద ఉండాలి.

పిల్లలకు పనికివచ్చే పుస్తకాలు శైలిలోనే కాకుండా భావన (*Conception*) లోకూడా ఏవిధముగా ప్రత్యేకతను కలిగి ఉండాలో, అవిధముగానే గ్రంథాలయ భవనాలు దానిలో అమర్చబడే ఫర్నిచరు వాతావరణమూ ప్రత్యేకముగా ఉండాలి. చిన్న చిన్న బల్లలు, కుర్చీలు, ఎత్తు తక్కువగా ఉన్న అలమారులు పిల్లల నాకర్షించేవిగాను వీలుగాను ఉంచటము ముఖ్యము.

గ్రంథాలయాలలో పిల్లలకు ఆకర్షణ కలిగేటట్లుగా వాళ్ళచేత నాటకాలు వేయించటము, చర్చలూ పోటీలు పెట్టటము, ఉపన్యాసాలు ఇప్పించటము మొదలైన కార్యక్రమములు ఏర్పరచాలి. వీటివల్ల పిల్లలకు మంచి అభిరుచి కలుగుతుంది.

మనకు ఇటీవల అనేక సంస్థలు అనేకోపయోగాల కొరకు స్థాపింపబడ్డాయి. చాలావరకూ కొన్ని సంస్థలు ఆరంభశూరత్వాన్ని మాత్రమే ప్రకటించగలిగాయి. దీనికి కొంతవరకూ ప్రారంభములో కార్యకర్తలకున్న ఉత్సాహము తరువాత తగ్గిపోవటమే కారణము. సంస్థలు సజీవముగా ఉండటానికి ప్రజల విశ్వాసము చాలా అవసరము. ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన సంస్థలు నవచైతన్యముతో సాగిపోతాయి. ప్రజల విశ్వాసాన్ని పొందగలెనంటే సంస్థలు ప్రజాసామాన్యానికి సన్నిహితముగా ఉండాలి. ఈవిషయాన్ని గమనించకపోతే ఏ సంస్థలయినా మ్యూజియమ్ పీసులవలె నిలిచిపోతాయనుకోవటములో విడ్డూరము లేదు. ★

వనితాలోకం :

వంకరగీతలు

కందుకూరి లింగరాజు

స్వతస్సిద్ధంగా కొంత తబ్బిబ్బు నడకల్లో నడిచే ఆవిడ, ఈమధ్య ఈ నియమం తో మిక్కిలి దయ్యేవరకే వంట పూర్తి చేసెయ్యడం కొంత ఆశ్చర్యం కల్గించింది. ఈ చురుకుతనం అంతా ఇదివరకు ఏమయ్యింది అనుకున్నాడు. ఆరోజు ఆఫీసు చేరేసరికి, పేజరు గిజస్లో రోజా ఎర్రచీరా ఇంటూమార్కులు ఉండడం అలవాటే ఇప్పుడు ఇంక అవి వుండేవన్నట్లు సంతోష పడాడు పరశురామయ్య. దానికంట - 'ఏమిటికథా' అని ఆలోచనలో పడ్డాడు.

ఆశుక్రవారం నాడు మధ్యాహ్నం ఒంటిగంటకే వచ్చేసేడు. వచ్చేసరికి ఇల్లు తాళం వేసివుంది. ప్రక్క వాళ్ళని అడిగేడు. "రోజూ వెళ్తూనే వున్నారండి, మూడుకో, నాలుకో ఇంటికి వస్తారండి" అన్నారు.

ఇది మరీ ఆశ్చర్యం కల్గించింది. ఏపరమపద సోపానపటమో లేకపోతే పచ్చీసో ఆడ్డానికి వాళ్ళ మంగతాళ్ళ ఇంటికో, లేక సుబ్బమ్మగారింటికో వెళ్ళివుంటుందనుకుని బజారున పడాడు.

తిరిగి వచ్చేసరికి ఇంట్లో కుంపటి హడా విడలో మునిగిపోయింది ఆవిడ. చెప్పనూ లేదు, తను అడగనూ లేదు. అల్లాగే వుండిపోయింది అసలు విషయం. విన్నవాటిల్లో రోజూ లలిత, లక్ష్మి, ఈవిడ ముగ్గురూ వెళ్తున్నారని తెలిసింది. ఎందుకు? ఎక్కడికి? ఏం చేస్తున్నారన్నదిమాత్రం తలపగలకొట్టుకున్నా, దారికి చేరటం లేదు.

టైముకు సరిగ్గా వచ్చేస్తున్నాడే అని చెప్పరాని మాటల క్రింద, మూచే కళ్ళజోడు ఆఫీసరు చూపులతో తృప్తిపొందేడు, నూటవిభైరూపాయల ప్రభుత్వసేవకుడు పరశురామయ్య.

ఆ పదో తారీఖున కాబోలు లెఖ్ఖల జమా, ఖర్చూ చూస్తుంటే, పరశురామయ్యకి కొత్తపద్దులు కన్పించేయి. గజం గుడ్డలు మూడు, గజన్నరవి రెండు, రెండు కుట్టు సూదులు, రెండు పూలుప్రల్లలు, ఒక సాడా ప్రేము, పన్నెండు రంగుదారాలు, రెండు దస్తాల కాగితాలు, దళసరి కాగితాలు ఆరు వరసి తోమిక్కిడి రూపాయి పద్నాలుగు అణాల మూడు కానులు. ఇవన్నీ ఎందుకో అర్థం అవలేదు. అయినా ఆవిడకు కేటాయించిన ఖర్చుల మొత్తంలోనే వున్నాయనుకుని సంతోష పడాడు.

కాని రెండురోజుల అవతల, ఆ నెలవారి ఖర్చుల్లో ఆవిడ పడూపడింది. దింతో దిక్కులు తెలిసేయి కావు

అడుగుదామన్నంత ఉద్రేకం కల్గింది కాని అభిజాత్యం వెనక్కు తీసేసింది. అడగనే లేదు

అసాయంత్రం మోము ఎక్కుతుండగా నే "ఈబజారు గాంగా చిన్నదండి! ఎంత వెతికినా ఒక్క ఎరుకూ బాగో లేదు" అంది

"ఏం?"

"ముత్యపు చిప్పల బొత్తములు దొరుకుతాయేమో అని అన్ని కొట్లు తిరిగేం. ఒక్క దాంట్లోనూ కూడా దొరక లేదు మీరు పెద్ద బజారుకు వెళితే తెచ్చిపెట్టండీ". అంది.

ఒక్కసారి ఈ ముత్యపుచిప్పల బొత్తాములు అడగడం, తను సెంట్రల్ నుండి చొక్కాకి బొత్తాములు కుట్టమని చెప్తున్నదానికి కాబోలు అనుకున్నాడు ఇక కుట్టుతుంది మనం తెచ్చుకోనక్కర లేదు అనుకుని "అల్లాగే" అన్నాడు.

"మూడు పెజన్లు తీసుకురండి" అంది. ఒక్కసారిగా మూడుపెజన్లా : — అర్థం కాలేదు.

రిటైరయ్యేవరకూ సరిపడతాయని కాబోలు అనుకుని నవ్వుకున్నాడు తర్వాత ఏదో కబుర్లు చెప్పింది ఖంగువా వేసుకుని మెల్లి దిగేంపన్నాడు

"మీ టైలరు దారిలోనే కాదండి. సెల్కువి, లినన్‌వి అన్ని రంగుల్లో గుడ్డ ముక్కలు అడిగి తీసుకురండి మర్చిపోకండేం'.

పిచ్చిలోవాళ్లు చూస్తారేమో అన్న భావంతో తలూపి బయట పడ్డాడు. చంటిపిల్లలైనా లేరు చిలకలు కుట్టడానికి, ఇవన్నీ ఎందుకో అనుకున్నాడు

అయినా ఆసాయంత్రం పెద్దబజారుకు వెళ్ళి అన్నీ పట్టుకొని వచ్చేడు.

* * *

ఆమర్నాడు ఆఫీసుకు వెళ్ళేటప్పుడు చూస్తే చేతి కఫ్సులకు బొత్తాములు లేకుండానే ఉండిపోయేయి కొంచెం చికాకు కలిగింది

గబగబ ఆవిడ వస్తానే "మర్చిపోయే. ఆధారంమీద మీ సంతకం కావాలండీ"

"ఏ ధారంమీద"

"ఏనాక్కులు దరఖాస్తు ఫారం"

"నాక్కులు!"

"అవునండి! మీకు తెలియదూ? వృత్తి విద్యా ఉన్నతి పాఠశాల పెట్టేరని? అందులో స్త్రీలందరికీ అన్ని విద్యలూ చెప్తారు."

"అంటే"

"కుట్టుపని, రంగులు అద్దకం, సంచులల్లడం, తోలుపని, ఎంబ్రాయిడరీ, బట్టలు ఉతకటం, నేత, బొమ్మలు చెయ్యడం, పువ్వులుకట్టడం, వంటవండడం. అన్నీను అందులో నేను, ఇంకా చాలామంది ఉన్నాం.."

ఒక్కసారి తెల్లబోయేడు.

"నాకు చెప్పలేదం..."

"ఇన్నాళ్ళనుండీ తెచ్చిన సగుకులన్నీ కొనికనుకున్నారు. అక్కడకొవలసి...ఆ మూల్లో మాకు జీతం లేగుటండీ?"

జీతం లేకపోతేఏం? చక్రవడ్డీ తో బిల్లులు పడుతున్నాయిగా అందామను కున్నాడు.

"వాళ్ళసామానులిస్తే కట్టినవి అన్నీ వాళ్ళే తీసుకుంటారు కనుక మనమే కొనుక్కునిలే మంచిది కాదండీ?" తర్కశాస్త్రం.

ఘోరము చదువుతూ వుండిపోయేడు.

"మేం ఎప్పుడువెళ్ళినా ఫర్వాలేదు. మాకు ఎంటెడెన్సు లేదు"

"ఆఫ్సర్స్ దగ్గర ఏం వ్రాయాలి..."

"నే వ్రాసుకుంటాలెండి.."

సంతకం చేసి సెకి లెక్కేడు. ఆరు నెలల కోర్సు అందులో ఉత్తీర్ణులైతే, పట్టు

★ వంకరగీతలు ★

పని, రంగువెయ్యడం, పువ్వులుకట్టడం... ఇన్ని పనుల్లో ఆరితేరిపోతుందన్న మాట తనకంటె ఎన్నో విషయాల్లో సర్టిఫికెట్ పొందుతుంది తనుమాత్రం ఈ గాడిద చాకిరీ, అర్ధరాత్రిళ్ళల్లో పిలుపులు, ఆఫీసర్ల సతాయింపులు, ప్రజల అర్ధాకలి... తనకు కడుపునిండని జీవితం; అశాంతి ఇవన్నీ కూడా, కొంచెం మర్చిపోకల్గుతానేమో అనుకున్నాడు వాళ్ళ స్వాతంత్ర్యంలోని ఉన్నతి ఈర్ష్య తెప్పించింది

ఆరోజుల్లో ఓ అలమారు అంతా ఖాళీ చేసేడు-ఆవిడ సామానులు పెట్టుకోవడానికి. ట్రంకుపెట్టెలమీద, పెట్టెలు పెరిగిపోయేయి. ఓ అంతస్తులో గుడ్డపేలికలు రెండోదాల్లో, దారాలు, మూడోదాల్లో పుస్తకాలు పెద్దవీ, చిన్నవి, ఆల్బంలాంటివి, స్కేలు రబ్బరు, టేపు, పెన్సిల్స్, కత్తెర్లు ఎన్నో నిండిపోయేయి

ఇంట్లో చాకిరి, పైగా స్కూల్లో చదువు తోటి ఎంత నలిగిపోతోందో అని జాలి కల్గింది 'పోనీ ప్రొద్దుటకు, రాత్రికి ఒక్కసారే వండెయ్య' అని చెపుదామనుకున్నాడు ఓ కుర్రాణ్ణి పెట్టుకుందామా అనుకున్నాడు ఎన్నో...అవన్నీ నూట ఏభై రూపాయల బడ్జెటు దాటకుండా ఉండనన్నట్లు కన్పించేయి

తను గుమాస్తాలో ఎందుకు చేరేనా అని తిట్టుకున్నాడు.

యథాలాపంగా అవ్వాళ పుస్తకాలు తెరిచేడు. అందులో ఏమేమో బొమ్మలు ఉన్నాయి

ఇంకోదాల్లో కత్తిరించిన అట్టముక్కలున్నాయి; అర్థంకాకుండా

మరోదాల్లో, గుడ్డపేలికలు అతికించి ఉన్నాయి. వాట్లక్రింద, క్రాస్ కుట్టు స్కేలింగ్, ట్రయాంగ్యులర్ అతుకుడు స్క్వేర్ అతుకు, రఫ్ తియడం, దాంతర్వాత ఒకచిల్లు బొత్తాము కుట్టడం, రెండు చిల్లులది, నాలుగు చిల్లులది, షర్వాణీ హుక్ కుట్టడం, టిప్పు బొత్తాములు, పంట్లాంబొత్తములు, కాజాలుతియ్యడం ఇవన్నీ ఎల్లాకుడుతారు, వాట్లతో దస్తాకాగితాల పుస్తకం నిండిపోయింది

అవన్నీ మాస్తుంటే తను బి ఏ లో ఇన్నిరకాలపేర్లు విన్నానా అన్న అనుమానం వచ్చింది

పై అంతస్థులో, మూడువేళ్ళ పిల్లలకి సరిపోయే చెడ్డీ, గౌనం, ఫ్రాకు కనబడ్డాయి ఓపక్కగా జేబురుమాళ్లకుఅంచులు కుట్టడం ఉంది

ఇన్నాళ్ళనుండీ ఖర్చుచూచుకున్నాడు నలభైదాటింది ఈ చూచినవన్నీ సింహావలోకనం చేస్తే, నిత్యావసరాలు, సంసారానికి అదునవే పనులు ఒక్కటి కన్పించలేదు మొట్టమొదటనే ఇవన్నీ చెప్పాలి కాబోలు అనుకుని అనునయం చేసుకున్నాడు

ఈ అనునయంలోనే, తనచొక్కాకి ఉత్తరకుట్టు వేసుకుని, ముత్యపుబొత్తము కుట్టుకున్నాడు.

* * *

ఆరోజు ఆఫీసునుండి ఇంటికివచ్చేసరికి, లక్ష్మి, లలిత, ఆవిడ పెంకులు ఎగిరిపోయేటట్లు, తర్జన భర్జనల్లో పడిపోయేరు

"వెకవక్కాలు .. ఆసదర్ మంచిది కాదండీ"

"అదొక్కటే ఏమిటి, తక్కినవాళ్లకు మనం అంటే కోపం ఒక్కటి సరిగ్గా చెపుతున్నారా"

"వాళ్లవాళ్లకైతే కూర్చొపెట్టి మంచిగా చెపుతారు,..."

"ఆమేస్టరు మనకి అన్యాయం చెయ్యాలనేకాదండి సోడా ఎక్కువవేసి, మళ్ళీ సున్నంపోసింది..."

"లేకపోతే ఆ లినన్ సూటు, అల్లా తగులడక పోవును.... ."

ఒక్కసారి పరసురామయ్యకు గుండెలు ఆగిపోయేయి తనదేనా? రెండునెలల క్రితం కుట్టించుకున్నది కాదుకదా !

"మనల్ని మాంసం వండమంటుంది చూచేరా ఆతురకది..."

"పైగా అర్ధశేరుమాంసం కొని తీసుకురావాలిట".

"పోనీ సదరో... దానికి క్రొత్తగా బదలీ అయ్యిందట స్కూల్లో పిల్లల్ని ఎక్కువ మందిని చేర్పించాలని, మనల్ని ఎనిమిదో క్లాసులో చేరమంటుందేమిటండీ".

"నేను ఇంటర్మీడియట్ ప్యాస్ అయ్యేవన్నా...అంది లక్ష్మి

"నేను స్కూల్ ఫైనలు" లలితమ్మ

"నేనూఅంతే" ఆవిడ

"ఇల్లాఅయితే నా నెయ్యడం మంచిది"

ఇంటావిడ సమాధానం చెప్పలేదు వాళ్లు లేచెరు పరశురామయ్యని చూచేసరికి పారిపోయేరు

ఒక్కసారి ఇంటావిడ మొఖంలోకి చూచేడు. కళ్ళల్లో భయందాక్కుంది.

"నామాట పైకి తీస్తావా ?"

మొఖంమీద రక్తం పిడచకటింది తను పెట్టెతీసి చూచేడు పంట్లాం ఓకాలుమీద అప్పడం అంతమేర కాలిపోయింది కోటుకు చేతులు దగ్గర ముందరభాగం లేనేలేదు. కళ్లమ్మట నీళ్ళు తిరిగేయి.

ఏమీ మాట్లాడకుండా బయటకు వెళ్ళిపోయేడు. ఆవిడ కళ్ళనీళ్ళు తుడుచుకోవడం చూచేడు

ఆరాత్రి ..

భోజనందగ్గర కూర్చున్నప్పుడే ఏదో పాడువాసన వేస్తున్నట్లు అనుమానంకలిగింది దొడ్డితలుపు వేసేరు; అయినావాసన మధ్యగదిలోంచి వస్తున్నట్లేవుంది.

"ఏమిటీవాసన ..."

ఆవిడ మాట్లాడలేదు

లేచి మధ్యగదిలోకి వెళ్లేడు మాసినబట్టల పెట్టె ప్రక్కగా బూర్లమూకుడు కన్పించింది పైకి తీసేడు లాంతరు పెట్టి చూస్తే, తోలుముక్కలు నాని చచ్చిన కుక్కపిల్లల్లా ఉబ్బి, ముక్కలు కొరికేస్తున్నాయి. వాసన ఉగ్గుపాలతో కెముల్దం ప్రారంభించింది

"ఏమిటివంతా ?"

"తోలుపని మాస్టరు తోళ్ళు మూడు రోజులు నానపెట్టాలి అంది "

వీధిలోకి విసరి వేసినప్పుడే, చచ్చేటు కక్కుకున్నాడు. ఆ రాత్రంతాకక్కులలో బాధపడ్డాడు ..

వృత్తి ఉన్నత విద్యాపాఠశాలల్లోని అక్షరాలన్ని సార్లు కక్కేడు ..

తను మొదట్లో అనుకున్నాడు మధ్యతరగతి కుటుంబాలకు సహాయకారిగా ఉంటాయి, ఈ పనులు అని కాని ఈనాడు మాంసం వండాలి, బట్టలు తగలెయ్యాలి, తోళ్లునానపెట్టాలి, గోడలు, [illegible] కుట్టాలి, కాజాలు పెట్టాలి, గుండీలు కుట్టాలి.. ఇవేనా వృత్తులు నేర్పేది ..

కూర్చుని తను లెఖలు వేసుకుంటే తగులబడిన లినెన్ సూటుతో సహా తొంభైరూపాయలు రెండు నెలల చదువు ప్రభుత్వంఆలోచించిందా!

మర్నాడు ఇంటావిడ తాటివెనకలో పడిపోయింది.

ఆఫీసులో ఎర్రసిరా ఇంటూమార్కులు మళ్ళీ కన్పించాయి

పెట్లో లినెన్ సూటు కన్పించలేదు. అలమార్లో, ముగ్గురు విద్యార్థుల్లా పాఠ్యపు జాడలు కన్పించేయి

వృత్తిపున్నత విద్యా పాఠశాలలు..

★

బొమ్మరిల్లు

మడిసిబరువు "మహాభారం!"

శ్రీనివాసకాశ్యప

గోపయ్యను నొక
గొల్లత నుండెను
పాలెమునందున
పెద్దయాతడే!

గొల్లలందరూ
గోపయ మాటకు
శిరసులు వొంచుకు
'చిత్తం' అందురు!

గోపయ్యంటే
గోపయగాదూ
భాగవతం, మరి
భారతమూనూ

బాగా తెలిసిన
బాపనయ్యలలో
బలే బలేగా
వాదిస్తాడూ!!

ఆ పాలెమునకు
అయ్యవారొకరు
హరికథ చెప్పగ
అరు దెంచారూ.

అందరు గొల్లలు
హరికథ వినుటకు
ఆనందముతో
వెళ్లారూ — !

గోపయ్యా ఒక
గొంగళి కప్పుకు
నిద్దరబోయెను
హరికథకొచ్చి!!

ఇంతలోన ఒక
తుంటరి పిల్లడు
గోపయ బుజాన
కూర్చొనె మెదలక!

కొంతసేపటికి
గోపయ మేల్కొని
భారతమంటే
బరువాయింతని,

మనసు లోపలను
మథన పడుతునే
మళ్లీతూగుతు-
కళ్లను మూసెను!

ఇంతలోన కథ
అంతా ఆయెను
అందరితోటీ
ఆకు|రాడూ,-

నెమ్మదిగా దిగి
నెమ్మది నవ్వుచు
పరుగు పరుగునా
పారిపోయెను!

బరువు తగ్గినది
హరికథ ఐనది!
అందరు వెళ్ళిరి
అనుకుంటూనే,

గోపయ కూడా
గొంగళి సర్దుకు
వంటరిగానే-
ఇంటికి చేరెను.

మరునాడందరు
మన గోపయ్యను
"మహాభారతం
ఎల్లావుందని"
మరి మరి అడగగ
చిర చిర లాడుచు
"మడిసిబరువురా
మహాభారమనె!!"

ఈమాటనగనె
ఇల్లెగిరేలా
పిల్లలు పెద్దలు
గొల్లున నవ్విరి!!

(బొమ్మరిల్లు సీరియల్)

జూదరి

మూలం: చార్లెస్ డికెన్స్ అనువదం: కె. రామచంద్రరావు

నెల్, ఆమె తాత ఎంతో హాయిగా జీవిస్తూ ఉంటారు. తాతకి ఎక్కువ ధనం సంపాదించాలని బుద్ధిపుట్టి, పేకాటకి దిగుతాడు అప్పుల పాలవుతాడు. బాకీ పెట్టిన క్విల్ప్ అనేవాడు వాళ్ళ ఇల్లు, గుర్రాలు స్వాధీనం చేసుకుంటాడు. తను చీట్లాడుతున్న రహస్యం బయట పెట్టిఉంటాడని తాత తమదగ్గిర పనిచేసే కిట్ పై ఆగ్రహపడతాడు. తాతను అక్కడనుంచి దూరంగా తీసుకుపోతే కాని సుఖం, శాంతి ఉండవని, నెల్ అనుకుంటుంది. నెల్, తాత ఎవరితో చెప్పకుండా లండన్ విడిచిపెడతారు. వారు అలాపోతూండగా ఒకచోట తోలుబొమ్మలాట వారుఇద్దరు తారసిల్లుతారు. వాళ్లు వీరిని చూచి అనుమానపడి పట్టిఇస్తే బహుమతి దొరుకుతుందని అనుకుంటారు. వారి మాటలు రహస్యంగావిన్న నెల్ తాతని తీసుకొని పారిపోతుంది. ఒక ఉపాధ్యాయుడు వారికి ఆతిథ్య మిస్తాడు. అతడెంతో మంచివాడు. అక్కడ ఒకరోజు ఉండి నెల్, తాత మళ్ళీ బయలు దేరుతారు.

3

సాయంత్రమైంది. నెల్, తాత, ఒకరోడ్డు మలుపు చేరారు. అక్కడ ఒకసవారీబండి ఉన్నది. దానిలో ఒక ఆమె కూర్చొని సుఖంగా టీనీరు సేవిస్తున్నది. ఆమె తాతా మనమరాళ్ళని చూచి, "ఇందాక మిమ్మల్ని ఆబొమ్మలాట దగ్గర చూసినట్లున్నాను- మీరే కదూ?" అని అడిగింది. నెల్ వణికిపోతూ "ఔనండీ, మేమే అప్పుడు అక్కడ ఉన్నాం" అని చెప్పింది. ఆమె నెల్ వంకవిస్మయంతో చూసింది. "పట్నం చేరుకోవాలంటే ఇంకా ఎంత దూరంపోవలసి ఉన్నదమ్మా" అని నెల్ ఆమెను అడిగింది.

"ఎనిమిది మైళ్ళు"

"అమ్మో! ఎనిమిది మైళ్ళే! అప్పుడే సాయంత్రం అయిపోయింది." ఈమాటలు అంటూనే నెల్ తాత చేయిపట్టుకొని మెల్లిగా నడక సాగించింది. బండిలో కూర్చున్న ఆమె వారివంక జాలిగా చూసి వారిని వెనక్కి పిలిచింది. "ఏమమ్మాయి! పాపం! మీకు ఆకలిగా లేదూ? ఏమైనా తింటారా?"

"ఆకలికూడా ఏమంతా బాధ పెట్టటంలేదు. కాని చాలాదూరం నుంచినడిచి రావటంవలన చాలా అలిసిపోయినాము. ఇంకా ఎనిమిది మైళ్ళుపోవాలి" అన్నది నెల్.

ఆమె తాను తినగా మిగిలిన పదార్థాలను వారికిఇచ్చింది. ఆకలితో నకనకలాడుతున్న వారిద్దరూ ఒక్కక్షణమైనా జాగుచెయ్యకుండా వాటిని పుచ్చుకొని ఆప్యాయంగా భుజించారు. ఆమెనెంతో ప్రస్తుతించారు.

"మీరెక్కడికి పోవాలి?"

"దాపునఉన్న పట్నానికి"

"ఏమిటిమీకు అక్కడపని?" నెల్ దీనికి ఏం సమాధానం చెప్పగలదు? "నాకు తెలియదు" అన్నది.

ఆమె చాలా ఆశ్చర్యపోయింది. "బాగుంది. మీకు అక్కడ పనేమిటో తెలియదూ? తెలియకుండా నేవెళ్తున్నారా? చాలాతమాషాగా ఉందినరే! ఏమయితేనేం చాలా అలిసిపోయిఉన్నారు కాబట్టి బండిఎక్కండి. కలిసివెళ్దాం" అన్నదామె. నెల్, తాత ఆ ఆదరణకి ఎంతో సంతోషం పొందారు.

బండి మెల్లగా సాగుతున్నది. ప్రశాంతమైన ఆసాయం సమయాన చల్లనిగాలి వీస్తున్నది. తాతనిద్రకు పడ్డాడు. ఆమె కనికరంతో అతని వంకచూసి చిరునవ్వు నవ్వింది. నెల్ తో సంభాషణకు దిగింది. నెల్ ఆమె మంచితనానికి ముగ్ధురాలైంది. ఆమెకుకూడా నెల్ పై ఎంతో ఆపేక్షకలిగింది. "నాపేరు జార్లీ నివుని నేకుంటావు జార్లీల మైనపు బొమ్మల ప్రదర్శనం ఎంతో ప్రఖ్యాతమైనది. పెద్ద పెద్దవాళ్లు.

శ్రీమదాంధ్ర మహాభారతము
ఉద్యోగపర్వము
వెల రూ. 1-0-0
ఆంధ్ర గ్రంథమాల,
మద్రాసు-1.

నవ్వుల పాప
—ఫొటో: వీరపనేని కుటుంబరావు,
మద్రాసు.



ప్రభువులుకూడా వస్తుంటారు ఆ ప్రదర్శనానికి. నేనుదానికి యజమానురాలిని. మనంపోతున్న పట్టణంలోనే రేపు ప్రదర్శనం ఏర్పాటు చేశాం. దానికి సంబంధించిన సామగ్రియావత్తూ రెండుపెద్ద శకటాలలో పంపివేశాను. నువ్వు రేపు చూద్దువుగాని."

చాలాసేపు వాళ్లు ముచ్చటించుకున్నారు. నిద్రపోతున్న తాతను లేపి ఆమెముగ్గురికి భోజనం అమర్చింది. తాత భోజనం కాగానే మళ్ళీ నిద్రపోయినాడు. జార్లీ నెల్‌ని పరీక్షగాచూస్తూ "మీరు పెద్దధనవంతులలాగాను కనిపించటలేదు. కష్టపడి, పని చేసి జీవించే వారిలాగాను కనిపించటం లేదు." అన్నది.

ఈమాటలు వినేసరికి నెల్ తత్తరపడింది. "మేము ముష్టివాళ్ళకంటె కాస్త మెరుగైనస్థితిలో ఉన్నాం" అని చెప్పింది. జార్లీ ఒక్కక్షణం ఆలోచించింది.

"నాదగ్గరనీకు ఏదైనాపని కుదిరిస్తా! మా ప్రదర్శనంలో బొమ్మల దగ్గరఉండి వాటినివర్ణించి చెప్పే పని నీకుఇస్తాను. అప్పుడు నువ్వు నాతో ఉండవచ్చు. కొంత సంపాదించుకోవటానికి కూడా వీలవుతుందికదా!"

నెల్ సంభ్రమాశ్చర్యాలతో ఆమెకు తన కృతజ్ఞత తెలిపింది. "మీరు చెప్పినట్లు నేను మీతో ఉంటే మరి మా తాత సంగతి ఏమవుతుంది?

ఆమె మళ్ళీఆలోచించి "పోనీ మీ తాతకి కూడా ఒక చిన్నపని ఇస్తాను. నామైనపుబొమ్మలు జాగ్రత్త చేస్తూంటాడు. ఏదోకొద్దిగా అతనికీ జీతమిస్తాను. మీరిద్దరికీ ఉచితంగా భోజనం ఏర్పాటుచేస్తాను."

నెల్ ఆనందానికి మేర లేకపోయింది వెంటనే తన ఆమోదం తెలిపింది. అర్థరాత్రివేళకి బండి పట్టణంచేరింది.

బండిఆగగానే ముందు నెల్ దిగింది. పుచ్చపువ్వులా వెన్నల విరియకాస్తున్నది. ఆ వెన్నెలలో కొంత సేపునడిస్తే బాగుంటుందని ఆమెకి అనిపించింది. ఎదురుగా ఒక పెద్ద ఆర్చీకనిపించింది. అదేదో చూద్దామని నెల్ ఆవంకకు పోయింది. ఆ ఆర్చీనీడలో ఒకవ్యక్తి అటునుంచి రావటం నెల్ చూసింది. ఆవ్యక్తినిచూడగానే నెల్‌కి ముచ్చెమటలుపోసినాయి. నిర్జీవ ప్రతిమలా జారిపోయింది. 'రక్షించ' మనిఅరుద్దామనుకున్నది కాని గొంతుపెకల లేదు ఆవ్యక్తి క్విల్ప్. క్విల్ప్ తమ కోసమే వెతుకుతున్నాడని నెల్ అర్థం చేసుకున్నది. అయితే అంతలోకే అతడు ఎట్లో వెళ్ళి మాయమైపోయినాడు. ఆమె తేరుకొని గబగబవచ్చి బండిఎక్కింది. అతడు పోర్టరుతో తాను పన్నెండు గంటలకి బయలుదేరిపోయే కోచ్‌లో లండన్‌పోతున్నట్లు చెప్పటం నెల్ విన్నది. క్విల్ప్‌మాత్రం నెల్‌ను చూడలేదు.

బండిఎక్కి నెల్ కొంచెంసేపు ప్రశాంతంగా నిద్రపోవాలని ప్రయత్నించింది కాని నిద్రపట్టలేదు. కళ్లుమూస్తేక్విల్ప్ కనిపిస్తున్నాడు.

ఆ మరునటిరోజు జార్లీ మైనపు బొమ్మల ప్రదర్శనం ఆరంభమైంది. నెల్‌కి తాతకి, తీరుబడిలేదు. బంగీ

లన్నీ విప్పి మైనపుబొమ్మలను తీర్చి దిద్దటంలో నిమగ్నులయినారు. బొమ్మలన్నీ సర్దినతరవాత జార్లీ ఆబొమ్మలన్నిటిని గురించి నెల్ కి వివరించిచెప్పింది. వచ్చే ప్రేక్షకులకి నెల్ ఏవిధంగా బొమ్మలనుగురించి చెప్పాలో ఆమె నేర్పింది నెల్ చప్పున అవగాహన చేసుకున్నది

ఆరోజు ప్రదర్శనలో నెల్ చాలా మందిని ఆకర్షించింది. ఇంచుమించుగా ప్రేక్షకులందరు ఆమెను చూసి ముగ్ధులయినారు. కొంతమంది నెల్ అందంచూసి "విశాలాక్షి" అనిపిలిచేవారు. ఇంతమందిని ఆకర్షించిననెల్ తనకు సహాయకారిగా లభించినందుకు జార్లీ చాలా సంతోషించింది. ప్రదర్శనకి వచ్చినవారు కొందరు నెల్ కి ధనరూపంలో బహుమతులు ఇచ్చేవారు. జార్లీ ఆడబ్బును నెల్ కే ఇచ్చివేసింది. నెల్ ని తాను విడిపెట్టరాదనీ, నిర్ధారణ చేసుకున్నది. తాను ఆమె సౌకర్యానికి చేయవలసిన ఏర్పాట్లన్నీ చేసింది.

కాలం గడుస్తున్నకొద్దీ నెల్ గతంలో తాము అనుభవించిన కష్టాలను మరచిపోసాగింది. చాలా డబ్బు కూడబెట్టగలిగింది.

ఒక సెలవురోజున సాయంత్రం పూట నెల్ తాతను తీసుకొని షికారు బయలుదేరింది. ఎంతో ఆహ్లాదకరంగా ఉండటంవలన వారిద్దరూ అనుకొన్న దానికంటే ఎక్కువదూరం నడిచారు. ఇంటికి మళ్ళేవేళకి వర్షం ప్రారంభమైంది. ఇద్దరూ పాపం తడిసి ముద్దయినారు. దారిలో ఒకచోట వారికొక సత్రం కనిపించింది, ఆ సత్రంలోకి వెళ్లారు. యజమాని ఎదురువచ్చి వారినిలోపలికి తీసుకొనివెళ్లాడు. వాళ్ళగుడ్డలు ఆరబెట్టుకొని చలికాచుకుంటూ ఉండగా ప్రక్కగదినుంచి ఏవో

మాటలు వినిపించినాయి. తాత జాగ్రత్తగా ఆలకించాడు. "వింటూన్నావా?" అన్నాడు. అతనిముఖం జేగురించింది. పిచ్చి వాడిలాగా విత్తరచూపులు చూడసాగాడు.

"ఔను, ఏవోమాటలు వినిపిస్తున్నాయి. కానినాకు తెలియటంలేదు ఏమిటిసంగతి?" అని అడిగింది నెల్.

"అబ్బే ఏమీ లేదు. వాళ్లు అక్కడ చీట్లాట ఆడు తున్నారు. ఏదీ నీదగ్గర కొంచెం డబ్బుఉండాలి కదూ! ఇలాతే! నేనూ వెళ్లి ఆడి వస్తాను."

నెల్ భయభ్రాంతురాలయింది. "తాతా! ఆ డబ్బు ఖర్చుచేస్తే ఎలాగా? మనఇద్దరం సుఖంగా బతుకుతున్నాం, ఆ డబ్బుకాస్తా ఉండనీ! ఇదే విధంగా లోగడ ఎంతో నష్టపడ్డాం; కష్టపడ్డాం. ఇప్పుడయినా జాగ్రత్తగా ఉండకపోతేఎలా?" నెల్ భోరునఏడవసాగింది. తాత లెక్కపెట్టలేదు. "ఇవ్వముందు. నీదగ్గర ఉన్నదంతా తక్షణం ఇలాఇచ్చేసేయి" అని గర్జించాడు.

నెల్ ఏడుస్తూనేఅన్నది.

"మాఅమ్మని అతిప్రేమగా పెంచావు. ఆమె బ్రతికివుంటే నిన్ను ఆడనిచ్చేదేనా? నా మాటవిని ఈ చీట్లాటమానేయి. వర్షంకురిస్తేకురుస్తుంది. లే, పోదాంఇక్కడినుండి. ఈ దరిద్రపుగొట్టు చోటునుంచి దూరంగాపోదాం. రా! మనదురదృష్టం, ఇక్కడికి తరుముకొని వచ్చింది మనల్ని."

"ఇక్కడినుంచి పోదామని గోలపెట్టకు. ఇది దరిద్రపు గొట్టుచోటు అనా అన్నావు, కాదు. మనఅదృష్టం బాగుండబట్టే ఇక్కడికి వచ్చాము ఆ భగవంతుడు దయామయుడు. లోగడపోయిన డబ్బంతా మళ్లీ సంపాదించటానికే ఇక్కడికి పంపించాడు. నేను గెల్చిందంతా నీకేఇస్తాను. నాకెందుకే పిచ్చితల్లీ. నేనుమాత్రం డబ్బు ఏంచేసుకుంటాను నీకోసంకాకపోతే నాకు వేరే పనేముంది. నీకు తెలియదూ? ఆ డబ్బుఇచ్చేయి"

పాపం! నెల్ చిన్నపిల్ల. ఏమిచేయగలదు. డబ్బుతో నిండుగా ఉన్నసంచి తాత చేతిలోపెట్టింది. తాతఅపరిమితమైన సంతోషంతో ఆసంచి చేతపట్టుకొనివెళ్ళి ఆటలో దిగాడు. నెల్ గుండెబిగపట్టుకొని అతనివెనకాలే వెళ్ళింది.

వర్షంమూడు గంటలసేపు కొట్టికురిసింది. అర్థరాత్రివేళకి వెలసింది. అప్పటిదాకా చీట్లాటజోరుగా నేసాగింది వాన వెలియడంతో ఆటముగిసింది నెల్ తాతపక్కన కూర్చొని ఆటంతా చూసింది. ఒక్కదమ్మిడి లేకుండా సంచి ఖాళీ అయింది.

ఆ అర్థరాత్రి సమయంలో ఎక్కడికిపోగలరు. తెల్లవారేదాకా అక్కడే వుండవలసివచ్చింది.

"ఇక్కడ ఉంటే డబ్బు చెల్లించాలి. మనదగ్గిర ఒక్కపైసాకూడా లేదయ్యే. ఎలా?" అన్నాడుతాత.

"నాదగ్గిర ఏదోకొద్దిగా ఉన్నదితే. ఇక్కడేఉందాం." అన్నది నెల్.

"అయ్యో! పిచ్చిపిల్ల! ఆమాట చెప్పావుకాదేంనాకు. ఆ కాస్త కూడా నాకుఇచ్చిఉంటే పోయినదంతా మళ్లీగెల్చిఉందునే" అనితాత వాపోయినాడు. తాతకి పూర్వపు పిచ్చి మళ్ళీప్రకోపించినందుకు నెల్ కుంగిపోయింది.

నెల్ సరాసరి యజమాని వద్దకి పోయి తాను ఆనాడు పుష్పగుచ్ఛాన్ని అమ్మగావచ్చిన ఆచిన్న నాణెం— సహృదయుడైన ఉపాధ్యాయుడికి ఇవ్వగా అతడుతీసుకోటానికి నిరాకరించిన ఆ నాణెం - అతనికిచ్చింది. ఆ యజమాని మిగిలిన చిల్లర నెల్ కి ఇచ్చాడు.

అచిల్లర తీసుకొని ఆమె తనకిచ్చిన పడకగది ప్రవేశించింది ప్రవేశిస్తూఉండగా ఆమెకు వరండాలో ఏదో ఒక నీడ కనిపించింది. నెల్ కి అది దొంగో, దయ్యమో తెలియక భయంవేసింది. గబగబ పక్కమీదికిచేరి దుప్పటి ముసుగు పెట్టుకున్నది. ఆనీడ నెల్ గదిలోకి ప్రవేశించింది. ఒకటి రెండునిమిషాల తరువాత ఆవ్యక్తి బయటికి వెళ్లిపోతున్నట్లు అనిపించి నెల్ లేచింది ధైర్యాన్ని కూడ దీసుకొని నెల్ ఆవ్యక్తిని వెంబడించింది ఈసారి ఆవ్యక్తి తాతకిచ్చిన పడకగదిలోకి

వెళ్లాడు. నెల్‌కి మహాభయం వేసింది. ఈనీడ వ్యక్తిఎవరో తాతని చంపివేస్తాడేమో! తలుపుప్రక్కన నిలబడి లోపలికి తొంగిచూసింది.

గదిలో దీపం మినుకు మినుకు మంటున్నది. అక్కడ తాత కూర్చొని చిల్లరడబ్బులు లెక్క పెడుతున్నాడు. నెల్‌కి అంతా అర్థమైంది. తాత తనను వెంబడించి, తనగదిలో ప్రవేశించి తలగడక్రింద దాచిన చిల్లరడబ్బులు దొంగిలించాడు. ఆడబ్బుతో చీట్లాడి పోయినడబ్బు సంపాదించవచ్చునని తాతఆశ. తానంటే తాతకి ఎంతఇష్టం. తనని ధనవంతురాలు చెయ్యాలనే ఉద్దేశ్యంతో, దొంగ అయి తననే దోచుకున్నాడు.

తన తాత మళ్లీఇలా మారిపోయినందుకు నెల్ చాలావిచారించింది. తనగదికి తిరిగివచ్చింది. కాని నిద్ర పట్టలేదు.

ఉదయాన్నే వెళ్ళి, తాతను లేపింది. ఇద్దరూకలిసి జార్లీవసతి గృహానికి బయలుదేరారు.

దారిలో నెల్ నెమ్మదిగా తాతనుఅడిగింది "ఏమితాతా! ఆ సత్రంలో ఉన్నవాళ్ళందరూ మర్యాదస్థులే నంటావా?"

"ఏమిటి" ఎవరిసంగతి?"

"రాత్రి నాదిండుక్రింద నుంచి ఎవరో డబ్బులుకొట్టేశారు. వాళ్లంతానుంచి, మర్యాద లేనివారు." ఇలా అంటూ నెల్ తాతకేసి ఆశగా చూసింది. అతడు తనతప్పు ఒప్పుకుంటాడని నెల్ అనుకున్నది. అలా ఒప్పుకుంటే నెల్ ఎంతోసంతోషించేది. తాత మౌనంగా ఊరుకున్నాడు. తప్పుచేసినవాడి మౌనం అది!

నెల్, తాత ఇంటికి తిరిగివచ్చినందుకు జార్లీ సంతోషించింది. రాత్రి ఇంటికిరాలేదని కోపించక పోగా నెల్‌ని ఇలా ఆదరించింది:

"పాపం! రాత్రి వర్షంలో తడిసి పోలేదుకదా! మంచి పనిచేశావు. ఆసత్రంలో అక్కడ ఆగటమే మంచిదైంది. అలాగే తడుస్తూవచ్చినట్లయితే, ఈ పాటికి జ్వరం వచ్చేది"

నెల్ ఆమెప్రేమకు ఎంతో ఆనందపడింది. ఆమెయందు మరింత గౌరవం కలిగింది. ద్విగుణీకృతోత్సాహంతో పనిచెయ్యటం ఆరంభించింది. జార్లీకూడా నెల్‌ని మరింత ప్రేమించసాగింది.

నెల్ చాలాడబ్బు గడిస్తున్నది. అయితేనేమి? ఏరోజు వచ్చినడబ్బు ఆరోజు సాయంత్రం తీసుకొని తాత జూదం ఆడుతూనేఉన్నాడు: తెల్లవారేసరికి ఆడబ్బుకాస్తా పోగొట్టుకొని, నిద్రలేక చింతనిప్పులలా ఎర్రబడిన కళ్లతో కొంప చేరుతున్నాడు.

ఇలా కొన్నిరోజులు గడిచినాయి. నెల్ ఒకనాడు తాతని పిలిచినచ్చచెప్పింది. "తాతా! లండన్ నించి మనంఎందుకు పారిపోయి రావలసివచ్చింది? వచ్చేసిన తరువాత జార్లీ దయవలన మనం సుఖంగా, శాంతంగా బ్రతుకుతున్నాం. మళ్లీ నీవు ఇలా చేస్తున్నావు ఈకష్టాలు మనకుగట్టెక్కటం ఎన్నటికి? నీవు కొంచెం ఓపికపట్టు నేను సంపాదిస్తున్న డబ్బు నీవు చీట్లాటలో తగలబెట్టకుండా ఉంచు. కొద్దికాలంలో నేనూ కోరినంత ధనవంతురాలిని అవుతాను. దర్జాగా, హుందాగా, సవారీబండిలో తిరుగుతాం. నీవు నన్నుఎలా వుండగా చూడాలనుకున్నావో, అలా చూద్దువుగాని."

"గరిమనాభీ — ఆధారపీఠ వైశాల్యమూ" రెంటికీ గల సంబంధం విపులంగా చెప్పి, సైన్సుటీచరు విశాలనో ప్రశ్న వేశాడు.

"అమ్మాయీ! నేనువంటి కాలిమీద నిలబడ్డాను. గోపీ నన్నుతోశాడు వెంటనే పడిపోయాను. ఎందుకో చెప్ప గలవా?"

అంతవరకూ సుశీలతో చుక్కలఆట ఆడుతున్న విశాల ముక్కలాంటి గోపివంక చీపురుపుల్లలాంటి సైన్సుటీచరువంకా చూసి వెంటనేఅన్నది.

"యస్ టీచర్! వంట్లో ఓపిక లేకండి."

ఎ. కేశవరావు.

నెల్ చెప్పినదంతా తాత ప్రశాంతంగావిన్నాడు. తనమనమరాలు ఎంత తెలివైనది! కష్టాలన్నిటిని అతిసహనంతో. ఎంతో నేర్పుతో భరించుతూ వస్తున్నది? తాతఅంతా ఒప్పుకున్నాడు. కాని జూదంమీద వ్యామోహం, పోయినదాన్ని తిరిగి సంపాదించాలనేకోరిక అతనిమనస్సును చీకాకుపెట్టినాయి కొంతసేపు జూదానికి వెళ్లాలని, కొంతసేపు వెళ్ళరాదని మనస్సు కొట్టుకులాడింది తాత చింతాక్రాంతుడై ఉన్నాడు.

(ఇంకా ఉంది)

ముగ్గురు వింత వ్యక్తులు

అముజాల రామారావు

పూర్వము ఒకరాజు వుండేవాడు. ఆరాజుకు ఒక పుత్రుడు వున్నాడు. ఒకరోజున రాజు తన పుత్రునిపిలచి "నాయనా నేను చాలా ముసలివాడి నయ్యాను. ఇంక ఎంతోకాలము బ్రతకను. నేను మరణించులోపునే నీవుపెండ్లి చేసుకోవలె"నని చెప్పాడు. "నాన్నగారూ మీరు చెప్పినట్లే చేసుకొంటాను. కాని నేను ఎవరిని పెండ్లి చేసుకోవలెనో మాత్రము నాకు తెలియ"దని యువరాజు జవాబు ఇచ్చాడు. అప్పుడు రాజు ఒక బంగారు తాళము చెవిని యువరాజు కిచ్చి "నీవు మేడ పైఅంతస్థులోనికి పోయి అచ్చటనున్న అన్నిచిత్రములుచూచి ఏది నచ్చినదో చెప్పు" అన్నాడు.

యువరాజు ఆలస్యము చేయకుండా మేడ మీదకు వెళ్లి బంగారు తాళను చెవితో తలుపు తెరచి లోనికి ప్రవేశించాడు. అది యొక పెద్ద వరండా. ఆ వరండా అంతా ఆకాశమువలె నీలిరంగుతోనూ, మధ్య మధ్య వెండి నక్షత్రములతో మెరుస్తున్నది నేల మీద పచ్చని రత్నకంబళ్లు ఉన్నాయి. ఆగదిగోడకు పన్నెండు పెద్దకిటికీలున్నాయి ఒక్కొక్క కిటికీలో ఒక్కొక్క రాకుమార్తె మాయచిత్రమున్నది. ఆ చిత్రములు బంగారు చట్రములో కట్టబడి వున్నాయి చక్కని రంగులతో ఆచిత్రములు వేయబడినవి. ఆమాయచిత్రములు ఒకదానికంటె మరొకటి అందముగా వున్నాయి. యువరాజు ఆశ్చర్యముతో చూస్తుండగా ఆచిత్రములలోని రాకుమార్తెలు కదలుతూ, చిరునవ్వు నవ్వారు. ఆ పన్నెండు కిటికీలలో ఒకదానికి తెల్లని తెర కట్టబడివుంది. ఆతెర వెనుక ఏమి వున్నదో చూడవలెనని యువరాజు తెరను ప్రక్కకు లాగాడు. అచ్చట తెల్లని దుస్తులతో, వజ్రవైడూర్యముల కిరీటము ధరించినయువతి చిత్రమున్నది. ఆమె అందరికంటె అందమైన యువతి. కాని ఆమె ముఖములో ఏదో విచారము కనిపించింది. యువరాజు ఆచిత్రమునే ఆశ్చర్యముతో చూస్తూ "ఈమెను తప్ప తదితరులనువివాహమాడను" అనునంతలో ఆయువతి గులాబి పువ్వు వికసించినట్లు నవ్వింది అప్పుడు మిగిలిన చిత్రములన్నియు మాయమయ్యాయి యువరాజు తండ్రివద్దకువచ్చి తను చూచిన చిత్రముగురించి చెప్పాడు. రాజు మూర్ఛపోయి కొద్దిసేపట్లో తేరుకొని "నీవు మంచిఆమెను ఎంచుకొనలేదు. ఇప్పుడు ఆమె ఒకగొప్ప మంత్రగాని చెఱలో బంధింపబడి వున్నది ఆమెను విడిపించుటకు వెళ్ళినవారెవరు ఇంతవరకు తిరిగి రాలేదు. కాని చేయవలసిందేదో చేయక తప్పదు. నీవు వెళ్ళి నీఅదృష్టముకూడా పరీక్షించు. సురక్షితముగా ఇంటికి తిరిగిరా" అని దీవించాడు.

2

అతడుతండ్రివద్ద శెలవు తీసుకొని గుర్రముపై రాకుమార్తెను వెదకుతూ బయలుదేరాడు. అట్లు పోగా పోగా ఒకదట్టమైన అడవి వచ్చింది. ఏవైపునకు పోవలెనో అనిచూస్తుండగా వెనుకనుండి 'ఆగు' మని ఎవరో కేకవేశారు. ఒక పొడుగైనమనుష్యుడు తనవైపుకే వస్తున్నాడు. ఆపొడుగుమనిషి యువరాజునుచూచి "నన్ను మీ నౌఖరుగా పెట్టుకోండి. మీకు చాలా లాభము చేకూరుతుంది"అన్నాడు. "నీవు ఎవరవు. ఏమిచేయగలవని" యువరాజు అడిగాడు. "నేను పొడుగు కాళ్లవాడిని నేను ఎంత ఎత్తు అయినా పెరుగగలను. అదిగో ఆఎత్తుచెట్టు చూడండి. దాని మీదవున్న పిట్టగూడును చెట్టు ఎక్కకుండా క్రిందికి తెస్తాను" అన్నాడు.

పొడుగుకాళ్లవాడు ఆచెట్టుఅంత ఎత్తుపెరిగి ఆగూడు తెచ్చి యువరాజు కిచ్చాడు. "నేను ఈ అడవి నుండి బయటపడితే బాగుండును కాని ఈగూడువలన నాకేమి లాభము" అని యువరాజు అన్నాడు "అది ఎంత భాగ్యము, అలాగునే చేయవచ్చును" అని అతడు అడవిలోవున్న చెట్లన్నిటి

లోను ఎత్తైన చెట్టుకంటె మూడు రెట్లుగా పెరిగాడు. చుట్టూచూచి తన మామూలు ఎత్తులోనికిదిగి ఒక దగ్గిరదారిన తీసుకొని వెళ్లాడు. కొద్దిసేపట్లో వారిద్దరు అడవి అవతలకు చేరారు. అంతలో పొడుగుమనిషి "అదుగో అటుపోవుచున్న వాడు నాస్నేహితుడు. వానిని కూడా మీనౌకరుగా పెట్టుకోండి. వాడుకూడ మీకు చాలా వుపయోగ పడతాడు" అన్నాడు

"వానిని ఇచ్చటకు పిలు. వాడు నాకేమి వుపకారము చేస్తాడో చూస్తానని యువరాజన్నాడు. కొద్దిసేపట్లో వానిని యువరాజు వద్దకు పొడుగుకాళ్లవాడు తీసుకొచ్చాడు.

ఆ రెండవ వ్యక్తి పొట్టిగా, లావుగా, పెద్ద పొట్టగలిగివున్నాడు.

"నీవు ఎవరవు, ఏమిపని చేయగల"వని యువరాజు రెండవ వ్యక్తిని అడిగాడు. "వేళాకోళముగా నన్ను పెద్దపొట్ట వాడంటారు. నేను ఎంత వెడల్పుగానైన పెరగగలను. మీరు త్వరగా అడవిలోకి పారిపోండి" అంటూ అడ్డంగాపెరిగిపోజొచ్చాడు. యువరాజునకిదేమి అర్థంకాలేదు. పొడుగుమనిషి ఖంగారు పడుతూ యువరాజును తీసుకొనిఅడవిలోనికి పరుగెత్తాడు. ఇంతలో పెద్ద పొట్ట మనిషి అడ్డముగా పెరుగుతూచెట్లు, కొండలు తోసివేస్తూ పెద్దపర్వతము వలె దొర్లుతూ అంతా కప్పివేశాడు. కొద్దిసేపట్లో పెద్ద పొట్ట మామూలుగా మారింది. "నీవు నా కూడా రా" అని యువరాజన్నాడు.

వారు ముగ్గురు కొంతదూరము వెళ్లేసరికి ఒకపెద్ద మైదానము వచ్చింది. అచ్చట ఒకమనిషి తన కండ్లకు గంతలు కట్టుకొని కనిపించాడు. "అయ్యా అతను మా మూడవ స్నేహితుడు. వానిని కూడా మీనౌకరుగా పెట్టుకోండి. మీకుచాలా వుపయోగ పడతాడని" పొడుగుమనిషి అన్నాడు. "నీవు ఎవరవు నీవు ఎందుచేత కండ్లకు గంతలు కట్టుకున్నావని యువరాజడిగాడు. "నా కండ్లకు గంతలు వుంటేనే చాలా బాగుగా చూడగలను. నాకండ్లకు గంతలు లేకుండా ఏవస్తువునైనా తీక్షణంగా చూస్తే ఆవస్తువు తగులబడిపోతుంది. అట్లు తగలబడని వస్తువులు ముక్కలు, ముక్కలుగా బ్రద్దలైపోతాయి. అందుచే నన్ను తీక్ష్ణదృష్టి అంటారు. నాకు దివ్యదృష్టికూడా వుంది" అంటూ అతడు ఒక పెద్దరాయివైపు తిరిగి "ఇందులో బంగారంవుంది" అని అంటూ కండ్లగంతలు విప్పిఆరాయివైపు తీక్షణంగా చూశాడు. ఆరాయి కొద్దిసేపట్లో ముక్కలుగా బ్రద్దలై యిసుకగా మారింది. ఆఇసుకఅంతా బంగారము వలె మెరుస్తోంది. దివ్యదృష్టి ఆఇసుక కొంత యువరాజు వద్దకు తెచ్చాడు. అదిఅసలైనబంగారము. "ఓ! మానవమాత్రుడెవడు నీవంటి మనిషిని డబ్బుతో కొనలేడు. అయితే మాంత్రికుని మాయ భవనం ఎక్కడుంది ? ఇచ్చటకు ఎంత దూరములో వుంది ? అక్కడ ఇప్పుడు ఏమి జరుగుతున్నదో చెప్ప"మని దివ్యదృష్టిని యువరాజు అడిగాడు. "మీరు ఈ గుర్రముమీద అయితే ఒక సంవత్సరములోకూడా అక్కడకు చేరలేరనుకుంటా. మాముగ్గురి ఉపకారముతో ఈరోజునే మీరచ్చటకు చేరగలరు. రాజకుమార్తె ఒక ఎత్తైన భవనములో కూర్చొని వుంది. ఆమెను ఒక మాంత్రికుడు కావలా కాస్తున్నాడు" అని చెప్పాడు. రాకుమారుడు "మీరందరు ఆమెను విడిపించుటకు నాకు సహాయము చేయవలె" నన్నాడు. వారు ముగ్గురు అందుకు అంగీకరించారు. తరవాత బయలుదేరి దారిలో పెద్దపెద్ద కొండలు,దట్టమైన అడవులుదాటుతూ సాయంత్రం అయ్యేలోపున వారు మాంత్రికుని భవనం చూశారు. చీకటిపడు సమయములో వారు ఒకఅగడ్త దాటి మాంత్రికుని భవనం చేరారు.

3

ఆభవనములో, ఎందరోరాజులు శిలలుగా మారివుండటం చూచారు. అన్నిగదులు దాటి భోజనశాలలో ప్రవేశించారు. ఆగదిఅంతా ప్రకాశవంతముగా వున్నది అచ్చట ఒక మేజాబల్ల మీద నలుగురు తినుటకు సరిపడిన తినుబండారాలు, సారాయిమొదలగునవి వున్నాయి. అచ్చటకు ఎవరైనా వచ్చెదరేమోఅని వారు చాలాసేపు నిరీక్షించారు. ఎవరు రాకపోవుటచే ఎవరికి ఇష్టమైనది వారు తిన్నారు. ఇంతలో అకస్మాతుగా అచ్చట ఒక తలుపు తెరవబడి ఒకముసలి మాంత్రికుడు నల్లని దుస్తులలో అచ్చటకు వచ్చాడు. వాని నడుముచుట్టూ మూడు ఇనుపగొలుసులు చుట్టబడివున్నాయి. తనతో ఒక అందమైన యువతినికూడా తీసుకువచ్చాడు. ఆమె తెల్లనిదుస్తులు ధరించివుంది. వజ్రకిరీటము ధరించినది. ముఖము చాలా విచారముగా

★ ముగ్గురు వింతవ్యక్తులు ★

వున్నది. యువరాజు ఆమెను గురించి ఆమెతో మాట్లాడుటకు ముందుకు నడిచాడు. యువరాజు ఏమీ చెప్పకముందే "నీవు ఇచ్చటకు ఎందుకు వచ్చావో తెలుసు. చాలామంచిది. నీవుఆమెను తీసుకు వెళ్ళగలిగితే తీసుకువెళ్లు. రాకుమార్తెను నీగదిలో మూడు రాత్రులు వుంచుతాను. ఆమె నీ వద్దనుంచి మాయమవకుండా మూడు రాత్రులు ఆమెను కాపలాకాయి. ఆమె మాయమైపోతే నీవు, నీ నౌకర్లు శిలలుగా మారతారు" అని చెబుతూ రాకుమార్తెను అగదిలో వదలి మాంత్రికుడు మాయమయ్యాడు.

ఆరాకుమార్తె చాలా అందకత్తె. యువరాజు ఆమెతో మాట్లాడి కొన్ని ప్రశ్నలువేశాడు. కాని ఆమె దేనికీ జవాబుఇవ్వలేదు. పాలరాతి బొమ్మవలెకూర్చున్నది. యువరాజు ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. ఆమె అగదినుంచి మాయమవకుండా యువరాజు కాపలా కాయాలనుకున్నాడు. అందుచే ఆరాత్రి నిద్రపోకూడదని యువరాజు నిశ్చయించుకొన్నాడు. పొడుగుకాళ్లవాడు అగదిలో ఎత్తుగాపెరిగాడు. ఒకఎలుకైనను ఆగదిలోకి వచ్చుటకుగాని, పోవుటకుగాని వీలు లేనట్లుగా తలుపుకు దట్టముగా పెద్దపొట్టవాడు ఉన్నాడు. ఇకదివ్య దృష్టిమాంత్రికుడు వచ్చినతలుపు వైపేచూస్తూ కావలాకాస్తున్నాడు. కొద్దిసేపటికి వారు కునుకుపాట్లు పడజొచ్చారు. ఆరాత్రంతా వారంతకు నిద్రపోయారు.

తెల్లవారిన తరవాత యువరాజు ముందు మేల్కొన్నాడు. రాకుమార్తె ఆగదిలో లేకపోవుట యువరాజుచూశాడు. తరువాత ముగ్గురు నౌకర్లను మేల్కొలిపి ఏమిచేయవలెనని అడిగాడు. "భయపడకండి" అంటూ దివ్యదృష్టి కిటికీగుండా బయటకు చూశాడు. "నేను రాకుమార్తెను చూడగలిగాను, ఇక్కడకు వందమైళ్లదూరములో ఒక దట్టమైన అడవివుంది ఆ అడవి మధ్యలో ఒకసింధూరపు చెట్టువుంది. ఆ చెట్టు చివరకొమ్మకు ఒక సిందూరపు కాయవున్నది. ఆ కాయే రాకుమార్తె" అని దివ్యదృష్టి చెప్పాడు. తక్షణమే పొడుగుకాళ్ళవాడు దివ్యదృష్టిని భుజముపై నెక్కించుకొని చాలాఎత్తుగా పెరిగాడు. దివ్యదృష్టి దారిచూపించగా అడుగుకు పదిమైళ్ళచొప్పున నడచాడు. అడవిలో చెట్టువద్దకు వెళ్లి సిందూరపుకాయ యువరాజువద్దకు తెచ్చుటకు ఎంతో కాలము పట్టలేదు. పొడుగుకాళ్లవాడు సిందూరపుకాయ యువరాజునకిచ్చి నేలపై కొట్టమన్నాడు. యువరాజుకు అట్లు చేయగానే రాకుమార్తె అతని ప్రక్కన ప్రత్యక్షమైంది. సూర్యోదయము అప్పుడేఅయింది. మాంత్రికుడు ఆగదిలో ప్రవేశించాడు, రాకుమార్తె ఆగదిలో వుండుట చూచి మాంత్రికుడు కోపముపట్టలేకపోయాడు. అతని నడుముకు చుట్టబడివున్న ఇనుపగొలుసులలో ఒకటి ముక్కలై క్రిందపడింది. రాకుమార్తెను తన వెంటతీసుకొని మాంత్రికుడు వెళ్ళిపోయి సాయంత్రమవగానే తిరిగి తీసికొనివచ్చి ఆ గదిలోవదలి వెళ్ళిపోయాడు. రాకుమార్తెను కాపలాకాయుటకు వారంద[రు] ఎంత ప్రయత్నించి నప్పటికీ నిదురపోయారు. తెల్లవారాక రాకుమార్తె మాయమవుట చూచారు. దివ్యదృష్టి "అదిగో రెండువందల మైళ్లదూరములో ఒక పెద్దకొండ వుంది. ఆకొండలో రాయివుంది. ఆరాయిలో ఒకవజ్రముంది. ఆవజ్రమే మనరాణి" అనిచెప్పాడు. ఇదివరకువలె పొడుగుకాళ్లు దివ్యదృష్టిని భుజముపై నెక్కించుకొని పెద్దగా పెరిగి అడుగునకు ఇరువది మైళ్ల చొప్పున వెళ్లాడు. దివ్యదృష్టి ఆకొండవైపు తీక్షణముగా చూడగా వెంటనే ఆ కొండ బద్దలై ముక్కలు ముక్కలైంది. అందులో వజ్రము తీసుకొని వారు యువరాజు వద్దకువచ్చారు. ఆవజ్రము యువరాజు క్రింద పడవేయగానే రాకుమార్తె ఆగదిలోనిల్చుంది. కొద్ది సేపట్లో మాంత్రికుడు ఆగది ప్రవేశించి రాకుమార్తె ఆగదిలో వుండుటచూచి కోపముతో అరిచాడు. మాంత్రికుని నడుముకు చుట్టబడిన ఇనుపగొలుసులలో మరొక గొలుసు ముక్కలై క్రిందపడింది. కోపముతో రాకుమార్తెను ఆగదినుండి తీసుకు వెళ్లాడు. చీకటిపడగానే మాంత్రికుడు రాకుమార్తెను ఆగదిలోనికి తిరిగి తీసుకొనివచ్చాడు మాంత్రికుడుయువరాజునుకోపముతోచూచి "ఆఖరికి విజయ మెవరిదో చూడు" అంటూ వెళ్ళిపోయాడు.

ఆరాత్రికూడా యథాప్రకారంగా రాకుమార్తె మాయమైంది. సూర్యోదయము కాకముందే యువరాజు మేల్కొని దివ్యదృష్టిని మేల్కొలిపి రాకుమార్తె ఎచ్చట నున్నదని అడిగాడు. "రాకుమార్తె

ఇచ్చటకు మూడువందల మైళ్ళ దూరములోవుంది. అక్కడ ఒక సముద్రమువుంది. ఆ సముద్రము మధ్యలో బాగా అడుగు భాగమున ఒక నత్తగుల్లవుంది. ఆ గుల్లలో ఒక వుంగరంవుంది. ఆ వుంగరమే రాకుమార్తె. ఈసారి మన పెద్దపొట్ట సహాయం కావాలి" అని దివ్యదృష్టి చెప్పాడు. పొడుగువాడు ఇద్దరను చెరియొక భుజముపై నెక్కించుకొని అడుగునకు మువ్వది మైళ్ళ చొప్పున నడచి ఆ గుల్ల ఎక్కడున్నదో దివ్యదృష్టి పొడుగు కాళ్లకు చెప్పాడు. పొడుగువాడు తనశక్తికొలది పెరిగాడు కాని లాభము లేకపోయింది. "మీరు తొందరగా పడకండి" అని అంటూ పెద్దపొట్ట తనపొట్ట పెంచి ఆ సముద్రములోని నీరు త్రాగసాగాడు. సముద్రములోని నీరు సగమునకు సైగా తగ్గింది. అప్పుడు పొడుగువాడు ఆ గుల్లను సులభముగా తీసుకొని వచ్చాడు. ఆ గుల్లలోని వుంగరము తీసి తన స్నేహితులతో యువరాజువద్దకు బయలుదేరాడు. పెద్దపొట్ట సముద్రంలోని నీరు త్రాగుటచేత బరువుగా వున్నాడు. అందుచే పొడుగువాడు వేగముగా నడవలేకపోయాడు. పెద్దపొట్టవాణ్ణిదింపి ఒకలోయలో వదలి మరల వస్తామని దివ్యదృష్టితో కలసి వెళ్లాడు.


సూర్యోదయము అవుతోంది. అందుచే యువరాజు చాలా కంగారు పడసాగాడు. తన నౌకర్లు ఎందుచేత రాలేదని ఆలోచిస్తున్నాడు. అంతలో మాంత్రికుడు ఆ గదిలో ప్రత్యక్షమైనట్లు వక్కలా చూశాడు. ఆ గదిలో రాకుమార్తె కానరాక పోవుటచే వికటముగా నవ్వుతూ యువరాజువద్దకు రాసాగాడు. అప్పుడు ఆ ప్రక్కనున్న కిటికీఅద్దము పగిలి ఆ కిటికీద్వారా వుంగరము ఆ గదిలో వచ్చిపడింది. ఆ వుంగరము నేలమీద పడగానే రాకుమార్తెగా మారి నిలబడింది. దివ్యదృష్టి తన యజమానికి రాబోవు ఆపద తెలుసుకొని ఆ సంగతి పొడుగువాడితో చెప్పి తొందర పెట్టాడు. అందుచే పొడుగువాడు రెండడుగులు ముందుకు వేసి కిటికీద్వారా ఆ వుంగరం గదిలోనికి విసిరాడు. మాంత్రికుడు పట్టలేనికోపముతో, ఆ వేశతో, పెద్దపెద్ద కేకలు వేశాడు. మాంత్రికుని నడుముకు చుట్టబడివున్న మూడవ గొలుసు ముక్కలై జారిపోయింది. మాంత్రికుడు భయంకరమైన పెద్దపక్షిగా మారాడు. ఆ పక్షి కిటికీద్వారా బయటకు ఎగిరిపోయింది.

4

అప్పుడు మాత్రమే రాకుమార్తె యువరాజుతో నవ్వుతూ మాట్లాడింది. తనను రక్షించినందుకు యువరాజుకు అభివందనము తెలిపింది. మాంత్రికుని భవనములోఉన్న శిలలన్నీ మరల మామూలు మనుష్యులుగా మారాయి. తమను రక్షించినందులకు వారందరు యువరాజునకు అభివందనములు తెలిపారు. "మీరు అభివందనములు తెలుపవలసినది నాకు కాదు. నా స్నేహితులగు పొడుగుకాళ్లు, పెద్దపొట్ట, దివ్యదృష్టిలకు" అని యువరాజు అన్నాడు. యువరాజు రాకుమార్తెతోను తనఇద్దరు స్నేహితులతో నూతన రాజ్యమునకు బయలుదేరాడు. దారిలో విడచిన పెద్దపొట్టను కలుసుకొని వానినికూడా తీసుకువెళ్లాడు. ముసలిరాజు తన కుమారుని విజయమునకు సంతోషపడి ఎంతో వైభవంగా పెండ్లి చేశాడు. యువరాజు తన ముగ్గురు స్నేహితులను తనవద్దనే ఉండమని కోరాడు. కాని వారు ఒకచోట కూర్చుని కాలము సోమరిగా గడుపుటకు ఇష్టము లేదన్నారు. సెలవుతీసుకొని వారు ముగ్గురు దేశాటనమునకై వెళ్ళిపోయినారు.

(ఒక ఆంగ్లకథ ఆధారంగా)

★



కేంద్ర ప్రభుత్వమువారిచేత బాల సాహిత్యంలో ఉత్తమ గ్రంథంగా నిర్ణయించబడి ప్రథమ బహుమతి సంగ్రహించుకొన్న 'బొమ్మరిల్లు' రచయిత శ్రీ కవిరావు.

గుమాస్తా: సార్, నేను నలుగురిపని చేస్తున్నాను. నా జీతం హెచ్చించాలండీ

మేనేజరు: అది మాత్రం అసంభవం... నీవు ఎక్కువ చేసే పని ఏ ముగ్గురిదో చెప్పు, వాళ్ళని బర్తరఫ్ చేస్తాను.

తానొకటి తలిస్తే....

మె. యు. చౌ

జనరల్ లీసింగ్ యువకుడుగా ఉన్న రోజులలో, 'హువో' పర్వతాలలో వేటాడుతూ ఉండే వాడు. లీసింగ్ రూపవంతుడు, పొడగరి. అందరితో స్నేహభావంతో మెలిగేవాడు. అందుకని అందరూ అతనిని ప్రేమతో చూచేవారు. ఒక్కొక్కసారి ఎప్పుడయినా అతడు వేటలో మునిగి, పట్టణానికి తిరిగి వెళ్ళ లేకపోతే, ఆ పర్వతాల సమీపంలో ఉన్న ఒక గ్రామ పెద్ద అతనికి సంతుష్టికరమైన భోజనం, పడక సౌకర్యాలు ఏర్పాటు చేసే వాడు. ఆవిధంగా వారిద్దరూ ఆప్త మిత్రులయినారు.

ఒకరోజున వేటాడుతూ ఉండగా లీ ఒక పెద్ద లేళ్ళ మంద జాడలను చూచాడు. లీ, మంచిగుఱ్ఱపురౌతు. ఆ లేళ్ళజాడనుబట్టి అతడు మిట్ట పల్లాల్ని దాటుకుంటూ త్వరితంగా వెళ్తున్నాడు. అప్పుడప్పుడు పొర పాటున గొఱ్ఱెలజాడలనుపట్టి దారి తప్పి పోసాగాడు. అయిదువందల గజాల దూరంలో ఏమి కదులుతున్నా అతడుచూడగలడు. కాని ఆనాడు ఆ లేళ్లుఎలాగో అతనిదృష్టి పథంనుంచి తప్పించుకొని పోయి నాయి. అయితే లక్ష్యంసాధించకుండా మధ్యలో విడిచేరకంకాదు కనుకపర్వతం తర్వాత పర్వతం దాటుతూ లీ ముందుకు పోతూనే ఉన్నాడు. నాలుగుప్రక్కలా బాగా చీకటి అలుముకున్నది. చివరికి లీ విసుగుపుట్టి వెనుతిరిగిపోదామని అనుకున్నాడు. కాని తీరాచూస్తే అతడున్న ప్రదేశం అపరిచితమైనది కావటంచేత తిరిగి వెళ్ళటం సాధ్య పడలేదు. లీసింగుకు ఏమి చేయాలో తోచలేదు. ఇంతలో ఎదురుగా ఉన్న ఒక పర్వత శిఖరమునుండి ఒకదీపం ప్రకాశిస్తూఉండటం అతడు గమనించాడు. అతనికి ఉత్సాహం కలిగింది. అరగంటసేపటిలో అక్కడికి చేరుకోవచ్చు, ఆనాటికి అక్కడ బస చేయవచ్చునని లీఅనుకున్నాడు. ఆదిశగా ప్రయాణించి అతడు తెల్లని ఉన్నత ప్రాకారందాటి ఎఱ్ఱని ద్వారంగల ఒకభవనం ముందుకు చేరుకున్నాడు. తలుపు తట్టి నిలబడ్డాడు.

కొంతసేపయిన తరువాత, ఒక భృత్యుడువచ్చి ద్వారం తెరిచాడు. లీ తనసంగతి చెప్పి, ఆ రాత్రికి ఆతిథ్యం ఇవ్వవలసిందని ప్రార్థించాడు. ఆ భృత్యుడు లోనికి వెళ్ళి యజమానురాలితో చెప్పి, ఆమె అనుమతి తీసుకొని లీని లోపలికి తీసుకొనివెళ్లాడు. వెళ్తూ అతడు ఇలాచెప్పాడు. "భవనంలో మా యజమానురాలు ఒక్కర్తేఉన్నారు. మరెవ్వరూ లేరు. మొదట ఆమె మీరు లోనికి రావటానికి సమ్మతించలేదు. కాని మీరు దారితప్పిపోయినట్లు తెలిసిన పిదప తమకీరాత్రికి ఒకగది ప్రత్యేకించటానికి ఒప్పుకున్నారు."

లీని అతడు అందంగా అలంకరించబడిన ఒకహాలులోకి తీసుకువెళ్లాడు. మణిదీపాలు బంగారు పాత్రలు మొదలయిన వాటితో ఆహాలు చాలా సుందరంగా ఉన్నది. లీ అక్కడికి వెళ్ళగానే ఒక పరిచారిక వచ్చి యజమానురాలు వస్తున్నదని తెలియపరిచింది.

యజమానురాలు నిరాడంబరమైన దుస్తులు వేసుకొని ఉన్నది ఆమెలో రాజసం మూర్తీభవించింది. లీ ఆమెకు నమస్కరించి, పిలవకుండానే తాను వచ్చినందుకు క్షమాపణ చెప్పుకున్నాడు. ఆమె ఇలాచెప్పింది" ఈ రాత్రి నా కుమారులు ఇంటివద్ద లేరు. సాధారణంగా ఇటువంటి సమయంలో నేను అతిథులను స్వీకరించను. కాని దారి తప్పివచ్చిన మిమ్మల్ని ఈ రాత్రి సమయంలో విడిచిపెట్టటానికి నాకు మనసొప్ప లేదు." త్రాసులో వేసి తూచినట్లు, నిశ్చలతతో ఈ రెండు ముక్కలు ఆమె చెప్పింది. ఆమె ఆజ్ఞ ప్రకారం లీకి శ్రేష్ఠమైన భోజనం వడ్డించారు. భోజనమైనపిమ్మట, లీ ఆమెకు కృతజ్ఞత తెలిపాడు. ఆమె ప్రత్యభివందనంచేసి మృదువుగా అతనితోఅన్నది. "మాభవనంలో రాత్రిపూటబాగాగోలగాఉంటుంది.

మీకేమీ అభ్యంతరం లేదనుకుంటాను."

లీ ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసి చూశాడు. ఆమె ఇంకా ఇలా చెప్పింది. "నా కుమారులు మామూలుగా అర్ధరాత్రివేళ వస్తారు. చాలా గోలచేస్తారు. మీరు అనవసరంగా భయపడకుండా ఉండటానికి గాను మీకు ముందుగా చెప్పుతున్నాను." లీకి ఆమె కుమారులనుగురించి అడగాలనిపించినా, అంతగా తనకు సంబంధించని వాటిని గురించి అడగరాదని అనుకున్నాడు.

లీ తనకు ఇచ్చినగదిలో వెచ్చగా పడుకున్నాడు. వేటాడి, అలసిపోయిఉన్న అతనికి అలాపడుకుంటే ఎంతో హాయిఅనిపించింది. కానిమనుష్యులు ఎవ్వరూ లేని అక్కడ తనకు ఆతిథ్యము ఇచ్చినవారు ఎందుకు ఉన్నారో, వారెవరో, అర్ధరాత్రివేళ వచ్చిగోలచేసే ఆమెకొడుకులు ఎలా ఉంటారో తెలుసుకోవాలని అతనికి చాలా కుతూహలం కలిగింది. అందుచేత, ఆహారం కొరకు పొంచి ఉన్న వన్యమృగంలాగా నిశ్చలంగా పండుకొని ఏంజరుగుతుందో చూడాలని ఆలోచిస్తున్నాడు.

అర్ధరాత్రివేళ ఎవరో తలుపు గట్టిగాకొట్టిన చప్పుడైంది. నౌకరు తలుపుతీసి ఎవరితోనో మాట్లాడి యజమానురాలి వద్దకు వచ్చాడు. "అమ్మగారూ! ఇప్పుడు ఒకవార్తాహారుడు ఈ లేఖతీసుకొని వచ్చాడు. ఈపర్వత పరిసరాలచుట్టు ప్రక్కల ఏడుమైళ్ళవరకు వర్షంకురిపించ వలసిందిగా పెద్దబాబుగారికి ఆజ్ఞ అయింది. తెల్లవారేసరికి వర్షంఆగిపోవాలి. పంటలు పాడయిపోకూడదు."

యజమానురాలు భయపడింది. "నేనిప్పుడేమి చేయగలను? కొడుకులిద్దరూ చాలాదూరంలో ఉన్నారు. వారికి కబురు అందేవ్యవధానం కూడా ఉండదు."

"అతిథిని పంపకూడదా? అతడు మంచిబలవంతుడు. వేటగాడు, బాగా స్వారీచేయగలడు." అని పరిచారిక చెప్పింది. ఆమె సంతోషంతో లీ వద్దకు వచ్చిపిలిచింది. లీ తనగది విడిచి చావడిలోనికి వచ్చాడు. యజమానురాలు ఆత్రుతతో అతనికి వివరించింది. "మీరిప్పుడు బసచేసినది భూతాల నివాసం. తెల్లవారేవరకు వర్షం కురిపించ వలసిందిగా స్వర్గంనుండి ఆజ్ఞ వచ్చింది. నాకుమారులిద్దరూ కార్యాంతరంపైన వేలకొద్దిమైళ్లలో ఉన్నారు. వారికి వార్తపంపే వ్యవధిలేదు. మీరుపూనుకొని మమ్మల్ని గట్టెక్కించకపోతే నా కుమారులు శిక్షాపాత్రులవుతారు."

ఈ అపూర్వమైన ప్రార్థన వినేసరికి లీ ఆశ్చర్యభరితుడైనాడు. యజమానురాలు జీనువేసిన ఒక నల్లని గుఱ్ఱాన్ని తెప్పించింది. వర్షపునీరు ఉన్న ఒక చిన్న సీసా ఇచ్చింది. ఆ సీసాను జీనుముందు కట్టమని చెప్పింది. "ఇది ఆకాశంలో విహరించే గుఱ్ఱం. కళ్ళాన్ని వదులుగా పుచ్చుకొని, దాని ఇష్టంవచ్చిన చోటికి వెళ్ళనివ్వండి. ఎక్కడికి వెళ్ళాలో దానికి తెలుసు. అది గిట్టలు కదిలించి తట్టినప్పుడెల్లా మీరు ఈ సీసా తీసుకొని ఒక చుక్క దాని జూలుమీద చల్లండి. కాని ఎక్కువగా పడకుండా మాత్రం జాగ్రత్తగా చూడండి."

లీ ఆ అశ్వాన్ని అధిరోహించి బయలుదేరాడు. దాని నిబ్బరానికి వేగానికి ఆశ్చర్యం కలిగింది అతనికి. ఆ గుఱ్ఱం అతనిని మేఘాలలో తీసుకొని పోతున్నది. శీతలవాయువులు ప్రసరిస్తున్నాయి. యజమానురాలు చెప్పినట్లు చేయసాగాడు. కొద్దిసేపట్లో అతడు మామూలుగా రాత్రిపూట ఆగుతూఉండే గ్రామానికి వచ్చాడు. లీ ఇలా ఆలోచించాడు. "ఆ గ్రామపెద్ద నాకు ఎంతో సహాయం చేస్తున్నాడు. వాళ్ల పైరులు నిన్నచూస్తే ఎండిపోయి ఉన్నాయి. కంకులన్నీ కాటుకేసిపోయినాయి. నా చేతిలో ఇప్పుడు వర్షం కురిపించేశక్తి ఉన్నది కనుక బాగా వర్షం కురిపిస్తాను." లీ అక్కడ ఇరవై చుక్కలు చిలకరించి అక్కడ కుంభవృష్టి కురవటంచూసి సంతోషించాడు. తన పనిపూర్తి కాగానే అతడు భూత నివాసానికి చేరుకున్నాడు. అతడు వెళ్ళేసరికి, చావడిలో కూర్చొని యజమానురాలు విలపిస్తున్నది. "అయ్యో! ఎంత ఘోరమైన అపరాధం చేశారు మీరు? నేను చెప్పినట్లు కాక సీసాలో సగం పైగానీరు చల్లి వచ్చినట్లున్నారు. మీరు ఒకచుక్క నీరుచల్లితే భూమిపై ఒకఅడుగు వర్షంకురుస్తుంది. ఒకరాత్రి, 20 అడుగుల వర్షంపడితే ఆగ్రామం ఈపాటికివరదలలో కొట్టుకొని పోయి ఉంటుంది. ఎంతనష్టం? స్వర్గానికి దీనినిగురించి ఫిర్యాదు వెళ్లుతుంది. ఈ విపత్తుకి నా కుమారులు బాధ్యత వహించవలసి ఉంటుంది." లీకి చాలా సిగ్గువేసింది. కానిఇప్పుడు ఎంత అనుకున్నంతమాత్రం ఏమి ప్రయోజనం ఉంటుంది? ఆమెఇంకా

(49-వ పేజీ చూడండి)

విజ్ఞానవీధులు

"డాక్టర్"

203. చేపకేది చెరుపో కప్ప కదే కాపు

"ఏమిటా చెరుపు? ఏమిటా కాపు?" అని అడుగుతారా? చెప్తున్నా. జ్ఞాపకం పెట్టుకోండి. "నోరుమూసుకునే వుండడం". ఇది కప్పకి కాపూ చేపకి చెరుపూను. మనకి వున్నట్లు చేపకి ముక్కురంధ్రాలూ వూపిరితిత్తులూ లేవు. కనక మనము పీల్చునట్లు అది గాలి పీల్చి జీవించలేదు. నోటితో నీరు పీల్చి కిందికి దౌడకి చేరువగావున్న మొప్పల లోంచి బయటికి పంపేయగలదు. మొప్పలు చంద్రవంక ఆకారంలో దంతపుదువ్వెనల లాగుంటాయి. ఈ "దువ్వెన్న"ల పళ్ళలోకి చేపవంట్లో ప్రసరించి మలినపడిన నెత్తురు వచ్చి చేరుతూంటుంది. చేప మాటి మాటికి మింగేనీరు ఈ "దువ్వెన్న" పళ్ళసందుల్లోంచి జారిపోయేటప్పుడు ఈ నీటిలో కరిగివున్న గాలిలోని ప్రాణవాయువు ఆ పళ్ళ పలచని చర్మంగుండా నెత్తురులో ప్రవేశించడమూ, నెత్తురులోని మలినం-అనగా బొగ్గుపులుసువాయువు - ఈ నీటిలో ప్రవేశించడమూ జరుగుతాయి. మొప్పల్ని కప్పివున్న దళసరైన చర్మాన్ని ఒత్తి చేప ఈ నీటిని బయటికి పంపించేస్తుంది.

అంటే, నోరు మూతపడేవుంటే చేపకి శ్వాసకి కావలసిన గాలి అందదు, శ్వాస ఆడదనే అనవచ్చును. బలవంతాన్ని నోరు మూసిపెట్టిఉంచితే చేప గిజగిజ తన్నుకుచస్తుంది. ఇక కప్పకో? నోరు మూతపడే వుంటేగాని శ్వాస ఆడదు. బలవంతాన్ని నోరు తెరచిపెట్టి వుంచితే కప్ప చచ్చిపోతుంది.

కప్పకి ముక్కురంధ్రాలూ, కింద దౌడకి అడుగుభాగాన్నివున్న గడ్డపుచర్మమూ, ఊపిరితిత్తులూ - ఈ మూడు శ్వాసాంగాలు. శ్వాసిస్తున్నప్పుడు కప్పనోరు మూతపడే వుంటుంది. చక్కగా గమనిస్తే దాని గడ్డపు చర్మముమాత్రము పైకీకిందికీ ఆడుతూన్నట్టు అవుపడుతుంది. ఈ చర్మం అడుక్కి వచ్చినప్పుడు కప్పనోటిలోని గాలి సాంద్రత తగ్గుతుంది. అందువల్ల బొమ్మలోని బాణము సూచించినట్టుగా వెలుపలి గాలి ముక్కురంధ్రాలద్వారా కప్పనోటిలో ప్రవేశిస్తుంది. ఇప్పుడు ముక్కురంధ్రాల్ని మూసి గడ్డపు చర్మాన్ని పైకి నొక్కుతుంది కప్ప. నోటిలోని గాలి బయటికి పోకుండా పెదిమెలు మూతపడే వుంటాయి. మరి గత్యంతరములేక ఈ గాలి రెండో బొమ్మలో బాణం సూచించే దారిని కప్ప ఊపిరితిత్తుల్లో ప్రవేశించి నెత్తురుకి ప్రాణవాయువునిచ్చి, తాను నెత్తురులోని బొగ్గుపులుసుగాలిని గ్రహిస్తుంది. ఇప్పుడు మళ్లీ గడ్డపు చర్మము కిందకి కదిలి నోటిలోని గాలిసాంద్రత తగ్గుతుంది. పెదిమెలు మూతపడే వుంటాయి గనక పైగాలి నోటిలోకి రాలేదు. ఊపిరితిత్తుల్లో మలినపడినగాలి తిరిగి నోట్లోకి వచ్చేస్తుంది, ఇప్పుడు ముక్కురంధ్రాన్ని తెరిచి గడ్డపు చర్మము పైకి నొక్కి ఈ గాలిని బయటికి పంపేస్తుంది కప్ప.

నోరు తెరుచుకునేవుంటే గాలిని తన వూపిరితిత్తుల్లోకి ప్రవేశపెట్టలేదు కప్ప. అంటే నోరుమూతపడివుంటేగాని దానికి ఊపిరాడదన్నమాట. ★

చిత్రప్రశ్నలకు జవాబులు

యస్. దశరథరెడ్డి, సూర్యాపేట.

—తెలుగుభాషపుట్టిన కాలము ఇదీ అని ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే భాష మాట్లాడడము ఎన్ని శతాబ్దాలో గడిచిన తర్వాతగాని లిఖించడము జరగదు. లిఖిస్తేనే గాని నిలవదు. నిలిస్తేగాని నేటికి ఆభాష పుట్టి ఇన్ని ఏండ్లయినదని చెప్పవీలుకాదు.

అయితే క్రీ. శ. ఒకటీ, రెండూ మూడు శతాబ్దాలలో రచించబడ్డ ప్రాకృతభాషా గ్రంథాలలో తెలుగు మాటలు కనబడుతున్నాయి. క్రీ. శ. 840 ప్రాంతపు గుణగ విజయాదిత్యుని కాలంలోని శిలాశాసనంలో దంపుళ్ళపాటవరుసలో తెలుగు ఉన్నది. అంటే దంపుళ్లపాట ఆనాటికంటె ప్రాచీనమైనదన్నమాట. మాటలుపుట్టిన తర్వాతనే కదా పాటపుట్టుట.

లిపి, వ్రాత అన్నవి సంస్కృత పండితులు మన్నించినవి కావు. వేదాలు నిన్నమొన్నటిదాకా శ్రుతిమూలములే కదా? బౌద్ధులు మాత్రము లిపి, వ్రాత బాగా వాడినారు. తెలుగు నాటి నాలుగోశతాబ్దము నాకా బౌద్ధమే వ్యాప్తిలో ఉంది. ఆ రోజులలో తెలుగు వృద్ధిఅయి ఉండవచ్చునేమో.

ప్రపంచములో గ్రీకుభాషకూడా ప్రాచీనమే. అస్సీరియనుభాష ఇంకా ప్రాచీనము. ఈజిప్టుది ఇంచుమించు అస్సీరియనుకి సమకాలికము. అస్సీరియను భాషకంటె ప్రాచీనమైన భాష ఉన్నట్లు మాకు తెలియదు.

—గదికి ఒకవైపుగల తలుపులు మూస్తూ గదిలోనికి గాలిని తరిమినొక్కుదుముకదా? గాలికి స్ప్రింగుకు వలెనే స్థితిస్థాపకశక్తి కలదు. కనక నొక్కబడిన గాలి, రెండోవైపు తలుపుల్ని అదిమి కదుపుతుంది. అలమారు తలుపు ఒకటిమూసి, రెండోదాన్ని గభీమని వేసినా అంతే జరుగుతుంది.

—గంటమోగించి, అంచుని ఎక్కడ తాకినా అదురుతూన్నట్టు తెలుస్తుంది. పగిలిన గంట అంచుఅంతా కలిసి ఉండదు. అంటే అదురు అంతటా వ్యాపించదు. మోగడమంటే అదరడమే. అదరితేగాని - అంటే కంపిస్తేగాని మోగదు. పగిలినగంట అంత చక్కగా కంపించదు కనక చక్కగా మోగదు.

పగలనక్కరలేదు. పళ్లెమును అంచుపట్టుకునే వుండి పెనసలుతో కొట్టి మోగించండి. చక్కగా మోగదు. అదురు చక్కగా వ్యాపించదు కనకనే మోగదు.

—హైడ్రోజను బాంబునా? ఉపయోగంలేకుండా చెయ్యడమా? శత్రువు చేతిలోని తుపాకిని అడ్డగలమా? ఇక హైడ్రోజను బాంబుని ఎలాగ అడ్డుతారూ?

లింగం శ్రీరామచంద్రదాసు, మంత్రిపాలెం.

—గ్రహణానికీ, నీటిపళ్లెములో నిలబడ్డ రోకలికీ ఏ సంధమూ లేదు. దాఖలాచూచి చెప్పండి. నమ్మకాలన్ని నిజాలుకావు.

కె. వి. రమణరావు, మచిలీపట్నం.

పరమాణుశక్తి వేడిమిగానూ వెల్తురుగానూ విడుదల అవుతుంది. ఆ వెల్తురు జీవములను మాడ్చివేస్తుంది.

అయితే ఈ వేడినే సజావుగా కొంత తాపీగా వెలువరించే పరమాణుశక్తి నిర్మాణాలూ ఉన్నాయి. వాటినించి నీటిని మరగబెట్టడానికి కావలిసిన వేడికంటె ఆరురెట్లవేడిని రాబట్టి యంత్రాలను నడపడానికి ఉపయోగించవచ్చును.

కె. బాబురావుగారు, బారిపదా.

—వెలుతురు సెకనుకు 186000 మైళ్ళు ప్రయాణముచేస్తూ సూర్యుడినుండి మనకు చేరడానికి సుమారు ఎనిమిది నిముషాలు తీసుకుంటుంది. సూర్యుడికీ మనకీ ఎన్ని వేలమైళ్లో లెక్కగట్టుకోవచ్చునుకదా? ★

తానొకటి తలిస్తే....

(47-వ పేజీ తరువాయి)

ఇలాఅన్నది. "మీకు ఈసంగతి తెలియక పోవటంవలన పొరపాటు చేశారు. కాని నా కుమారులు భవనానికి చేరుకునే వేళకు, మీరిక్కడ ఉండటం మీకు మంచిదికాదు. తక్షణం ఇక్కడినుంచి వెళ్ళిపొండి."

లీ అక్కడనుంచి వెళ్ళిపోవటానికి సంసిద్ధమైనాడు. అప్పటికే అరుణోదయం కావస్తున్నది. అక్కడనుంచి అంత తేలికగా బయటపడుతున్నందుకు అతడు సంతోషించాడు. వెళ్ళబోయేముందు భవనం యజమానురాలు, అతనివద్దకువచ్చి ఆరాత్రి అతనికి శ్రమ ఇచ్చినందుకు ప్రతిఫలం ఇవ్వదలిచినట్లు చెప్పింది. లీ ఆశ్చర్య పోయినాడు. ఆమెతో ఇద్దరు సేవకులు ఉన్నారు. వారినిద్దరినీ కాని, ఒకరినిగాని ఎన్నుకోమని ఆమెకోరింది. ఒకడు సాధువుగా కరుణా మయుడుగా కనిపించాడు. మరొకడుదృఢంగా, భయంకరంగా ఉన్నాడు. ఆరాత్రి తానుపొందిన అనుభవానికి చిహ్నంగా ఒకసేవకుని తీసుకోవాలని నిశ్చయించిన లీ దృఢకాయునే ఎన్నుకున్నాడు. తనకు వేటలో అతడు మిక్కిలిగా సహాయ పడతాడని అతడు ఆశించాడు.

ఆమెవద్ద సెలవుతీసుకొని లీ బయలుదేరాడు. మళ్లీఒకసారి భవనంవంక చూద్దామని అతడు వెనుదిరిగాడు. కాని అదిఅప్పుడే అంతర్ధానమైంది. సేవకుడూ అంతర్ధానమైనాడు.

లీ ఒంటరిగా త్రోవ పట్టాడు. రాత్రితాను కురిపించిన వర్షఫలితంగా మునిగిపోయినగ్రామం కనిపించింది.

తరవాత కొన్నాళ్ళకు లీ సేనానాయకుడైనాడు. చక్రవర్తి కొలువులో అతడుచాలా కాలం సేవచేశాడుకాని ఎన్నడూ అతడురాజకీయంగా ఉన్నతోద్యోగి కాలేకపోయినాడు. కారణం సాధువు, విజ్ఞానిఅయిన సేవకుని కోరుకోకపోవటమే. టంగ్ క్వాన్ కనుమల పశ్చిమాన్నుంచి మంచిజనరల్, తూర్పుదిక్కునుంచి మంచి ప్రధానివస్తాడని సామెత కూడాఉన్నది. లీ కనుక ఆ సేవకులిద్దరినీ తీసుకొని వెళ్ళినట్లయితే ఉన్నతపదవి పొందేవాడు.

(లిన్యుటాంగ్ ఇంగ్లీషులోకి అనువదించిన చైనీస్ కథకు అనువాదం)

★

గ్రంథ సమీక్ష

కథలు రాయడ మెలా?

రచన:— శొంఠి కృష్ణమూర్తి; ప్రచురణ: యశోధర ప్రచురణలు, హనుమకొండ, వరంగల్; వెల 1-8-0.

రచనకు ఆకర్షవంతమైన శీర్షిక పెట్టాలని ఈగ్రంథంలో రచయిత ఒక సూచన చేశారు ఈ సూచనకు ఈ గ్రంథనామం కంటే మంచి ఉదాహరణ దొరకదు. ప్రస్తుతం విద్యావంతులైన యువకులలో కథలు వ్రాయాలనే కుతూహలం ఎంత ప్రబలంగా వున్నదో పత్రికలవారికి బాగా విదితమైన విషయమే. కేవలం ఉత్సాహమే తోడుగా, ఒక నిర్దిష్టమార్గం అంటూ ఏమీలేని సముద్రంలో ప్రయాణానికి బయలుదేరే సాహసికులవలెనే ఈ ఉత్సాహవంతులందరూ కథారచనకుఉపక్రమిస్తున్నారు. వీరికి ఈ పుస్తకం పేరుమాడగానే ప్రాణం లేచివస్తుందనడానికి సందేహమేమీ లేదు. అంతవరకూ అగమ్యగోచరంగా కనిపించిన సముద్రానికి ఎవరో సజ్జనుడు శుభ్రంగా నౌకామార్గాలూ వగైరా వేసి చక్కని పటం తయారు చేసి సముద్రయానానికి కావలసిన పరికరాలు సర్వమూ రెడీ మేడ్‌గా అందజేసినట్లు భావిస్తారు. ఈపుస్తకం ప్రారంభ రచయితలకోసమే ప్రత్యేకంగా వ్రాయబడింది

కాగితంమీద రెండు వేపులా వ్రాయవచ్చునా లేదా, పత్రికలకు కథఎలా పంపించాలీ వగైరా అతి సాధారణ విషయాల దగ్గిర్నించి కథాసాహిత్య ప్రయోజనం దాకా అన్ని విషయాలూ వివరంగా రచయిత వ్రాశారు ఈ పుస్తకం చదివినవారు వెంటనే మంచి మంచి కథలుగాని కనీసం 'ఏవోకథలు' గాని వ్రాస్తారనే గ్యారంటీ లేకపోయినా, కథారచనను గూర్చి చాలమందికివుండే సందేహాలు కొంతవరకు నివృత్తి అవుతాయని చెప్పవచ్చు.

శ్రీ వేంకటేశ స్తోత్రము:—

ఆంధ్రీకరణము; గ్రంథకర్త: క. నారాయణరావు; ప్రకాశకులు: జయలక్ష్మి అండ్ కంపెనీ, ట్రంకురోడ్డు, నెల్లూరు.

కొత్త పత్రిక జ్యోత్స్న:—

సారస్వత మాసపత్రిక; మేనేజింగ్ ఎడిటర్: ఆర్. రామకృష్ణ; విడిసంచిక 0-6-0; సంవత్సరచందా 4-0-0. కరీంనగర్ జిల్లా, జగిత్యాలనుండి వెలువడిన ఈ పత్రిక మొదటి సంచిక (మార్చి, 55)మా కార్యాలయమునకు చేరినది. దాశరథి, సురమౌళి, దివాకర్ల వేంకటావధాని మున్నగు వారి రచన లీ సంచికలో ఉన్నాయి.

అక్షరసుందరి:— భావకవిత; రచయిత: ఎస్. ఆర్. ఎస్. అయాచిత్; ప్రతులకు: ఆంధ్ర విశ్వసాహిత్య పరిషత్, పూర్ణానందం పేట, విజయవాడ - 2. వెల 0-12-0.

బాలలబొమ్మల భారతము:—

గ్రంథకర్త: బూరెల సత్యనారాయణ మూర్తి; చిత్రకర్త: బి. పి. రాజా. ప్రతులు దొరుకుచోటు: సి. ఎన్. సెట్టి, చార్ కమాన్, హైదరాబాద్-2; వెల 1-8-0. మహాభారత కథను పిల్లలకు సులభ గ్రాహ్యంగా ఉండే వచనంలో బొమ్మల సహాయంతో తెలిపే గ్రంథం. ముద్రణ, ముఖచిత్రాలు వగైరా బాగున్నాయి.

బంగారు దీవి:— రాబర్ట్ లూయీ స్టీవెన్సన్ నవల "ట్రెజర్ ఐలెండు"కు సంగ్రహానువాదం; అనువాదకుడు: విద్యాపతి; వెల 1-4-0; ప్రచురణ: సి. ఎన్. సెట్టి, హైదరాబాదు.

★



ఫాక్స్‌కంపెనీవారిచిత్రం "డిజైరి"లో నెపోలియన్ పాత్రధరించిన మార్లన్ బ్రాండో

చిత్రనిర్మాణంలోని సాధక బాధకాలు

డైరెక్టర్ ఎస్. జగన్నాథ్


"కృత్యాద్యవస్థ - చిత్ర నిర్మాణం" అనే విషయమై ఇష్టాగోష్ఠి

ప్రశ్న : నమస్కారం జగన్నాథ్ గారూ. ఇతర కళా నిర్మాణంలోలాగే సినిమా చిత్ర నిర్మాణంలో కృత్యాద్యవస్థ అనుభవించేది యెవరండీ, డైరెక్టరేనా ?

జవాబు : నిజానికి ఏ పిక్చరయినా తయారుచేసేది డైరెక్టరయినా, తయారు చేయాలనుకునేది ప్రొడ్యూసరు. ఈ రెండు బాధ్యతలూ నిర్వహిస్తున్న ఏ కొద్దిమంది విషయంలోనో తప్ప, మిగతా అప్పుడంతా ఫలాని కథ అని ఏరుకునేది నిర్మాత. ఆకథా వస్తువుని ఎంత వీలుగా, రసవంతంగా తీయగలుగుతామనేది డైరెక్టరు బాధ్యత. అంచేత చిత్ర నిర్మాణ విషయంలో కృత్యాద్యవస్థ యావత్తూ ప్రొడ్యూసరుది. అంటే నిర్మాతది. డైరక్టరుది నిర్మాణ నిపుణత్వం మాత్రమే. నిర్మాతయొక్క కృత్యాద్యవస్థ అన్ని దేశాల్లోనూ, అన్ని భాషల్లోనూ ఒకటే ఒక సూత్రంమీద ఆధారపడి ఉంటుంది. ఎంత ఎక్కువ లాభం వస్తుంది అని. అథవా ఎంత తక్కువ నష్టం రావచ్చు అని. ఈ సమస్యలలోకి చిత్ర నిర్మాణం దిగజారిన తరువాత ఇది కృత్యాద్యవస్థ కాదు. కేవలం వ్యాపార విచక్షణ ప్రస్తుతం ఈ విచక్షణకి కూడా ఎక్కువ అవకాశం లేకుండా పోయింది. ఇతర ప్రాంతాలలోనో, ఇతర భాషలలోనో బాగా సంపాయించిన కథలని, మరో భాషలో మరోసారి తయారు చేయడమే లాభసాటియైన పద్ధతిగా పరిగణించబడుతోంది. పది పదిహేనేళ్ల క్రిందట ఒకసారి తయారయిన పౌరాణికాలను మళ్లీ అవతరింపచేయడానికి నిర్మాతలకి సంకోచానికి బదులు సంతోషంగా ఉంది. మరాఠీ, బెంగాలీ చిత్రాల కథలు కొనుక్కొని తెలుగు తమిళభాషల్లో తర్జుమా చేయడానికి తాపత్రయం ఎక్కువై పోయింది. దేశకాల పరిస్థితులూ, సంప్రదాయ సాన్నిహిత్యమూ ఆలోచించకుం



స్క్రీన్ బహుమానోత్సవంలో భరతనాట్యం చేస్తున్న తిరువాన్కూర్ సోదరీమణులు.



ఫాక్స్ కంపెనీవారి "దేరీజ్ నో బిజినెస్ లైక్ షో బిజినెస్" చిత్రంలో దృశ్యం.
కుడివైపునఉన్న తార మేరిలిన్ మన్రో.

★ చిత్రనిర్మాణములోని సాధకబాధకాలు ★

కంటె, తారాబలం, గోచార సానుకూల్యం ముఖ్యంగా లెక్క వేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో చిత్రనిర్మాణంలో కళాత్మకదృష్టికి తావు తక్కువ.

ప్రశ్న : సరికొత్త కథలకోసం శ్రమపడి ఎవరూ అన్వేషించడం లేదంటారా ?

జవాబు : అయితే, సరికొత్త కథలకోసం కాయశక్తులా వెతికేవాళ్లు కొద్దిమంది ఉన్నారు. పరిశ్రమ ఏనాటికైనా బాగుపడేది వాళ్లవల్లనే. వారికి మానసికంగా కళాత్మకదృష్టి ఉంటుంది. అదే మనం అర్థం చేసుకోదగిన అంశం. అంచేత ప్రాధాన్యసర్లలో కూడా — మంచి చిత్రం తీయాలనే నిర్ణయం మొదటిదిగా చేసుకొని, అది ఆర్థికంగా నష్టమూ, అరిష్టమూ కాకుండా ఉండేటట్లు జాగ్రత్త తీసుకునే వాళ్ళ విషయం ఇప్పుడు ఆలోచిస్తున్నాం. కథా విషయం ఎంచుకునేటప్పుడు ఇటువంటి నిర్మాతలకూ, డైరెక్టరులకీ తేడా లేదు. ఎందుచేతంటే, ఇద్దరి ఆశయమూ కూడా మంచి చిత్రం తీయాలనే గనుక.

ప్రశ్న : మంచి చిత్రం అంటున్నారే - మంచి చిత్రం అంటే ఇలా ఉంటుంది అని నిర్వచించవచ్చునంటారా ?

జవాబు : మంచిచిత్రం అన్నదానికి శాశ్వత నిర్వచనం చేయడం కష్టం. అంతకంటె మంచి చిత్రం తీయడం సులభమేమోకూడాను. ఎందుచేతంటే, సర్వకాలాలకీ - సర్వ దేశాలకీ మంచి చిత్రాలు అని లెక్క వేయదగినవి చాలా తక్కువ. ఎక్కువ మందిని, ఎన్నిసార్లు చూసినా ఏదో విధంగా స్పందింప చేయగలిగిన చిత్రం అని నిర్ణయించడం అనుకూలమయిన నిర్వచనం. అయితే దీనికికూడా కొన్ని వైరుధ్యాలు ఉండకపోవు. దృష్టాంతంగా, గత యుద్ధ సమయంలో, యుద్ధం, వీరత్వం నిండిన చిత్రాలు విరివిగా తీశారు. అందులో కొన్ని ఈరోజున చూచినా చాలా బాగుంటాయి.

కాని వాటిఫలం సామాజికంగా అశాంతి. అంచేత సాంకేతికంగానూ, అప్పటి పరిస్థితులకీ, మంచి చిత్రాలే అయినప్పటికీ వాటికి శాశ్వత ఉపయోగం లేదు.

కనుక ఇక మంచి చిత్రం అనేదానికి కథను ఎరుకునే టప్పుడు ఎటువంటి గుణగణాలు పరికించవలసి వస్తుంది అనేది చూడాలి.

ప్రతి కథలోనూ ఒక నీతి అనేది జనానికి అందజేయాలని కొందరి అభిప్రాయం. అసలు నీతిలేనికథ ఎంత బాగున్నా జనానికి నచ్చదనే నమ్మకంగూడా చాలామందికి ఉంది. అయితే సినీమా పురాణశ్రవణం గాదు. వినోదం కల్పిస్తూ అంతర్గతంగా మంచిమార్గాలు బోధించగలగటం సినీమా సాధించగలిగిన ఆశయం. అంచేత వినోదం ఎలా కల్పించటం అనేది కథానిర్ణయంలో మొదటి భాగం అవుతోంది. కథావస్తువే కొత్తది అయినప్పుడు కొంత ఉత్సాహం, కుతూహలం జనానికి దానంతటఅదే ఏర్పడుతుంది. ప్రాత కథలే అయినప్పటికీ, క్రొత్త అర్థము స్ఫురింపచేసేట్లు చేయడానికి ఒక్కొక్కప్పుడు అవకాశం ఉంటుంది.

ఉదాహరణకి - ఈమధ్యనే ఒకనాటకం చూశాను. అందులో పాత్రలూ సన్నివేశాలూ అన్నీ ఇదివరలో ఎన్నో సాంఘిక చిత్రాలలోనూ, నాటికలలోనూ ఉన్నట్టుగానే ఉంటాయి. అయితే ఏఘట్టానికి ఆఘట్టం క్రొత్త పోకడ పోయింది.

ఒక మిల్లులో హెడ్ గుమాస్తా, అతనికి ఒక కొడుకూ కూతురూనూ, ఎదిగినవాళ్ళే. కుటుంబం ఆర్థికంగా సామాన్యం - కూతురికి పెళ్లిచేయాలంటే ఖర్చు భరించలేరు. ఆఅమ్మాయి ఒకతన్ని ప్రేమిస్తుంది. ఇంత వరకూ నడిచాక కథ అడ్డం తిరుగుతుంది. ఆఅమ్మాయి తనప్రియుణ్ణి పెళ్లిచేసుకోవడానికి తండ్రి ఒప్పుకుంటాడు. అన్న అభ్యంతర పెడతాడు. పెళ్లి అయిపోతుంది.

క్రొత్త దంపతులు బీదతనంలో పడి కష్టపడరు. అతనికి మంచి ఉద్యోగం దొరుకుతుంది ఇంకోఊళ్లో. ఒక్కడూ వెడతాడు మొదట. అక్కడే యజమానికి చదువుకున్న పెళ్లికాని కూతురు - ఆమె తండ్రికి క్రొత్తమేనేజరుని కొంతకాలం చూసిన తరువాత అల్లుడుగా చేసుకోవాలనిపిస్తుంది. ఈకుర్రాడు ఉద్యోగం పోతుందని పెళ్లయిందని చెప్పడు. ఆఅమ్మాయికూ — చాలా చనువుగా కారులో వేసుకు తిప్పుతూంటుంది. పెళ్ళి ప్రస్తావన తెస్తాడు తండ్రి. మేనేజరు ఆ అమ్మాయికేసి చూస్తాడు. —ఆవిడ ఒద్దంటుంది.

ఈలోపుగా ఇంటిదగ్గిర మొదటి పెళ్ళి చేసుకున్న అమ్మాయిమీద ఇరుగు పొరుగు వాళ్లు నిందలు వేస్తారు మొగుడు ఒదిలేశాడని. ఆవిడ అఘోరిస్తూ వీధిని పడదు, తిన్నగా గుళ్లోకివెళ్ళి ముసలి పూజారి యింట్లో 'పాచిపని చేస్తాను, దేవుడి ఫలహారం కొంత పెడుతూండు' అంటుంది. ఆయన ఊరికి జడిసి ఒప్పుకోడు. ఈవిషయంఅంతా చేతిదెబ్బలుకొట్టి పొట్టపోసుకునే ఒక రౌడీ వింటాడు. అతడు ఈఅమ్మాయికి ధైర్యంచెప్పి మొగుడు దగ్గిరకి తీసి



సారథిచిత్రం "రోజులుమారాయి"లో దృశ్యం.



ఇటీవల ఇటలీనుండి తిరిగివచ్చిన ఫిలిం తార మోహనా.

★ చిత్రనిర్మాణములోని సాధకబాధకాలు ★

కేషతా నంటాడు. వాడి మొరటుతనం చూసి వాణ్ణి నమ్మడు. వాడు మొలలో కత్తితీసి ఆవిడచేతి కిస్తాడు. నేను అవినీతిగా నడుచుకుంటే చంపేయి అంటాడు.

ఇలాగే - చివరవరకూ అనుకోని తిరుగుళ్లు తిరుగుతుంది. ప్రతిక్షణమూ కథ తెలిసినట్టుగా వస్తుంది. ఇంకో మలుపు తిరుగుతుంది. నిజానికి ప్రస్తుతం వస్తూన్న కథలన్నిటినీ జాగ్రత్తగా గమనించి ప్రతిచోటా పాత్రల ప్రవర్తనలో — సన్నివేశాలలో, క్రొత్తదనం కల్పించాడు రచయిత. ఇది కథలో క్రొత్తదనం.

ఇక పాతకథల్లో క్రొత్త కల్పనలను గురించి. శకుంతల కథలో - దుష్యంతుడు వేటకి రావడం - శకుంతలని ప్రేమించడం జరుగుతుంది. ఈతరువాత క్రొత్తపోకడ ఏమిటంటే కణ్వుడు ఆరు నెలల తరువాత తీర్థయాత్రనుంచి తిరిగిరాకుండా, వారం రోజుల్లోనే వచ్చేస్తాడు. శకుంతల ఉత్తమనిషి కాదని గ్రహిస్తాడు. అంతేకాదు. అవిడ భావిభారత చక్రవర్తిఅయే భరతుణ్ణి గర్భంలో ధరించిందని తెలుసుకుంటాడు. అంచేత తన తపోబలంచే రాజభవనాలను పరిచారికలను నిర్మించి శకుంతలకి రాణీలు ఎలా ప్రవర్తిస్తారో అభ్యాసం చేయిస్తాడు. అప్పుడు సకల మణిమయ ఆభరణాదులతో కానుకలతో రాజుగారి దర్బారుకి పంపిస్తాడు. రాజు, ఎవరునీవంటాడు - నీరాణి నంటుంది. నాకిక్కడ రాణీలకేం తక్కువ లేదంటాడు. అవిడ అభిమానపడి మేనక దగ్గరకి వెళ్లిపోయి స్వర్గంలో తపోవనంలోతిరిగి తపస్వి అయి, భరతుణ్ణి పెంచుతూంటుంది. మేనక మిష పెట్టి దుష్యంతుణ్ణి ఇంద్రుడిచేత పిలిపిస్తుంది. అతను శకుంతలని చూస్తాడు; తపస్విగా, వాంఛిస్తాడు. అవిడ స్మరణకి తెస్తుంది. అతని నిరాకరణని - అతను ఒప్పుకుంటాడు. అతను, నీ అమాయకత్వాన్ని కృత్రిమములేని సాత్విక ప్రధానమయిన నీగుణాన్ని ప్రేమించా నంటాడు. కానీ నారాణి స్వరూపం అవసరం లేదంటాడు, ఇద్దరూ రాజీపడి రాజధానికి వెడతారు.

ఇందులో కథావస్తువు పురాతనమే అయినా, కల్పన అనన్య సామాన్యము, ఇది శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారిది.

అంచేత ఇటువంటి మార్పులు క్రొత్త కథల్లోనూ కూడా ఉండవచ్చు.

ప్రశ్న : మంచి చిత్రం కావడానికి కథాకథనంలో క్రొత్తదనం ఉండాలంటారు. సరే, డైరెక్టర్లలో చాలామంది తాము తీసిన చిత్రాలతో తాము అనుకున్నట్లు తీయగలిగేమని సంతృప్తి పడగలరంటారా ?

జవాబు : నూటికి తొంభైపాళ్లు ఏడైరెక్టరూ తన అత్యుత్తమ చిత్రాన్ని తీయలేదనే నావిశ్వాసం. ఒక్క చార్లీ చాప్లిన్‌తప్ప.

దీనికి రెండు కారణాలున్నాయి.

మొదటిది కథావస్తువు విషయం. డైరక్టరుకి అన్నివిధాలా మనస్సుకి వచ్చి, తన సామర్థ్యానికి, తగిన అవకాశం ఇవ్వగలిగినవని ఏరిపెట్టుకొన్న కథలు కొన్ని ఉంటాయి. వీటిల్లో వేటిల్లోనూ పెట్టుబడిదారులకి, నిర్మాతలకి ఎక్కువ నమ్మకమూ, డైరక్టరు కున్నంత విశ్వాసం లేకపోవడమూ, అంచేత, వాళ్ళు ఆడైరక్టరునే నిర్ణయించుకున్నా, మరొక కథావస్తువుని నిర్ణయించి అతనికి అంటగట్టడమూ మామూలుగా జరుగుతూండే విషయం. ఈ పరిస్థితుల్లో పునాదిలోనే డైరక్టరుకి పూచీ లేకుండా పోతుంది. ఎప్పుడూకూడా ప్రతి డైరక్టరుకి ఏదో ఒక అపూర్వమైన, ఇతరులు ఎవరూ ఇంతవరకూ చేయని పద్ధతిలో ఒకచిత్రం తీయాలని ఉండడంఒక వ్యసనం. ఒకఅహంభావం. తనుస్వయంగా అభిమానముంచిన కథావస్తువు కుదరకపోయినప్పటికీ, తనఅసమానత్వము, ప్రతిభ, నిపుణత, చేతికి దొరికిన కథ ద్వారానే వెల్లడి చేసుకోవడానికి అతను ప్రయత్నిస్తాడు.

పురాతనమయిన కథఅయినా, క్రొత్తపోకడలు, సంప్రదాయసిద్ధంగా ఉండేటట్లు సన్నివేశాలూ కల్పించటంలోః రచయితతో సంప్రదించి కథావిధానాన్ని అల్లటంతో డైరక్టరు బాధ్యత ప్రారంభిస్తుంది. ఆతరువాత పాటలు వ్రాయించటంలో, వాటిని సంగీతానికి అమర్చటంలో ఆఖరుని ఎడిటింగులో కూడా డైరక్టరుదే పూచీ. ఈ వివిధమయిన కార్యాలూ, నిర్వర్తించడానికి సమర్థుడయిన రచయితా, సంగీత దర్శకుడూ మొదలైనవాళ్లు ఉన్నప్పటికీ వాళ్లందరినీ తన ఊహా చిత్రానికి అనుగుణంగా పని చేయించుకోగలగటం డైరక్టరు సామర్థ్యం. కథ ఎరుకోవడంలో స్వాతంత్ర్యం లేకపోయినా, డైరక్టరుకి ఇతర వ్యక్తులు సమర్థులైనప్పుడు కొంత మంచిపని చేయగల అవకాశం ఉంటుంది. కాని సర్వకాల సర్వావస్థలయందూ సినీమా చిత్రాలకి ఒక శాపం శాశ్వతంగా ఉంటూనే ఉంటుంది. ఇది జనాదరణగురించి ఇతర కళలవలె ఇది. స్వంతంగా ఏకాంతంగా అలవాటు చేసుకొని, అభ్యసించి ఆనందించతగినకళ కాదు. గాన శిల్ప కవనములు అభ్యసించిన వాళ్ళకి ఇతరులతో సంబంధంలేదు. అధమపక్షము కళాసృష్టి చేసేటప్పుడయినా.

కాని సినీమాలో ప్రతిక్షణం ప్రతి వ్యక్తినీ, పీడించేది ఆర్థికలక్ష్యము. ఇది ఎన్నిరకాల చిక్కులయినా తేగలదు. కథావస్తువు దగ్గరనుంచి - కల్పనావిధానం వరకూ, ఎవరో ఒకరు వచ్చి ఇది జనానికి నచ్చదని, అర్థంకాదని అంటూండడం అలవాటు. అటువంటి పరిస్థితులు ఇతరులకి ఉండవు. భావోద్రేకంతో, పాటో పద్యమో రాసుకోనేవాడికి, దేశంలో నూటికి తొంభైమంది నిరక్షరకుక్షులని జ్ఞాపకం అనవసరం. అతని రచన అతనికి నచ్చినప్పుడు అమిత ఆనందం అనుభవిస్తాడు. దాని కదేసాటి. ఇతరులు మెచ్చుకొన్నప్పుడు కలిగేది ఆ ఆనందంలో ఒక వంతుమాత్రమే. అలాగే, రాగప్రస్తారం చేసుకునేటప్పుడు గాయకుడి

బొంబాయి సినిమా లేఖ :

"క్లేర్" బహుమతి ప్రదానం

"ఫిల్మ్‌ఫేర్" పత్రికవారి ద్వితీయ వార్షిక బహుమతి ప్రదానోత్సవం 3 వ తేదీన బొంబాయిలో, స్టేడియంలో జరిగింది.

ముఖ్యమంత్రి మురార్జీ అధ్యక్షత వహించిన ఆనాటి సభకు ...లోని దాదాపు ప్రతిపక్కరూ ...రు. విశేష మేమంటే పెద్దపెద్ద ...కూడా ఆరోజున స్థలం ...క్కవలసి వచ్చింది. అల ...చ్చినవారు పలువురు అలాగే ...డిపోయారు. సభలో ఎక్కడ సినిమా తారలూ, డైరెక్టర్లే. ...వని తొందరలోవుండే దిలీప్ అన్నిపనులూ మానుకొని ...డు.

మురార్జీ దేశాయి రాగానే ...రంభమైంది. మొదటగా ...ం హేమాతరం" గానం ... జానపద సంగీత సంఘం ...లెట్ ప్రదర్శనం ఇచ్చారు. ...శి గురు నాట్యగత్తెలు పాల్గొ... తరువాత గీతా రాయ్, ...తకుమార్, తలత్ మహమూద్ పాడి శ్రోతలను ముగ్ధులను చేశారు. ...టన్నిటినీ మించిన మరొక అంశం ...వాన్కూరు సోదరీత్రయంవారి నాట్య ప్రదర్శనం. లలిత, పద్మిని, రాగిణి ముగ్గురూ తిల్లానా, వటనంఅడివార్ నాట్యాలు చేశారు. బొంబాయిలో అంత చక్కని భరతనాట్య ప్రదర్శనం ఎన్నడూ చూడ లేదంటే అతిశయోక్తి కాదు. ప్రేక్షకులు తన్మయులైపోయారు. "భారత నాట్య రాణు"లనే బిరుదునకు సర్వవిధాలా తాము అర్హులమని వారు ఆరోజున నిరూపించుకొన్నారు.



"రేచుక్క-లో" ఎన్.టి. రామారావు

ఈ నాట్యరాణులు ముగ్గురూ విదేశాలలో తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఇటీవల నిశ్చయించుకొన్నారు. బ్రిటన్‌లో వీరి ప్రదర్శనాలకు ఒక లండన్ కంపెనీ ఏర్పాటు చేసింది. వేసవికాలం ముగిసే లోపున ఇప్పుడు వారు నటిస్తున్న దాదాపు పది చిత్రాలనూ ముగించుకొని ప్రపంచ పర్యటనకు బయలుదేరాలని వారి నిర్ణయం. దాదాపాక ఏడాదిపాటు యూరప్, అమెరికా, దూరప్రాచ్య దేశాలలో నాట్యప్రదర్శనా లిస్తూ వారు పర్యటిస్తారు.

ఫిల్మ్‌ఫేర్ సంపాదకుడు జె. సి. జైన్ తన స్వాగతోపన్యాసంలో ఫిలిం పరిశ్రమ సమస్యలను గూర్చి ప్రస్తావించి, ప్రభుత్వంవా రిస్తున్న బహుమతులకూ, క్లేర్ బహుమతులకూ పోటీ యేమీ లేదని అన్నారు. ప్రభుత్వంవారు కొందరు నిపుణులను నియమించి అన్ని భారతీయ భాషల చిత్రాలనూ పరిశీలన చేయించి బహుమతు లిస్తున్నారనీ, కాని క్లేర్ బహుమతులు హిందూస్థానీ చిత్రాలనే తీసుకుని పాఠకుల నిర్ణయాల ప్రకారం ఇవ్వబడుతున్నాయనీ అన్నారు.

మురార్జీ దేశాయిగారు జె. సి. జైన్ ప్రసంగానికి సమాధానమిస్తూ, ఫిలింపరిశ్రమ సమస్యలు పరిశ్రమవారి స్వయంకృతాపరాధమేననీ, దానికి ప్రభుత్వం గాని మరెవరూ గాని బాధ్యులు కారనీ అన్నారు. "మీలో మీరు పోటీపడి హానికరంగా ప్రవర్తిస్తున్నా"రని ఆయన ఫిలిం వ్యక్తులను హెచ్చరించారు. దానివలన దేశానికికూడా అపకారం జరుగుతోందని ఆయన అన్నారు.

బహుమతు లిచ్చేటప్పుడు నటుడు డేవిడ్ పేర్లు పిలవడం, ముఖ్యమంత్రి బహుమతులు తీసి శ్రీమతి సరోజ్‌కివ్వడం, ఆమె గెలిచినవారి కివ్వడం జరిగింది. గెలిచినవారు వీరు: ఉత్తమ చిత్ర నిర్మాత రాజ్‌కపూర్ (బూట్‌పాలిష్) ఉత్తమ నటి మీనాకుమారి (పరిణీత) ఉత్తమనటుడు భారత్ భూషణ్ (చైతన్య మహాప్రభు) దర్శకుడు బిమల్‌రాయ్ (పరిణీత) కథా రచయిత ముఖ్రం శర్మ (ఔలద్), సంగీత దర్శకుడు సచిన్‌దేవ వర్మ (టాక్సీడ్రైవర్) సౌండ్ రికార్డిస్ట్ ఈశాన్‌ఘోష్ (జీవన్‌జ్యోతి) ఫొటోగ్రాఫర్ తారాదత్ (బూట్‌పాలిష్) సపోర్టింగ్ నటి ఉషాకిరణ్ (బాద్‌బాన్), సపోర్టింగ్ నటుడు డేవిడ్ (బూట్‌పాలిష్).

మార్చి 14 న మురార్జీ దేశాయి గౌరవార్థం జరిగిన విందులో బహుమతి ప్రదా...



"రేచుక్క"లో అంజలీదేవి.

...న్నులు లెక్కలు వేసుకోవటం అవసరం. కాని సినీమాల్లో తుణం తుణం ...వభావాలొక్కింటియొక్క అభ్యాసాన్ని ...ంచే, అర్థిక మాంద్యాన్ని గురించి ...పొడుతారు. ఇదే ఈ పరిశ్రమకున్న ...శాపమన్నాను. కాని, ఇది ...లేకమే. ఒక్కొక్కప్పుడు కేవలం ...త్రమకూడాను. ఇటీవల జన ...శ్యం చదువుకోడం విస్మరించినా ...గాలు చూడ్డానికే అలవాటు పడ్డారు. ...మలో మంచిచెడ్డలు నిర్మాతలకంటే ...క్షే ఎక్కువగా విమర్శగా అనుభవించ గల్గుతున్నారు కూడాను.

ప్రశ్న: జనాదరణ సందేహాస్పదంగా ఉండడం ఒకశాపం అంటారన్నమాట.

జవాబు: జనాదరణ సందేహాస్పదంగా ఉంటుందేమో అని సదా భయంగా ఉండడమే శాపం. (ఆలిండియా రేడియో ప్రసారితము)



ప్లేర్ బహుమతు లందుకున్న ఉత్తమనటి మీనాకుమారి,
సపోర్టింగ్ నటి ఉషాకిరణ్.

కోత్సవం ముగిసింది. విందు తరవాత సితారా కథక్ నాట్యం చేసింది. ఈ నాట్యం చాలా అద్భుతంగా ఉన్నది. టాకీలు ప్రారంభమైన తొలిరోజులనుండీ సినిమాలలో నటిస్తున్న సితారాదేవి సుమారు రెండేండ్లనుండీ సినిమాలనుండి విరమించు కున్నది. సినిమాలలో నాట్య దర్శకత్వం స్వీకరించాలని ఇప్పుడామె అభిలషిస్తున్నది. ముఖ్యంగా కథక్ నాట్యంలో ఆమెను మించినవారు లేరు.

*　　*　　*

ఢిల్లీలో జరిగిన చలనచిత్ర గోష్ఠివలన యథార్థ ప్రయోజనం ఏమైనా వుందా అని కొందరు అభిజ్ఞులు అనుమానిస్తున్నారు. సమాచార మంత్రి డా॥ బి. వి. కెస్కార్ గోష్ఠికి హాజరు కాకపోవడం, ఆ సమయంలోనే పాట్నాలో జరిగిన బాల చిత్రోత్సవానికి ఆయన హాజరవడం చూస్తే ఫిలిం సమస్యలను పరిశీలించడానికి ప్రభుత్వం సుముఖంగా లేదనే అనుకోవాలని కొందరు భావిస్తున్నారు. కాని ఇది కేవలం అనుమానమే తప్ప మరేమీ కాదు. ప్రధాని నెహ్రూ చలనచిత్ర గోష్ఠిని ప్రా... ఫిలిం పరిశ్రమ చేసిన ...సించారు. పరిశ్రమను ఎవరు ప్రయత్నించినా ... శ్రమనే సమర్థిస్తారని ...

ఫిల్మిస్తాన్‌వారు ... చేయడానికి ఒక ఇంగ్లీషు ... న్నట్టు ప్రకటించా... "మూడవకన్ను." అది ... లోనే అకాస్ రథోన్స్కి... రవుతుంది. ఈ చిత్రం... ఇంగ్లీషు నటులే నటిస్తా... నటుడు అలెక్సు టార్సి... రాబర్టా హేన్స్ ఒక ... పాత్ర ధరిస్తారు. ఇంగ్లీషు ... లాడర్ మరొక ముఖ్యపా... ఈ నెలలోనే పని ప్రారం... లలో చిత్రం పూర్తవుతుంది ... స్టాన్లీ పారి ఫొటోగ్రఫీ దర్శ... బాగా మాట్లాడగలిగిన ... కూడా అందులో నటిస్తారు.

*　　*

ఈనెల 10వ తేదీన బిమ... "దేవదాసు" ప్రారంభమై... దిలీప్‌కుమార్, పార్వతి... సుచిత్రాసేన్ నటిస్తారు ... వైజయంతీమాల నరించ... లతో చిత్రం తీస్తున్నప్పు... సంగీతం గూర్చి బాగా ... వుంది. పూర్వపు "దేవద... సంగీతంవల్లనే సినిమా ... ఆ పూర్వ చిత్రంగా ... బడుతోంది. అందుచేత ... కుండా అప్పటి సంగీతంలో... లోని సంగీతాన్ని పోల్చియా...

ఫైన్ ఆర్ట్సు థియే...

ఈనెల 20 తేదీ సాయం... రాయనగర్, హిందీప్రచార... రంలో ఫైన్‌ఆర్ట్సు థియేటర్... కోసం, అంతర్వాణి అనే ... కలు ప్రదర్శించారు. ప్రదర్శన... విశ్వంగారు అధ్యక్షత వహించా...

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chett, S...